


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 185

సోమవారం 25-9-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సిరీస్ 2-0తో భారత్ సొంతం

ఇండోర్‌లో జరిగిన రెండో వన్డేలో 99 పరుగులతో ఆసీస్ చిత్తు - 12లో



సంక్షోభానికి దూరంగా..

వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు హెల్త్ ఇన్సూరెన్స్ అవసరం - 13లో



వందే భారత్ రైళ్లు ప్రారంభం

భారతీయుల ఆకాంక్షలకు సరితూగేలా దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి జరుగుతోందని ప్రధాని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో



ఎంపీ, ఛత్తీస్‌గఢ్‌లో గెలుపు పక్కా

రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ మంచి ఫలితాలను సాధిస్తుందని ఆ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు.

- వివరాలు 6లో

ఖలిస్తాన్ వాదులూ జాగ్రత్త!

నిజ్జర్ హత్య అనంతరం ఆ నిఘా సమాచారాన్ని అగ్రరాజ్యం అమెరికా నుంచి కెనడాకు అందినట్టు 'న్యూయార్క్ టైమ్స్' కథనం పేర్కొంది.

- వివరాలు 6లో



తొలి ఆస్టరాయిడ్ శాంపిల్ వచ్చింది

అల్లంత దూరాన అంతరిక్షంలో సేకరించిన ఆస్టరాయిడ్ తాలూకు తొలి శాంపిల్‌ను అమెరికా భూమి మీదికి తీసుకొచ్చింది.

- వివరాలు 6లో

ఎన్ని'కలల' ఎజెండాలు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెరపైకి వస్తున్న ప్రజా సమస్యలు..



- రైతులు, నిరుద్యోగులు, మహిళల దీర్ఘకాల డిమాండ్లపై దృష్టి
- కౌలు రైతులకు పథకాల నుంచి ధరణి పోర్టల్ దాకా..
- ఉద్యోగాల భర్తీ మొదలు పింఛన్ల వరకు విస్తృత చర్చ
- ఎజెండాలు సెట్ చేసే పనిలో ప్రజా సంఘాలు
- మేనిఫెస్టోల్లో చేర్చడంపై రాజకీయ పక్షాల దృష్టి
- ఆహార, ఆరోగ్య, సామాజిక భద్రతలే ప్రధానాంశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల దీర్ఘకాల డిమాండ్లు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెరపైకి వస్తున్నాయి. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, ఆదివాసీ గిరిజనులు, గ్రామీణ కూలీలు.. ఇలా పలు వర్గాల సంబంధిత అంశాలు చర్చకు వస్తున్నాయి. సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, ఆహార భద్రతల కోణంలో ఎజెండాల రూపకల్పనకు ప్రజా సంఘాలు ప్రయత్నిస్తోంటే.. ఆయా డిమాండ్లు, సమస్యల ప్రాతిపదికగా తమ పార్టీల మేనిఫెస్టోలు తయారు చేసేందుకు, ప్రజలను మరోసారి ఆశల పల్లకీలో ఊరేగించేందుకు రాజకీయ పక్షాలు సిద్ధమవుతున్నాయి.

అన్ని వర్గాల ప్రయోజనాలే లక్ష్యం

ఈసారి ఎన్నికల్లో కీలకపాత్ర పోషించే వర్గాల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా కొత్త, పాత డిమాండ్లు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా రైతాంగం, మహిళలు, నిరుద్యోగుల పక్షాన గళం వినిపిస్తోంది. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, పరిహారం, బీమా, పెట్టుబడి సాయం లాంటి పథకాల అమలు డిమాండ్లు తెరపైకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల నిర్వహించిన భారీ బహిరంగ సభలో కౌలు రైతులకు రూ.15 వేల పెట్టుబడి సాయం ఇస్తామనే వాగ్దానాన్ని కాంగ్రెస్ పార్టీ చేసింది. మిగిలిన పార్టీలు కూడా ఈ అంశంపై దృష్టి పెట్టి పనిచేస్తున్నాయి. ఆదివాసీ పోడు రైతులు, మహిళా

మిగతా 2వ పేజీలో ▶

అధ్యయనాల్లో నిమగ్నం

అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీలతో పాటు కమ్యూనిస్టులు, ఇతర పార్టీలు పలు కోణాల్లో లెక్కలు వేసుకుంటూ ఎన్నికల మేనిఫెస్టోలను రూపొందిస్తున్నాయి. ఎలాంటి అంశాలను చేర్చాలి? ఎలాంటి హామీలు ఇవ్వడం ద్వారా తమకు రాజకీయంగా ప్రయోజనం కలుగుతుందో అధ్యయనం చేస్తున్నాయి. కొన్ని పార్టీలు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే రైతు, యువత కోసం డిక్లరేషన్లను ప్రకటించడంతో పాటు ఓటర్లను ఆకట్టుకునేలా ఆరు గ్యారంటీల పేరుతో ఆరు హామీలు ప్రకటించింది. ఇక బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కూడా త్వరలోనే రాష్ట్ర ప్రజలకు భారీ నజరానా ప్రకటిస్తారనే విధంగా మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించగా, ఈ రెండు పార్టీలకు దీటుగా మేనిఫెస్టో రూపకల్పనలో కమలనాథులు నిమగ్నం అయ్యారు.

తెరపైకి వస్తున్న డిమాండ్లు ఇవే..

- → గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ విధ్వంసానికి, మహిళలపై హింసకు, మగవారి అకాల మరణాలకు కారణమవుతోన్న బెల్టు షాపులను పూర్తిగా రద్దు చేయాలి. మద్య నియంత్రణను అమలు చేయాలి. హరియాణా తరహాలో మద్యం విక్రయాలు, ఉత్పత్తిని నిషేధించే అధికారాలను గ్రామ పంచాయతీలకు ఇస్తూ చట్టం చేయాలి.
- → ఇంటర్మీడియట్ స్థాయి వరకూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వర్తింపజేయాలి.
- → అర్హులైన అన్ని గ్రామీణ కుటుంబాలకు రేషన్‌కార్డులివ్వాలి. ఆహార భద్రతా చట్టం మేరకు చిరుధాన్యాలను కూడా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించాలి.
- → రాష్ట్ర సగటు కనీస వేతనంలో 50 శాతాన్ని, ఆసరా పింఛన్ కింద అందజేయాలి. కుటుంబంలో ఒకరికి కాకుండా అర్హులైన వృద్ధులకు అందించాలి.
- → విద్యుత్ షాక్, పిడుగుపాటు, అడవి జంతువుల దాడి బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి.



● తాత్కాలిక షెడ్యూల్

డిసెంబర్ 7న అసెంబ్లీ ఎన్నికలు!

నవంబర్ 12న షెడ్యూల్ ప్రకటన, నామినేషన్ల స్వీకరణ మొదలు

డిసెంబర్ 11న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి

- తాత్కాలిక షెడ్యూల్ రూపొందించిన సీఈఓ కార్యాలయం
- దీని ఆధారంగా శాసనసభ ఎన్నికలకు విస్తృత ఏర్పాట్లు.. అటుఇటుగా ఇవే తేదీలతో వాస్తవ షెడ్యూల్ ఉండే అవకాశం

సాక్షి, హైదరాబాద్: 'అసెంబ్లీ ఎన్నికలు డిసెంబర్ 7న జరుగుతాయి. దీనికి సంబంధించి నవంబర్ 12న ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించి 19వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత నవంబర్ 22న తుది అభ్యర్థుల జాబితా(ఫారం-7ఏ) ప్రకటిస్తారు. డిసెంబర్ 11న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు'..

రాష్ట్ర శాసనసభ ఎన్నికల కసరత్తులో భాగంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) కార్యాలయం రూపొందించుకున్న ఓ తాత్కాలిక ఎన్నికల షెడ్యూల్ మాత్రమే ఇది. దీనిని అనుసరించే ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ కార్యక్రమాలకు గడువు కూడా నిర్దేశించారు. దీనికి సంబంధించిన ఫ్లెక్సీని ముద్రించి కార్యాలయ ప్రాంగణంలో ప్రదర్శనకు ఉంచారు. రాష్ట్ర శాసనసభకు 2018లో జరిగిన సాధారణ ఎన్నికల షెడ్యూల్ సైతం ఇదే కావడం గమనార్హం. అయితే కొన్నిరోజులు అటుఇటుగా ఇదే షెడ్యూల్‌తో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. వాస్తవానికి తెలంగాణతోసహా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, మిజోరం రాష్ట్రాల శాసనసభ ఎన్నికల నిర్వహణకు అక్టోబర్ తొలివారం లేదా ఆ తర్వాత ఎప్పుడైనా కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశముంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సంసిద్ధతను పరిశీలించడానికి చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ నేతృత్వంలో ఎలక్షన్ కమిషనర్లు అనూప్‌చంద్ర పాండే, అరుణ్ గోయల్‌తో కూడిన కేంద్ర ఎన్నికల సంఘం ఫుల్ బెంచ్ అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్రంలో పర్యటిస్తుంది. ఆ తర్వాత వాస్తవ ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తారు.

ఇదీ ఎన్నికల సంఘం వర్క్ క్యాలెండర్

నిర్దిష్ట తేదీలు/గడువులతో వచ్చే అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు రోజువారీగా చేయాల్సిన కార్యక్రమాలతో ఎన్నికల సంఘం ఓ క్యాలెండర్ రూపొందించింది.

అక్టోబర్‌లోగా ఈ పనులు పూర్తవ్వాలి

ఇప్పటికే ఈవీఎంలు, వీవీప్యాట్‌లకు ప్రథమ స్థాయి తనిఖీలు పూర్తయ్యాయి. ఎన్నికల సామగ్రి సమీకరణ, బ్యాలెట్ పత్రాల ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్ ఎంపిక, స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన/నిర్ధారణ, దర్యాప్తు సంస్థల నోడల్

మిగతా 10వ పేజీలో ▶

న్యూస్‌రీల్

నేడు, రేపు పలుచోట్ల మోస్తరు వర్షాలు



రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. సోమ, మంగళవారాల్లో పలుచోట్ల జల్లులు, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాష్ట్రానికి తూర్పు, ఉత్తర జిల్లాల్లోని కొన్నిచోట్ల భారీ వర్షాలు నమోదవుతాయని సూచించింది.

- వివరాలు 3లో

లైక్ కొడితే రూ.50.. కామెంట్ పెడితే రూ.100



'మేం పంపే ఇన్‌స్టాగ్రామ్ వీడియోలు, ఫొటోలకు లైక్ కొట్టి స్క్రీన్‌షాట్ పంపితే రూ.100 చొప్పున మీ ఖాతాలో వేస్తాం. మేం చెప్పిన యూట్యూబ్ వీడియోకు లైక్‌కొడితే రూ.50 చొప్పున ఇస్తాం..' అంటూ టెలిగ్రామ్ వేదికగా జరుగుతున్న సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- వివరాలు 2లో

పగటి దోమ కాటు.. ప్రమాదం సుమా!



పగటిపూట కుట్టే దోమ ప్రాణాంతకంగా పరిణమిస్తోంది. డెంగీ వ్యాప్తికి కారకమైన ఈడిస్ ఈజిప్టి దోమల కాటుతో జ్వర బాధితులు పెరుగుతున్నారు. దోమల ఉత్పత్తికి కారణమయ్యే నిల్వ నీరు లేకుండా జాగ్రత్త వహించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

- వివరాలు 14లో

బీజేపీ అసంతృప్తుల వరుస భేటీలు

- తాజాగా ఓ ఫామ్‌హౌస్‌లో సమావేశమైన ముఖ్య నేతలు
- వీరెందుకు భేటీ అవుతున్నారనే దానిపై పార్టీలో చర్చ
- కాంగ్రెస్‌లో చేరేందుకేనా అన్న సందేహాలు

2 లో

ఇదండీ సంగతి



..మనకు 'సినిమా' చూపించరు కదా!

5 వరకు రిమాండ్ పొడిగింపు

చంద్రబాబు పోలీసు కస్టడీ ముగియడంతో ఏసీబీ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు

సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరుపరిచిన అధికారులు



- థర్డ్ డిగ్రీ ప్రయోగించారా? భౌతికంగా ఏమైనా ఇబ్బంది పెట్టారా? అని ప్రశ్నించిన కోర్టు
- అలాంటిది ఏమీ లేదు.. అన్యాయంగా ఇరికించారు.. అక్రమంగా జైల్లో ఉంచారన్న బాబు
- దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది.. అన్ని డాక్యుమెంట్లు ఇవ్వడం సాధ్యం కాదన్న న్యాయస్థానం
- ఆధారాలన్నింటినీ పరిశీలించాకే మీ పాత్రపై ప్రాథమిక నిర్ధారణకు వచ్చాం.. అందుకే మిమ్మల్ని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపామన్న కోర్టు
- రిమాండ్ ఉత్తర్వులు యాంత్రికంగా ఇచ్చారన్న చంద్రబాబు న్యాయవాది.. తీవ్రంగా స్పందించిన కోర్టు

5 లో

మళ్లీ ఆవు కథే!

- సీఐడీ విచారణకు సహకరించని చంద్రబాబు
- సుదీర్ఘ రాజకీయ అనుభవం, దీర్ఘకాలం సీఎంనంటూ దాటవేత యత్నాలు
- ముగిసిన రెండు రోజుల కస్టడీ విచారణ

5 లో



2023.. హాటెస్ట్ వేసవి

- కనీవినీ ఎరుగని వడగాడ్పులు
- గ్లోబల్ వార్మింగ్, ఉద్గారాలే కారణం
- పులి మీద పుట్రలా ఎల్ నినో

2023లో ఎండలు అక్షరాలా మండిపోయాయి. 1880లో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వివరాలు నమోదు చేయడం మొదలు పెట్టిన నాటినుంచి అత్యంత వేడిమితో కూడినదిగా 'ఈ ఏడాది' రికార్డు సృష్టించింది. ఎంతగా అంటే, మానవ చరిత్రలో రికార్డయిన అత్యంత హెచ్చు ఉష్ణోగ్రతలు ఈ ఎండాకాలంలోనే నమోదయ్యాయి. ఈ ఆందోళనకర గణాంకాలను న్యూయార్క్‌లోని నాసాకు చెందిన గొడార్డ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ వెల్లడించింది. ఇది నిజంగా పెను ప్రమాద సూచికేనని పర్యావరణ ప్రియులతో పాటు సైంటిస్టులు, పర్యావరణవేత్తలు అంటున్నారు.

6 లో

రియల్టీ సంక్షోభంలో చైనా

దేశం నిండా ఖాళీ ఇళ్లే!

చైనా తీవ్ర రియల్టీ సంక్షోభంలో కూరుకుపోతోందా? దేశవ్యాప్తంగా ఇప్పటికే జనాభాకు మించి గృహాలున్నాయా? అవి చాలవని ఇంకా ఎటు చూస్తే అటు భారీ సంఖ్యలో గృహ నిర్మాణ ప్రాజెక్టులే కనిపిస్తున్నాయా? అవుననే అంటున్నారు చైనా ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగి ఒకరు! తమ ఆర్థిక వ్యవస్థ కళకళలాడుతోందని చైనా ప్రభుత్వం బయటికి ఎన్ని మాటలు చెబుతున్నా, రియల్టీ సంక్షోభం విస్తరిస్తోంది.

వివరాలు 6లో



◀ బీసీ నేతల సమావేశంలో పాల్గొన్న మహేశ్‌కుమార్‌గౌడ్, వీహెచ్, పొన్నాల, మధుయాష్కీ గౌడ్, పొన్నం, చెరుకు సుధాకర్ తదితరులు

ఢిల్లీలోనే తేల్చుకుందాం

టికెట్ల కేటాయింపుపై రాష్ట్ర కాంగ్రెస్ బీసీ నేతల సమావేశం నిర్ణయం

- 34 స్థానాలు కేటాయించాల్సిందే..
- నేడు లేదా రేపు 'చలో ఢిల్లీ' నిర్వహించే యోచన

సాక్షి, హైదరాబాద్: బలహీన వర్గాల నేతలకు తగినన్ని టికెట్లు కేటాయించాల్సిందేనని, ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు 34 స్థానాలు ఇవ్వాలని రాష్ట్ర కాంగ్రెస్ బీసీ నేతల సమావేశం డిమాండ్ చేసింది. ఈ విషయంలో ఎందాకైనా కొట్లాడాలని, ఢిల్లీ వెళ్లి సోనియా, రాహుల్, మల్లికార్జున ఖర్గే సమక్షంలోనే తేల్చుకోవాలని నిర్ణయించింది. ఇటీవల జరిగిన

మిగతా 3వ పేజీలో ▶

డిగ్రీ చదివినా తక్షణ ఉపాధి!

విద్యార్థులను ఆకర్షిస్తున్న కొత్త కోర్సులు



- మూడేళ్ల స్థానంలో నాలుగేళ్ల ఆనర్స్ హవా
- సంప్రదాయ కోర్సులకు సాంకేతికత తోడు
- బీకాం, బీఎస్సీ కోర్సుల్లో సమూల మార్పులు
- కాంబినేషన్, తక్షణ ఉపాధి అవకాశాలున్న స్కిల్ అనుసంధాన కోర్సులకు పెరుగుతున్న డిమాండ్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా డిగ్రీ కోర్సుల్లో మార్పులొస్తున్నాయి. విదేశీ అధ్యయనాల మేరకు బోధన ప్రణాళికలు రూపొందుతున్నాయి. పారిశ్రామిక అవసరాలే గీటురాయిగా డిగ్రీలో నైపుణ్యాన్ని మేళవిస్తున్నారు. మూడేళ్ళ స్థానంలో నాలుగేళ్ళ ఆనర్స్ కోర్సులు వస్తున్నాయి. డిగ్రీ చేసినా ఉపాధి ఖాయమనే భరోసా కల్పిస్తున్నాయి. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఆనర్స్ డిగ్రీ కోర్సులను నాలుగేళ్ళతో పరిమితంగా ప్రవేశపెట్టారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఈ విధంగా ప్రవేశపెడుతున్న అనేక మార్పుల పురోగతిని కేంద్ర విద్యాశాఖ ఇటీవల సమీక్షించింది. మరోవైపు కాంబినేషన్ కోర్సులు, తక్షణ ఉపాధి అవకాశాలున్న స్కిల్ అనుసంధాన కోర్సులకు డిమాండ్ పెరుగుతోందని యూజీసీ తన నివేదికలో పేర్కొంది. ఇక మీదట సాధారణ డిగ్రీ కోర్సుల స్థానంలో సాంకేతికత తోడైన డిగ్రీ కోర్సులు ప్రాచుర్యం పొందుతాయని తెలిపింది. కంప్యూటర్స్, డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర కోర్సుల మేళవింపుతో కొత్త డిగ్రీ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఆర్ట్స్‌తో కంప్యూటర్

మిగతా 3వ పేజీలో ▶

క్లుప్తంగా...

అయోవా సదస్సుకు కేటీఆర్, సింగిరెడ్డి




సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఆహార భద్రత, పోషకాహారానికి సంబంధించిన సమస్యలను చర్చించి పరిష్కరించే వేదికకు కేంద్రంగా పని చేస్తున్న నార్మన్ బోర్లాగ్ ఇంటర్నేషనల్ డైలాగ్ అక్టోబర్ 24 నుంచి 26 వరకు అమెరికాలోని అయోవాలో ప్రత్యేక సదస్సును నిర్వహిస్తోంది. 65 దేశాలకు పైబడి సభ్యులున్న ఈ సంస్థ నిర్వహిస్తున్న సదస్సుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కే.తారకరామారావుకు ఆహ్వానం అందింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగంలో సాధించిన పురోగతిని మంత్రి ఈ వేదికగా వివరించనున్నారు. ఈ సదస్సుకు కేటీఆర్‌తో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కూడా వెళ్లనున్నారు. ఈ సదస్సుకు ఆహ్వానం అందడం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కె.చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో తెలంగాణ వ్యవసాయరంగం సాధించిన అపూర్వ విజయగాథను చాటిచెప్పేందుకు ఇదో చక్కటి వేదిక అవుతుందన్నారు. ఈ సదస్సులో ప్రత్యక్షంగా 1,200 కంటే ఎక్కువ మంది ప్రతినిధులు పాల్గొంటారు. ఆహార నాణ్యత, అందరికీ ఆహార లభ్యతను పెంచే ఆహార, వ్యవసాయ పరిష్కారాలను ఈ సదస్సులో చర్చిస్తారు.

'కేజ్రీవాల్‌కు ప్రజాదరణతో మోదీ భయపడుతున్నారు'



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు దేశవ్యాప్తంగా పెరుగుతున్న ప్రజాదరణ చూసి ప్రధాని నరేంద్రమోదీ భయపడుతున్నారని ఢిల్లీ శాసన సభ్యుడు, ఆప్ దక్షిణ భారత ఇన్‌చార్జ్ సోమనాథ్ భారతి అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆమ్ ఆద్మీ పార్టీ బీజేపీకి సవాల్‌గా మారిందని, అందుకే ఆప్ నేతలను టార్గెట్ చేసి బూటకపు కేసులుపెట్టి జైళ్లకు పంపుతున్నారని విమర్శించారు. ఆదివారం ఆర్టీసీ కళ్యాణ మండపంలో ఆప్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో సామాన్యుడి సమరభేరి సభను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమనాథ్ భారతీ మాట్లాడుతూ, పేద ప్రజల అభ్యున్నతి కోసం, వారి సంక్షేమం కోసం తమ పార్టీ పని చేస్తుందన్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం వంటి సమస్యలను పట్టించుకోకుండా దేశాన్ని అమ్మే పనిలో ప్రధాని ఉన్నారని విమర్శించారు. ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు శోభన్ బూక్యా, అధికార ప్రతినిధి వినయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీగురు భగవత్ పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్

హైదరాబాద్: మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం శ్రీగురు భగవత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత డాక్టర్ చంద్రభాను సత్పతి రాసిన 'శ్రీ గురు భగవత్' పుస్తకాన్ని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దక్షిణ తమిళనాడు నిర్లక్ష్యానికి గురవుతోందని, ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే ప్రధాని నరేంద్ర మోదీ తిరునల్వేలి వంటి ప్రాంతానికి వందేభారత్ రైలును ప్రారంభించారని చెప్పారు. ఈ కార్యక్రమానికి వచ్చే ముందు తనకు నీరసంగా ఉందని, కానీ ఇక్కడికి వచ్చాక ఉత్సాహం కలుగుతోందన్నారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అనేక మంది వ్యక్తులను సంస్కరించిన గొప్ప వ్యక్తి డాక్టర్ చంద్రభాను సత్పతి అన్నారు. ఆయన రచించిన శ్రీ గురు భగవత్ పుస్తకం 15 భాషలలో అనువాదం కావడం గొప్ప విషయమన్నారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సినీ నటుడు తనికెళ్ల భరణి తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సందర్భంగా శ్రీ గురు భగవత్ భక్తి గీతాలు, యూట్యూబ్ చానల్‌ను కూడా అతిథులు ఆవిష్కరించారు.

నేటి భవితలో..

- హయ్యర్ ఎడ్యుకేషన్: **పీహెచ్‌డీ లేకున్నా.. అసిస్టెంట్ ప్రొఫెసర్!** గతంలో కళాశాల స్థాయిలో అధ్యాపక పోస్టులకు పోటీ పడాలంటే.. పీహెచ్‌డీ తప్పనిసరి! ఇకపై పీజీ,నెట్ అర్హతలతోనే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీ పడొచ్చు. పీహెచ్‌డీ లేకున్నా.. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకం పొందొచ్చంటూ.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇటీవల మార్గనిర్దేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ తాజా మార్గనిర్దేశాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత ప్రమాణాలు, ఎంపిక విధానం, పదోన్నతుల ప్రక్రియ తదితర వివరాలు..
- గ్రూప్స్ ప్రత్యేకం–కరెంట్ అఫైర్స్: పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

లైక్ కొడితే రూ. 50 | కామెంట్ పెడితే రూ. 100

టెలిగ్రామ్‌లో సరికొత్త సైబర్ మోసం

టాస్క్ బేస్డ్ స్కామ్‌ల విషయంలో జరభద్రం

సైబర్ భద్రత నిపుణుల సూచన, హెచ్చరిక

కూర్చున్నచోటే రోజుకు రూ.వేల సంపాదన మీ సొంతం.. మీరు చేయాల్సిందల్లా మేం పంపే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లను ఓపెన్ చేసి వాటిలోని వీడియోలు, ఫొటోలకు లైక్ కొట్టడమే.. అలా లైక్ కొట్టిన స్క్రీన్‌షాట్ మాకు పంపితే ఒక్కో అకౌంట్ స్క్రీన్‌షాట్‌కు రూ.100 చొప్పున మీ ఖాతాలో జమ చేస్తాం... మేం చెప్పిన యూట్యూబ్ వీడియోకు లైక్ కొడితే రూ.50... మేం చెప్పిన సినిమా రివ్యూకు ఐదు పాయింట్లు ఇస్తే.. మీ ఖాతాల్లో రూ.150 వేస్తాం....



ఏంటి ఇదంతా

ఇదో సరికొత్త సైబర్ మోసం.. టెలిగ్రామ్ వేదికగా జరుగుతున్న ఈ తరహా మోసాలు ఇప్పుడు పెరిగాయని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు.

టాస్క్‌బేస్డ్ స్కాం అంటే..

సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్తదారులు వెతుకుతూనే ఉన్నారు. టెలిగ్రామ్ యూజర్లను టార్గెట్ చేసుకుని టాస్క్‌బేస్డ్ స్కాంలు చేస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. టెలిగ్రామ్ యూజర్లకు సైబర్ నేరగాళ్లు కొన్ని మెసేజ్‌లు పంపుతూ అందులో పేర్కొన్న టాస్క్‌పూర్తి చేస్తే డబ్బులు మీ ఖాతాలో వేస్తామని చెప్పే మోసాన్నే టాస్క్‌బేస్డ్ స్కాంగా పేర్కొంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న టాస్క్‌బేస్డ్ మోసాలు చూస్తే...

ఈ ఖాతాలు ఫాలో కండి.. టెలిగ్రామ్ యూజర్లకు పంపే మెసేజ్‌లలో మేం పంపే లింక్ ఓపెన్ చేసి ఈ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలను ఫాలో అవుతూ, వాటిని ఓపెన్ చేసి స్క్రీన్‌షాట్ తీసి పంపితే డబ్బులు పంపుతామంటారు. రోజుకు 30 నుంచి 50 ఖాతాలు ఫాలో కావాలని చెబుతారు.

యూ ట్యూబ్ వీడియోలకు లైక్‌లు..: సైబర్ మోసగాళ్లు పంపే మెసేజ్‌లలో కొన్ని యూట్యూబ్ వీడియోల లింక్‌లు పెడతారు. వాటిని ఓపెన్ చేసి ఆ వీడియోకు కాసేపు వాచ్ చేయడంతోపాటు లైక్ కొడితే మీ ఖాతాలో డబ్బులు వేస్తామని నమ్మబలుకుతారు.

హోటళ్లు, రెస్టారెంట్లకు రేటింగ్ పేరిట..: ఫలానా హోటల్, లేదంటే ఒక ఏరియాలోని రెస్టారెంట్లో సదుపాయాలు చాలా బాగున్నాయని, ఫుడ్ ఐటమ్స్ బాగున్నాయని, ఆఫర్లు బాగున్నాయని..ఇలాంటి రివ్యూలు, రేటింగ్ ఇచ్చినందుకు డబ్బులు ఇస్తామని చెబుతుంటారు.

సినిమా రివ్యూలకు రేటింగ్.. మేం పంపే లింక్ ఓపెన్ చేసి అందులోని వెబ్‌సైట్‌లో ఉన్న సినిమా రివ్యూలకు రేటింగ్ ఇవ్వాలని టాస్క్ ఇస్తారు..ఇలా ఒక్కో రివ్యూకు రేటింగ్ ఇస్తే మీ బ్యాంకు ఖాతాలో డబ్బులు వేస్తామని టాస్క్ ఇస్తారు.

మోసానికి తెరతీస్తారు ఇలా..

ముందుగా ఇచ్చిన టాస్క్‌పూర్తి చేసిన తర్వాత, మీ బ్యాంకు ఖాతాలోకి డబ్బులు జమ చేస్తామంటూ పేరు, వయస్సు, వృత్తి, వాట్సాప్ నంబర్, ఏ ప్రాంతంలో ఉంటారు.. విద్యార్హతలు, బ్యాంకు ఖాతా నంబర్, బ్యాంకు పేరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఇలా పూర్తి వివరాలు సేకరిస్తారు. మొదట ఒకటి రెండు సార్లు మన బ్యాంకు ఖాతాలోకి చిన్నచిన్న మొత్తాలు జమ చేసి నమ్మకాన్ని పెంచుతారు. ఆ తర్వాత మన బ్యాంకు ఖాతాలోంచి ఆన్‌లైన్‌లో డబ్బులు కొల్లగొట్టే మోసానికి తెరతీస్తారు. మన పూర్తి వివరాలతోపాటు, మన ఫోన్, కంప్యూటర్‌ను వారి అధీనంలోకి తీసుకుని ఓటీపీలను సైతం తెలుసుకుని, మన బ్యాంకు ఖాతాలు లూటీ చేస్తారని సైబర్ భద్రత నిపుణులు హెచ్చరిస్తున్నారు..

ఇలాంటి మెసేజ్‌లు చూస్తే అనుమానించాల్సిందే..

- ఆన్‌లైన్‌లో సైబర్ మోసాలు పెరుగుతున్నందున వీలైనంత వరకు అనుమానాస్పద మెసేజ్‌లలోని లింక్‌లపై ఎట్టిపరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దు.
- అడ్డగోలు లాభాలు ఇస్తామని ఊదరగొడుతున్నారంటే అది కచ్చితంగా సైబర్ మోసమని గ్రహించాలి.
- వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు అడుగుతున్నట్టు గమనిస్తే జాగ్రత్తపడాలి.
- అపరిచిత వ్యక్తులు ఆన్‌లైన్‌లో మనకు పంపే మెసేజ్‌లను నమ్మవద్దు.



కాచిగూడ రైల్వే స్టేషన్‌లో వందేభారత్ రైలు ప్రారంభోత్సవంలో అభివాదం చేస్తున్న కిషన్‌రెడ్డి

పట్టాలెక్కిన యశ్వంతపూర్ | వందేభారత్

- ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన ప్రధాని
- దేశవ్యాప్తంగా 9 వందేభారత్ రైళ్ల ప్రారంభం

సాక్షి, హైదరాబాద్/కాచిగూడ: తెలంగాణకు మూడో వందేభారత్ రైలుగా కేటాయించిన కాచిగూడ–యశ్వంతపూర్ వందేభారత్ రైలు పట్టాలెక్కింది. ఆదివారం దేశవ్యాప్తంగా ఒకేసారి 9 వందేభారత్ రైళ్లను ప్రారంభించే కార్యక్రమంలో భాగంగా, ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీడియోకాన్ఫరెన్సు ద్వారా జెండా ఊపి దాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు కాచిగూడ స్టేషన్ నుంచి బెంగళూరులోని యశ్వంతపూర్ స్టేషన్‌కు బయలుదేరింది. కాచిగూడ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, హైదరాబాద్ డీఆర్ఎం లోకేష్ విష్ణోయ్, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం రూ.9 లక్షల కోట్లు ఇచ్చింది..

ప్రధానిగా మోదీ బాధ్యతలు తీసుకున్నాక తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో రూ.9 లక్షల కోట్లు ఖర్చుచేసిందని కిషన్‌రెడ్డి అన్నారు. వందేభారత్ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి రైల్వే ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతూ వచ్చిందని, మోదీ దీన్ని గుర్తించి తెలంగాణకు న్యాయం చేస్తున్నారన్నారు. సంవత్సరానికి 55 కి.మీ. చొప్పున కొత్త లైన్లు ఏర్పాటు చేస్తుండగా, ప్రస్తుతం రూ.31,221 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు రాష్ట్రంలో జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని రైల్వే స్టేషన్లను రూ.2,300 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని, త్వరలో మరిన్ని ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. కాజీపేటలో వ్యాగన్ తయారీ కర్మాగారం అందుబాటులోకి వస్తోందని, అక్కడ భవిష్యత్తులో రైల్వేకు అవసరమైన ఇతర పరికరాలు కూడా తయారవుతాయని వివరించారు.

మంగళవారం ఉదయం నుంచి..

సాధారణ ప్రయాణికులు లేకుండా తొలిరోజు బెంగళూరు వెళ్లిన రైలు, సోమవారం మధ్యాహ్నం 2.45 గంటలకు అక్కడి నుంచి ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయల్దేరనుంది. మంగళవారం ఉదయం 5.30 గంటలకు కాచిగూడ నుంచి ప్రయాణికులతో బెంగళూరు బయల్దేరనుంది.

బీజేపీ అసంతృప్తుల వరుస భేటీలు

- తాజాగా ఓ ఫామ్‌హౌస్‌లో సమావేశమైన ముఖ్య నేతలు
- వీరెందుకు భేటీ అవుతున్నారనే దానిపై పార్టీలో చర్చ
- కాంగ్రెస్‌లో చేరేందుకేనా అన్న సందేహాలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ ముఖ్యనేతలు కొందరు తరచూ సమావేశం కావడం పార్టీలో కలకలం సృష్టిస్తోంది. అసంతృప్త నేతలుగా భావిస్తున్న వీరంతా ఇటీవలి కాలంలో రెండు, మూడుసార్లు భేటీ అవడంతో.. వీరెందుకు సమావేశమవుతున్నారు? ముఖ్యోద్దేశమేమిటి? అనే చర్చ సాగుతోంది. పార్టీని వీడెందుకేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వీరిలో కొందరు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రాథమికంగా చర్చలు కూడా జరిపినట్టు జరుగుతున్న ప్రచారం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. అయితే బీఆర్ఎస్‌తో బీజేపీకి దోస్తీ లేదని అధినాయకత్వం సుస్పష్టం చేయడంతో పాటు, ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత అరెస్టు, కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిపై విచారణ కమిటీ వేయడం, తదితర చర్యలు తీసుకోవడం ద్వారా అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు, పార్టీ కేడర్‌కు స్పష్టత ఇవ్వాలనేది కొందరు నేతల డిమాండ్‌గా ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో కొందరు నేతలు ఏకంగా మోదీ, అమిత్ షా, ఇతర జాతీయ నాయకత్వం అనుసరిస్తున్న విధానాలను తప్పు బట్టడమే కాకుండా, తమకు తగిన గుర్తింపు, ప్రాధాన్యతనివ్వకపోవడం లాంటి అంశాలను లేవనెత్తుతుండడంతో..అసలు ఏం జరుగుతోంది? అనే సందేహాలు రాష్ట్ర నేతలను, పార్టీ కేడర్‌ను పట్టి పీడిస్తున్నాయి.

ఫామ్‌హౌస్‌లో పలు అంశాలపై చర్చ

తాజాగా ఆదివారం నగర శివార్లలోని ఓ ఫామ్‌హౌస్‌లో జరిగిన సమావేశానికి జాతీయ కార్యవర్గసభ్యుడు జి.వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, విజయశాంతి, మాజీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జి.విజయరామారావు తదితరులు హాజరైనట్లు సమాచారం. త్వరలోనే ఢిల్లీ వెళ్లి అమిత్‌షాను కలిసి తమ అభిప్రాయాలను స్పష్టం చేయాలని, తాము చేసిన సూచనలకు అనుగుణంగా జాతీయ నాయకత్వం స్పందించకపోతే తదుపరి కార్యాచరణపై నిర్ణయానికి రావాలనే అభిప్రాయానికి వీరు వచ్చినట్టుగా తెలుస్తోంది. రాష్ట్ర పార్టీలో జరుగుతున్న పరిణామాలు, తమ ప్రమేయం, సంబంధం లేకుండానే కొందరిని బీజేపీలో చేర్చుకోవడం, పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌కు జాతీయ నాయకత్వం అత్యధిక ప్రాధాన్యతనివ్వడం.. ముఖ్యనేతలుగా, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులుగా ఉన్న తమకు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వకుండా అవమానించే పద్ధతుల్లో వ్యవహరించడం తదితర అంశాలు ఫామ్‌హౌస్ సమావేశంలో చర్చకు వచ్చినట్టు తెలిసింది. కాగా, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి సోమవారం పలువురు నేతలు, తన శ్రేయోభిలాషులు, అనుయాయులతో సమావేశం ఏర్పాటు చేసినట్టు పార్టీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీజేపీలోనే కొనసాగాలా? కాంగ్రెస్‌లో చేరాలా.. వద్దా? వంటి అంశాలపై చర్చించేందుకే ఈ భేటీ నిర్వహిస్తున్నారని అంటున్నారు.



ర్యాలీలో పాల్గొన్న కిషన్‌రెడ్డి. చిత్రంలో ఆకుల విజయ, లక్ష్మణ్, జయసుధ, రాణిరుద్రమ, కార్తీకరెడ్డి

అమరవీరుల స్తూపం నుంచి | బీజేపీ ర్యాలీ

- మహిళా బిల్లుకు ఆమోదంపై మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ ర్యాలీ
- పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు

సాక్షి, హైదరాబాద్: మహిళలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ నారీ శక్తి వందన్ అధినియమ్ బిల్లు ఆమోదానికి కృషి చేసిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ రాష్ట్ర బీజేపీ నేతలు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారమిక్కడ గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం నుంచి నాంపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ జరిపారు. మొదటగా అమరవీరులకు నివాళులర్పించి, పెద్ద సంఖ్యలో మహిళలతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీలో బీజేపీ పార్లమెంటరీబోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, పార్టీ నేతలు దుగ్యాల ప్రదీప్‌కుమార్, చింతల రామచంద్రారెడ్డి, సినీనటి జయసుధ, ఆకుల విజయ, బండా కార్తీకరెడ్డి, రాణీరుద్రమ ఇతర నాయకులు, కార్యకర్తలు వెంటనడిచారు. ఈ సందర్భంగా ఎటు చూసినా కాషాయ జెండా పట్టుకుని జయహో మోదీ అంటూ నినాదాలు చేశారు.

కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి

ఢిల్లీలోని నూతన పార్లమెంట్ భవనంలో మొట్టమొదటి బిల్లు మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం చరిత్రాత్మక సందర్భమని కిషన్‌రెడ్డి అన్నారు. అరవై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో పార్లమెంటులో అనేకమార్లు చర్చ జరిగినప్పటికీ మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు నోచుకోలేదన్నారు.'సుమారు 50 శాతం మంది మహిళలున్న తెలంగాణలో.. తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కేసీఆర్.. తన మంత్రివర్గంలో మహిళలకు స్థానం కల్పించలేదు. పార్లమెంటులో మహిళా బిల్లును వ్యతిరేకించిన ఏకైక పార్టీ మజ్లిస్. కేసీఆర్ గురువు అసదుద్దీన్ ఓవైసీ. పార్లమెంటులో మహిళా బిల్లును వ్యతిరేకించిన ఎంఐఎంతో అంటకాగుతున్న కేసీఆర్.. ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి'అని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన బీసీలు: కిషన్‌రెడ్డి

సొండి, శిష్ట కరణాలను ఓబీసీలోకి చేర్చేందుకు బీజేపీ సిద్ధం: డా.కె.లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్నివర్గాలకు అండగా నిలుస్తుండగా, రాష్ట్రంలో కె.చంద్రశేఖర్ రావు పాలనలో బీసీలు నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురవుతున్నారని కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సొండి కుల సంక్షేమ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీకి అండగా నిలిస్తే అన్నివర్గాలూ అభివృద్ధి చెందుతాయన్నారు. పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ సొండి, శిష్ట కరణం కులాలను ఓబీసీ జాబితాల్లోకి చేర్చేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. 'దశాబ్దాలుగా ఈ రాష్ట్రంలో ఉంటున్నా ఓబీసీ జాబితాలో లేరు. పాలకులు, ప్రభుత్వాలు మారినా సమస్య తీరలేదు.. 29 కులాల లిస్ట్ పెండింగ్‌లో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాంకేతిక పరమైన అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఆ సాంకేతిక సమస్యలు లేకుండా పంపాలని కేంద్రం కోరింది. మీరు రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి ఇక్కడ నుంచి పంపిస్తే వెంటనే సాధ్యం అవుతుంది. మీ చిరకాల వాంఛ నెరవేరుతుంది'అని చెప్పారు. తెలంగాణా వచ్చాక 26 కులాలను బీసీ కులాలను తొలగించారని ఆయన ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను పట్టించుకున్న నాయకుడు ప్రధానమంత్రి నరేంద్రమోడీ మాత్రమేనని, అందుకే మనమంతా మోదీకి అండగా ఉందామని లక్ష్మణ్ పిలుపునిచ్చారు.

ఎన్ని 'కలల' ఎజెండాలు

▶ మొదటి పేజీ తరువాయి

రైతులు, దేవాదాయ భూములను సాగు చేసే వారికి కూడా పెట్టుబడి సాయం పథకం అమలు డిమాండ్ వినిపిస్తోంది. మద్దతు ధరల గ్యారంటీ చట్టం అమలు, కేవలం వరి ధాన్యమే కాకుండా పప్పు, చిరు ధాన్యాల సేకరణ, ప్రతి మండలానికి వ్యవసాయ మార్కెట్ యార్డ్, సాగు, పశుపోషణ ఆధారిత కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటు లాంటి అంశాలతో పాటు మహిళలు, నిరుద్యోగులకు ఆసరాగా ఉండే పథకాలను అమలు చేయాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి. వీటితో పాటు గ్రామీణ ఉపాధి చట్టం పకడ్బందీ అమలు, రాష్ట్రంలోని చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణ, నకిలీ విత్తనాల నిరోధానికి ప్రత్యేక చట్టం, అసైన్డ్ భూములపై హక్కులు, అటవీ హక్కుల అమలు లాంటి దీర్ఘకాలిక డిమాండ్లు కూడా మరోసారి చర్చనీయాంశమవుతున్నాయి. ఇక భూమి సంబంధిత సమస్యలు, ముఖ్యంగా ధరణి పోర్టల్‌ను ప్రజా సంఘాలు, పార్టీలు తమ ఎజెండాలో చేర్చుతున్నాయి. ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని కాంగ్రెస్ అంటుంటే, అలా అంటున్న కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలపాలని బీఆర్ఎస్, మెరుగైన రెవెన్యూ విధానాన్ని తెస్తామంటూ బీజేపీ 'ధరణి'ని ఒక ప్రధాన అంశంగా చేసుకుని ముందుకు వెళుతున్నాయి. ఆసరా పింఛన్లు, రైతుల పెట్టుబడి సాయం, ఇళ్లు లేని పేదలకు ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు, గిరిజన బంధు, మహిళలకు ప్రత్యేక నగదు సాయం, గ్యాస్ సిలిండర్ల ధరల తగ్గింపు, ఉద్యోగాల భర్తీ లాంటి వాటిని అస్త్రాలుగా చేసుకునే పనిలో రాజకీయ పార్టీలు ఉన్నాయి. మేనిఫెస్టోల్లో ఆయా సమస్యలు, అంశాలను చేర్చడంపై దృష్టి పెడుతున్నాయి.

రైతు స్వరాజ్య వేదిక ఎజెండాపై చర్చ

రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రైతు స్వరాజ్య వేదిక తన ఎజెండాను రాజకీయ పార్టీల ముందుకు తెచ్చింది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీతో సమావేశమైన వేదిక ప్రతినిధులు.. తమ డిమాండ్లను మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. త్వరలోనే బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీల నేతలను కలిసేందుకు వారు ప్రయత్నాలు చేస్తున్నారు. కౌలు రైతుల గుర్తింపు, రైతుబంధు పథకం అమలు, పంటల సేకరణ, మద్దతు ధరలు, మార్కెటింగ్, రైతు ఆదాయం పెంపు, వ్యవసాయ మార్కెట్ యార్డుల విస్తరణ, గ్రామీణ పరిశ్రమల ఏర్పాటు, వ్యవసాయ కుటుంబాల కోసం ప్రత్యేక కమిషన్, వాస్తవ సాగుదారులకే రుణాలు, రాష్ట్ర స్థాయి విత్తన చట్టం, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టానికి సాయం, పంటల బీమా, భూసమస్యలు, ధరణి పోర్టల్ వినియోగం, మహిళా రైతులు, వ్యవసాయ కూలీల హక్కులు, గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల ప్రజలందరికీ ఆహార, ఆరోగ్య, సామాజిక భద్రత తదితర అంశాలతో రూపొందిన ఎజెండా చర్చనీయాంశమవుతోంది.

నిమ్స్‌లో చిన్నారులకు ఆపరేషన్లు షురూ

హైదరాబాద్: నిమ్స్ కార్డియా థొరాసిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో చార్లిస్ హార్ట్ హీరోస్ పేరిట ప్రత్యేక గుండె వైద్య శస్త్రచికిత్సల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జరిగే ఈ శిబిరంలో రోజుల వయసున్న శిశువుల నుంచి చిన్నారులకు గుండెలో రంధ్రం, గుండె సంబంధిత వ్యాధులకు ఆపరేషన్లు చేయనున్నారు. ఇందులో కామారెడ్డికి చెందిన స్వామిగౌడ్ కుమారుడు (18 రోజులు), చింతపల్లికి చెందిన ఐదు నెలల పాల్‌ఈసన్, ఆసిఫాబాద్‌కు చెందిన హిమజ (ఏడు నెలలు)తో పాటు ఒక సంవత్సరం నుంచి నాలుగేళ్ల వయసు కలిగిన 13 మంది చిన్నారులు ఉన్నారు. వీరిలో మహబూబాబాద్‌కి చెందిన రాజేశ్వరి కూడా ఉంది. గుండె వైద్య నిపుణుడు డాక్టర్ రమణ బృందం ఆధ్వర్యంలో నిమ్స్, నిలోఫర్ వైద్యులు ఆపరేషన్లు చేయనున్నారు. ఇప్పటికే యూకే వైద్య బృందం ఆస్పత్రిలో వైద్య పరికరాలను పరిశీలించినట్లు సమాచారం.

చిన్నారుల తల్లిదండ్రుల ఆందోళన

కాగా ఆదివారం ముందుగా ప్రకటించిన మేరకు గుండె సంబంధ సమస్యలతో బాధపడుతున్న చిన్నారులతో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి చేరుకున్నారు. ఎక్కువగా ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఆదివారం నుంచి ఆపరేషన్లు చేస్తామనడంతో తాము దూరప్రాంతాల నుంచి వచ్చామని, తీరా వచ్చిన తర్వాత ఇప్పుడు కాదు రేపు అంటున్నారని తీవ్ర ఆభ్యంతరం వ్యక్తం చేశారు.

తెలంగాణ కేసీఆర్ పాలే అయ్యింది.. కావాలె కూడా..

బీఆర్ఎస్‌లో చేరిన ఏపూరి సోమన్న



సోమన్నకు కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మధుసూదనాచారి, చిత్రంలో బాల్క సుమన్, దేశపతి శ్రీనివాస్

సాక్షి, హైదరాబాద్: 'ఎవరి పాలైందిరో తెలంగాణ అని పాట రాసి, పాడితే కొంతమందికి ఎంటర్‌టైన్‌మెంట్ అయ్యిందే తప్ప..పదేళ్లయినా తెలంగాణకు ప్రత్యామ్నాయం రాలేదు. తెలంగాణ ఎవరి పాలయిందంటే బరాబర్ కేసీఆర్ పాలైంది. కేసీఆర్ పాలే కావాలి'అని ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్న అన్నారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ నేతలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, బాల్క సుమన్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ ఏ పార్టీ అయినా.. ఏ జెండా అయినా ప్రజల ఎజెండానే ముఖ్యమన్నారు. రాష్ట్రం వచ్చే ముందే తెలంగాణభవన్‌కు దూరమయ్యానని, పదేళ్ల తర్వాత తిరిగి సొంతింటికి వచ్చినట్టు ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ రామన్న (కేటీఆర్)ను సోమన్న కలిస్తే ఏదో జరిగిపోయింది అన్నట్టు చూస్తున్నారని, సోమన్నకు వాస్తవం తెలిసి బీఆర్ఎస్‌లోకి తిరిగి వచ్చారన్నారు. ఒక పార్టీ కుమ్ములాట పార్టీ అయితే మరోపార్టీ చెట్టు ఎక్కించి చేతులు ఇడిసినట్టు వదిలేసిందని తెలిపారు. సాయిచంద్ కుటుంబాన్ని పార్టీ ఆదుకున్న తీరు ప్రశంసలు పొందిందన్నారు. ఉద్యమాల నుంచి వచ్చిన కవులు, గాయకులను శాసనమండలిలో కూర్చోబెట్టిన పార్టీ బీఆర్ఎస్ అని.. ఈ పార్టీలో హంతక రాజకీయాలు లేవని తెలిపారు. ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ హరీశ్‌రావు, కేటీఆర్, కవిత ఇతర పనుల్లో బిజీగా ఉండడం వల్ల సోమన్న చేరిక కార్యక్రమానికి రాలేదని వివరించారు.

కోదాడ టికెట్ శశిధర్‌రెడ్డికి ఇవ్వాలి

బీఆర్ఎస్ అసమ్మతి వర్గం డిమాండ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు

అనంతగిరి: కోదాడ బీఆర్ఎస్ టికెట్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డికి ఇవ్వాలని, లేకపోతే తాము సహకరించమని బీఆర్ఎస్ అసమ్మతివర్గం స్పష్టం చేసింది. ఆదివారం సూర్యాపేటజిల్లా అనంతగిరి మండలం శాంతినగర్ శివారులోని వ్యవసాయక్షేత్రంలో శశిధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన అసమ్మతి నేతల ఆత్మీయ సమ్మేళనంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావుతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 ఎన్నికల్లో కోదాడ నుంచి తమ సహకారంతోనే మల్లయ్యయాదవ్ ఎమ్మెల్యేగా గెలిచారని, ఈసారి తమ సహకారం లేకుండా గెలుపు అసాధ్యమన్నారు. ఒకవేళ శశిధర్‌రెడ్డికి టికెట్ ఇవ్వకపోతే, పార్టీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సమ్మేళనంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని వెంకటరత్నంబాబు, బీఆర్ఎస్ మైనార్టీ నేత మహబూబ్ జాని, నల్లగొండ డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం. పాండురంగారావు, కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీషాలక్ష్మీనారాయణ, జెడ్పీటీసీలు బొలిశెట్టి నాగేంద్రబాబు, కొణతం ఉమాశ్రీనివాసరెడ్డి, పందిళ్లపల్లి పుల్లారావు, మోతె ఎంపీపీ ముప్పాళ్ల ఆశాశ్రీకాంత్‌రెడ్డి, చిలుకూరు ఎంపీపీ బండ్ల ప్రశాంతి, బడేటి వెంకటేశ్వర్లు, సామినేని ప్రమీలారమేశ్, తిపిరిశెట్టి సుశీలారాజు, కాసాని వెంకటేశ్వర్లు, రామయ్య, గురవారెడ్డి, రాయపూడి వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.





మహా గణపతి దర్శనానికి భక్తజనం పోటెత్తారు. ఆదివారం నగరం నలు దిక్కుల నుంచి భక్తులు లక్షలాదిగా తరలిరావడంతో ఖైరతాబాద్ రైల్వేగేట్, సెన్సేషన్ థియేటర్, మింట్ కాంపౌండ్, ఐమాక్స్ పరిసర ప్రాంతాలన్నీ జనసంద్రాన్ని తలపించాయి. అడుగు తీసి అడుగు వేయలేనంతగా రద్దీతో వీధులన్నీ నిండిపోయాయి. ఖైరతాబాద్ రైల్వేగేట్ నుంచి పట్టాలపై భక్తులు ఎటూ కదలేని పరిస్థితి నెలకొంది. జనం ముందుకు, వెనక్కు కదలేని పరిస్థితిలో రైళ్ల రాకపోకలనే నిలపాల్సిన పరిస్థితి నెలకొంది. ఏర్పాట్లు సక్రమంగా చేయక పోవడంతో ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది చిన్నారులు తప్పిపోవడంతో తల్లిదండ్రుల నానా ఇబ్బందులకు గురయ్యారు.

\- ఖైరతాబాద్

క్లుప్తంగా...

కిషన్‌రెడ్డీ... చిల్లర రాజకీయాలు మానుకో..



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం కోసం అప్పట్లో రాజీనామా కూడా చేయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోవాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటనలో హితవు పలికారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, ఈ బిల్లుకు మద్దతిస్తున్నామని, వెంటనే దీనిని అమల్లోకి తేవాలని తమ పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్‌గాంధీ చెప్పారని, ఇవన్నీ జరిగిన తర్వాత కూడా బీజేపీ నేతలు కాంగ్రెస్ పార్టీని బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వెంకట్‌రెడ్డి విమర్శించారు. కేవలం ఎన్నికల కోసమే మహిళా రిజర్వేషన్ల పేరుతో ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు బీజేపీ నిర్వహించిందని, అలాంటి పార్టీకి చెందిన కిషన్‌రెడ్డికి తమను విమర్శించే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. పార్లమెంటు సమావేశాలకు వస్తూ ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడం వల్ల తాము బిల్లు పాస్ అయ్యే సమయంలో సభలో లేమని వెల్లడించారు. అదే విధంగా 66 మంది బీజేపీ ఎంపీలు కూడా బిల్లు పాస్ అయ్యే సమయంలో సభలో లేరని, వారు ఎందుకులేరో కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం ఖాయం



పాలకవీడు: రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం ఖాయమని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని యల్లాపురంలో ఆదివారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలన్నీ అమలు చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చేస్తున్న అరాచకాలతో ప్రజలు విసిగిపోయారని, వీళ్లు వ్యవస్థలను నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దోచుకోవడమే పనిగా బీఆర్‌ఎస్ నేతలు పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ప్రజల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టింది కాంగ్రెస్ పార్టీయేనని చెప్పారు. ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే అని అన్నారు.

చేసిన అభివృద్ధికి మీరే బాకీ పడ్డారు

- ఓటేసి బాకీ తీర్చుకోండి: లక్ష్మారెడ్డి



జడ్చర్ల: తాము చేసిన అభివృద్ధి పనులకు గాను మీరే బాకీ పడ్డారని, మరోసారి ఓటేసి ఆ బాకీ తీర్చుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రజలను ఉద్దేశించి అన్నారు. ఆదివారం జడ్చర్లలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాలానగర్ మండలం పెద్దాయపల్లి, షేరిగూడెంకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 90 శాతం సీసీ రోడ్లు వేశామన్నారు. సిద్ధంగా ఉన్న 40 డబుల్ బెడ్‌రూం ఇళ్లను సైతం త్వరలోనే అర్హులకు పంపిణీ చేస్తామన్నారు. తాగునీటి సమస్యకు మిషన్ భగీరథ ద్వారా శాశ్వత పరిష్కారం చూపామని, కరెంట్ కోతలు లేవని చెప్పారు. అభివృద్ధి పనులు చేసిన తమకే మరోసారి ఓటేసి బాకీ తీర్చుకోవాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో పెద్దాయపల్లిలో ఉన్న వారంతా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలేనని, వందశాతం ఓట్లు బీఆర్‌ఎస్‌కే వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం అవినీతిపై నిఘా సంస్థలు దర్యాప్తు చేపట్టాలి



సుల్తాన్ బజార్: తెలంగాణ రాష్ట్రాన్ని లూటీ చేసి లక్షల కోట్ల ధనంతో వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న సీఎం కేసీఆర్‌పై కేంద్ర నిఘా సంస్థలు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. దక్షిణ భారత్, మహారాష్ట్ర, మధ్యభారత్ బంజారా సేవాలాల్ సమితి ఆధ్వర్యంలో ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో రవీంద్రనాయక్ మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్లుగా రాష్ట్రంలో లక్షలాది కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు ఆర్థికంగా బలపడే కార్యక్రమాలు చేపట్టకుండా ఉచిత పథకాలు ఇచ్చి ప్రజలను తాగుబోతులను చేశారని మండిపడ్డారు. 2001కు ముందు ఎలాంటి ఆస్తులు లేని ముఖ్యమంత్రి రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయలు సంపాదించి ఒక ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని రవీంద్రనాయక్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి అవినీతి అక్రమాలను సుమోటాగా తీసుకుని కేసులు నమోదు చేయాలని కోరారు. సమావేశంలో సమితి నాయకులు శంకర్ నాయక్, నీలిపేట కార్పొరేటర్ రవినాయక్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అందాల వంతెనలు

మూసీ, ఈసా నదులపై ఫోర్‌లేన్ బ్రిడ్జీలు	రూ.168 కోట్లతో నిర్మించనున్న హెచ్‌ఎండీఏ	నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: చారిత్రక మూసీ, ఈసా నదులపై అందమైన వంతెనలు అందుబాటులోకి రానున్నాయి. నగరానికి ఉత్తర, దక్షిణ మార్గాల్లో రాకపోకలకు అనుగుణంగా సరికొత్త డిజైన్లలో బ్రిడ్జీలను నిర్మించేందుకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. ఔటర్ లోపల పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా ప్రజల మౌలిక అవసరాలకు సరిపడా ప్రజా రవాణా వ్యవస్థలో పెద్దఎత్తున మార్పులు చేపట్టారు. అందులో భాగంగానే మూసీ, ఈసా నదులపై వంతెనల నిర్మాణాన్ని చేపట్టింది. ఈ రెండు నదులపై వివిధ చోట్ల 14 బ్రిడ్జీలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిలో ప్రస్తుతం హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో మూసీ నదిపై 3 చోట్ల, ఈసా నదిపై 2 చోట్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. సుమారు రూ.168 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ వంతెనల నిర్మాణ పనులకు హెచ్‌ఎండీఏ ఇప్పటికే ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ బ్రిడ్జీల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు.

హెచ్‌ఎండీఏ నిర్మించనున్న బ్రిడ్జీలు..

సుమారు రూ.42 కోట్లతో ఉప్పల్ భగాయత్ లేఅవుట్ వద్ద ఒక బ్రిడ్జి నిర్మించనున్నారు. మరో రూ.35 కోట్లతో ప్రతాపసింగారం- గౌరెల్లి వద్ద నిర్మిస్తారు. మంచిరేవుల వద్ద రూ.39 కోట్ల వ్యయంతో, బుద్వేల్ ఐటీపార్కు-2 వద్ద ఈసా నదిపై రూ.32 కోట్లతో నిర్మించనున్నారు. రూ.20 కోట్లతో బుద్వేల్ ఐటీ పార్క్-1 సమీపంలో ఈసా నదిపై హెచ్‌ఎండీఏ వంతెనల నిర్మాణాలను చేపట్టనుంది. ఉప్పల్ భగాయత్, ప్రతాపసింగారం ప్రాంతాల్లో సుమారు 210 మీటర్ల పొడవున మూసీపై నాలుగు వరుసల్లో వంతెన నిర్మాణం జరగనుంది. 15 నెలల్లో ఈ బ్రిడ్జీల నిర్మాణాన్ని పూర్తి చేయాలని హెచ్‌ఎండీఏ లక్ష్యంగా పెట్టుకుంది. వంతెనల నిర్మాణం పూర్తయితే వివిధ ప్రాంతాల మధ్య దూరం తగ్గడమే కాకుండా ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గనుంది.





నేడు, రేపు రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. రాష్ట్ర సరిహద్దు నుంచి విదర్భ మీదుగా దక్షిణ, మధ్య మహారాష్ట్ర వరకు, జార్ఖండ్ నుంచి ఛత్తీస్‌గఢ్ వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 3.1 కిలోమీటర్ల ఎత్తు వద్ద కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో పలుచోట్ల జల్లులు, తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది.

జీఓ 111 రద్దుతో దుష్పరిణామాలు

పంజగుట్ట: జీఓ 111 రద్దు చేయడం వల్ల ఎన్నో దుష్పరిణామాలు ఉంటాయని పలువురు వక్తలు, పర్యావరణవేత్తలు అన్నారు. 'జీఓ 111 రద్దుతో కలిగే పరిణామాలు, పర్యావరణానికి కలుగుతున్న విఘాతం.. వివిధ దేశాల్లో జరిగిన పరిణామాలు, రైతుల పరిస్థితి, వాతావరణంలో ఎలాంటి మార్పులు వస్తాయి? అనే అంశంపై లాంగ్‌లైవ్ లేక్స్ క్యాంపెయిన్ హైదరాబాద్, తెలంగాణ ప్రతినిధి లుబ్నా సర్వత్ ఆధ్వర్యంలో పర్యావరణ వేత్తలు డాక్టర్ కె.బాబురావు, సాగర్ ధారా, డాక్టర్ బి.రామలింగేశ్వర్ రావులు రూపొందించిన 129 పేజీల పీపుల్స్ సైంటిఫిక్ కమిటీస్ రిపోర్టును ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. నగరం మరో 530 చదరపు కిలోమీటర్లు విస్తరించవచ్చని.. అభివృద్ధిలో భాగమవుతుందని జీఓ 111 రద్దు చేశారు. కానీ.. జంట జలాశయాలు లేకపోతే జరిగే పరిణామాలపై ఆలోచించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఢిల్లీలోనే తేల్చుకుందాం

▶ మొదటి పేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ల బిల్లుపై చర్చ సందర్భంగా కూడా రాహుల్ ఓబీసీల పక్షాన మాట్లాడారని, తెలంగాణ కాంగ్రెస్‌లో మాత్రం సర్వేల పేరుతో బీసీలకు అన్యాయం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ సమావేశం అభిప్రాయపడింది. ఏఐసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి అధ్యక్షతన ఆదివారం గాంధీభవన్‌లో బీసీ నేతల సమావేశం జరిగింది. ఈ భేటీలో సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, మధుయాష్కీగౌడ్, సురేశ్ షెట్కార్, మహేశ్‌కుమార్‌గౌడ్, పొన్నం ప్రభాకర్, చెరకు సుధాకర్, గాలి అనిల్‌కుమార్, సంగిశెట్టి జగదీశ్వర్ రావు, మెట్టు సాయికుమార్, ముత్తినేని వీరయ్య వర్మలతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ నేతలకు టికెట్ల కేటాయింపే ఎజెండాగా చర్చించారు.

పెరిక, పద్మశాలీలకు అన్యాయం

బీసీ కులాల్లో పెద్ద సంఖ్యలో జనాభా ఉండే పద్మశాలీలతోపాటు పెరిక వర్గానికి చెందిన నాయకులకు పార్టీలో అన్యాయం జరుగుతోందని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. పద్మశాలీల పక్షాన మునుగోడు నుంచి పున్నా కైలాశ్ నేత, ముషీరాబాద్ నుంచి సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, బాల్కొండ నుంచి ఈరవత్రి అనిల్ లాంటి నాయకులు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో వారికి అవకాశం ఇవ్వాలనే చర్చ జరిగింది. నల్లగొండ, ఖమ్మం, మహబూబాబాద్, పెద్దపల్లి లాంటి లోక్‌సభ స్థానాల్లో రెండు స్థానాలను బీసీలకిచ్చే పరిస్థితి లేదని అంటున్నారని, సికింద్రాబాద్, భువనగిరి, నిజామాబాద్ లాంటి లోక్‌సభ స్థానాల పరిధిలో అవసరమైతే మూడు సీట్లు బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నుంచి కామారెడ్డి ఎమ్మెల్యేగా పెరిక కులానికి చెందిన ఎమ్మెల్యే ఉన్నాడని, ఆయన సీటును కూడా కేసీఆర్ గుంజుకున్న నేపథ్యంలో తమ కులానికి కాంగ్రెస్‌లో అయినా న్యాయం చేయాలని వికలాంగ విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ కోరారు.

సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలివీ..

- పార్టీ అధిష్టానాన్ని కలిసేందుకు సోమ లేదా మంగళవారాల్లో ఢిల్లీ వెళ్లాలి. అక్కడ సోనియా, రాహుల్, ఖర్గేను కలిసి తమ డిమాండ్లను వారి ముందుంచాలి.
- అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలకు కచ్చితంగా 34 సీట్లు కేటాయించాలని కోరుతూ అందరి సంతకాలతో అధిష్టానానికి లేఖ రాయాలి. పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేతకు కూడా ఈ లేఖను అందజేయాలి.
- టికెట్ల కేటాయింపులో అన్ని కులాలకు ప్రాధాన్యమివ్వాలి. అభ్యర్థుల ప్రకటన కోసం విడుదల చేసే తొలిజాబితాలో బీసీ నేతల పేర్లు రాకుండా కుట్ర జరుగుతోంది. తొలి జాబితాలోనే బీసీ నేతల పేర్లను కూడా ప్రకటించాలి.
- బీసీలకు ఇచ్చే స్థానాలను ముందుగా గుర్తించి అక్కడ బీసీ నేతల పేర్లతోనే సర్వేలు జరపాలి.
- బీసీ నేతల్లో ఎవరికి టికెట్ వచ్చినా అందరం కలిసి గెలిపించుకోవాలి.
- పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో బీసీల వాటాను అమలు చేయాలి.

మాట నిలబెట్టుకోవాలి: మధుయాష్కీ గౌడ్

ఈసారి బీసీలకు 34 అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ చెప్పారు. పార్టీ బలపడటంలో బహుజనుల పాత్ర ముఖ్యమని, తమ పాత్ర లేకుండా ప్రభుత్వ ఏర్పాటు సాధ్యం కాదని పేర్కొన్నారు.

డిగ్రీ చదివినా తక్షణ ఉపాధి!

▶ మొదటి పేజీ తరువాయి

పరిజ్ఞానం, సైన్స్‌తో సామాజిక అవగాహన కోర్సులు కలగలిపి రాబోతున్నాయి. జాతీయ విద్యావిధానం-2020లో భాగంగా ఈ తరహా బోధన ప్రణాళికను యూజీసీ ఇప్పటికే సిద్ధం చేసింది. దీనికి అనుగుణంగానే దేశవ్యాప్తంగా ఒకే పద్ధతిలో క్రెడిట్స్ విధానం అమలులోకి రాబోతోంది. యూజీసీ కొత్త ప్రణాళికలను అన్ని రాష్ట్రాలూ ఆమోదించాయి.

క్రెడిట్ విధానం బెస్ట్

డిగ్రీ పట్టాలు ఇక క్రెడిట్స్ ఆధారంగా ఉండనున్నాయి. ఒక్కో స్థాయికి కొన్ని క్రెడిట్స్ ఉంటాయి. విద్యార్థులు మూడేళ్లలో 120 క్రెడిట్లు పూర్తి చేస్తేనే అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) డిగ్రీకి అర్హులవుతారు. అదే విద్యార్థి నాలుగేళ్లలో 160 క్రెడిట్లను పూర్తి చేస్తేనే యూజీ ఆనర్స్ డిగ్రీ పట్టా లభిస్తుంది. అలాగే ఆనర్స్ డిగ్రీ కోర్సుల్లో చేరేవారు రీసెర్చ్ కోసం వెళ్లాలనుకుంటే తమ నాలుగేళ్ల కోర్సులోనే రీసెర్చ్ ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉంటుంది. ఇక ప్రస్తుతం మూడేళ్ల డిగ్రీ కోర్సులు చేస్తున్నవారు కూడా నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులకు మారేందుకు కొత్త కరిక్యులం ఫ్రేమ్ వర్క్ అవకాశం కల్పిస్తుంది. ఇప్పటికే చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్) ప్రకారం మూడేళ్ల యూజీ కోర్సుల్లో పేర్లు నమోదు చేసుకున్న, అభ్యసిస్తున్న విద్యార్థులు కూడా నాలుగేళ్ల యూజీ ఆనర్స్ కొనసాగించడానికి అర్హులని కొత్త నిబంధనల్లో పేర్కొన్నారు.

ఆనర్స్ వైపు ఆకర్షణ

తెలంగాణ సహా దేశంలోని అన్ని రాష్ట్రాలూ మూడేళ్ళ డిగ్రీ కోర్సుల స్థానంలో నాలుగేళ్ళ ఆనర్స్ కోర్సులకు ప్రాధాన్యమిస్తున్నాయి. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను యూజీసీ రూపొందించింది. తెలంగాణలో నాలుగేళ్ళ బీఎస్సీ (ఆనర్స్) కంప్యూటర్స్‌ను 50కి పైగా కాలేజీల్లో అందుబాటులోకి తెచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి అతి ముఖ్యమైన అంశాలు ఆనర్స్‌లో చోటు చేసుకోబోతున్నాయి. దశాబ్ద కాలంగా ప్రపంచవ్యాప్తంగా ఈ కామర్స్ రాజ్యమేలుతోంది. దీంతో కామర్స్ డిగ్రీ నేపథ్యం ఉన్న వారికి మంచి డిమాండ్ వచ్చింది. కంప్యూటర్స్ పరిజ్ఞానంతో కూడిన అనలిస్టులు, అకౌంటెంట్లకు మంచి వేతనాలతో కూడిన ఉపాధి లభిస్తోంది. ఈ కారణంగా డిగ్రీ కోర్సుల్లో కామర్స్‌ను ఎంచుకునే వారి సంఖ్య 36 శాతం నుంచి 41 శాతానికి పెరిగింది. బీకాం కోర్సులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. బీకాం జనరల్‌తో పాటు, కంప్యూటర్స్, టాక్సేషన్, ఆనర్స్, బిజినెస్ అనలిటిక్స్ వంటి కొత్త స్పెషలైజేషన్‌ను తీసుకొచ్చారు. ఇక బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ)లో చేరికలు కూడా ఆరేళ్లల్లోనే ఏడు రెట్లు పెరిగాయి. బ్యాచులర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ)లో ప్రవేశాలు 9 రెట్లు పెరిగాయి.

కొన్నేళ్ళుగా డిగ్రీలో ప్రవేశాలు ఇలా..

సంవత్సరం	డిగ్రీలో చేరిన వారు
2017-18	2,00,806
2018-19	2,33,946
2019-20	2,15,467
2020-21	2,47,601
2021-22	2,55,132
2022-23	2,12,818

నైపుణ్యం వెలికితీసేలా మూల్యాంకనం

విద్యార్థిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసే మూల్యాంకన విధానం అందుబాటులోకి రాబోతోంది. దీనిపై ఇప్పటికే అధ్యయనం పూర్తయింది. డిగ్రీ కోర్సులు ఇక మీదట పూర్తి నైపుణ్యంతో అందించాలని, అంతర్జాతీయ ప్రమాణాలతో ముందుకు తీసుకెళ్ళాలని భావిస్తున్నాం. ఇప్పటికే ఈ ప్రయోగం మొదలైంది. భవిష్యత్‌లో దీని వేగం పెరుగుతుంది. ఇక మీదట డిగ్రీ కోర్సు చేసినా మంచి ఉపాధి పొందుతారనే విశ్వాసం విద్యార్థుల్లో వస్తుంది.

\- ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి
(ఉన్నత విద్యా మండలి చైర్మన్)

ప్రగతిభవన్ ముట్టడికి గ్రూప్–1 అభ్యర్థుల యత్నం



ప్రగతిభవన్ ముట్టడికి వచ్చిన గ్రూప్ 1 అభ్యర్థులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు


పంజగుట్ట (హైదరాబాద్): గ్రూప్1 ప్రిలిమ్స్ హైకోర్టు రద్దు చెయ్యడంతో అభ్యర్థులు ఆదివారం ప్రగతిభవన్ ముట్టడికి యత్నించారు. గ్రూప్ 1 పరీక్షల్లో అవకతవకలు జరగడానికి ప్రభుత్వ అలసత్వమే కారణమని ఆరోపిస్తూ ప్రగతిభవన్ వైపునకు దూసుకువెళ్లేందుకు యత్నించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బైఠాయించేందుకు యత్నించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వివిధ స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ, గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇప్పటికే పలు పరీక్షల పేపర్లు లీక్ కావడంతో ఎంతో మంది విద్యార్థుల జీవితాలు ఆగమ్యగోచరంగా మారాయన్నారు. గత మూడు సంవత్సరాల నుండి గ్రూప్-1 కోసం ప్రిపేర్ అవుతున్నామని ఇప్పటికే రెండుసార్లు పరీక్షలు రద్దు చేశారని, అభ్యర్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే టీఎస్‌పీఎస్సీని రద్దుచేయాలని వారు డిమాండ్ చేశారు.

కాలం కలిసొస్తే బరిలో ఉంటా..

- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



లింగాలఘణపురం: 'కార్యకర్తలు అభద్రతకు, ఆందోళనకు, అయోమయానికి గురి కావొద్దు.. అధిష్టానం నిర్ణయం మేరకు కలిసి పనిచేయాలి.. కలిసి దిగిన ఫొటోలతో పత్రికల్లో ఊహాగానాలు రాశారు.. కాలం కలిసొస్తే స్టేషన్‌ఘన్‌పూర్ బరిలో ఉంటాను'అని ఎమ్మెల్యే తాటి కొండ రాజయ్య వ్యాఖ్యానించారు. ఆదివారం జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వడిచర్లలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అనంతరం ఆయ న విలేకరులతో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ విదేశాలకు వెళ్లే సమయంలో ఆయనను కలిసినప్పుడు 'బాగా పని చేస్తున్నావు.. కేసీఆర్ అవకాశం ఇస్తుండవచ్చు'అని చెప్పారు. 'బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రక టన సమయంలో కేటీఆర్ లేడు. విదేశీ పర్యటన అనంతరం రెండు రోజుల క్రితం కేటీఆర్‌తో కలిసి మాట్లాడగా, ఏదైనా స్టేట్ కార్పొరేషన్ పదవిస్తామన్నారు.. అనంతరం ఎమ్మెల్సీ, ఎంపీగా అవకాశం కల్పిస్తామని చెప్పారు' అని తెలిపారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఫొటో దిగామని, అప్పుడు కడియం శ్రీహరితో దిగిన ఫొటోలతో ఊహాగానాలు రాశారని రాజయ్య పేర్కొన్నారు. దీంతో చాలా మంది కార్యకర్తలు, నాయకులు ఫోన్లు చేసి మీరు మీరు కలిసిపోతే సరిపోతుందా.. కార్యకర్తల పరిస్థితి ఏంటని అడుగుతున్న నేపథ్యంలో ఈ విషయాలు వివరిస్తున్నానని చెప్పుకొచ్చారు. నివేదికలు, సర్వేల అనంతరం జాబితాల్లో మార్పుచేర్పులు ఉంటాయని గతంలోనే సీఎం కేసీఆర్ చెప్పారు. ఇంకా ఎవరికీ బీఫాం ఇవ్వలేదు. అధిష్టానం నిర్ణయం మేరకు కలిసి పని చేయాలి అని అన్నారు. 'నియోజకవర్గంలో 36 శాతం మాదిగలు ఉన్నారని, ఉపకులాలు ఒక్క శాతం అంటూ.. మాదిగలు ఆత్మగౌరవం కోసం చైతన్యం కావాలని' ఆయన ప్రసంగించడం చర్చనీయాంశమైంది.



సాక్షి
సోమవారం, 25 సెప్టెంబర్ 2023

త్రిశంకుస్వర్గం

సృష్టిలో ప్రకృతికి వికృతి ఉంటుంది. ప్రతి సృష్టికీ దానికి దీటైన ప్రతిసృష్టి కూడా ఉండనే ఉంటుంది. సహజమైన సృష్టి ప్రకృతి అయితే, మానవులు తమ అమోఘ మేధతో చేసిన ప్రతిసృష్టి వికృతి. సృష్టికి పోటీగా ప్రతిసృష్టి చేయాలనే తపన మానవులకు యుగాల కిందటే మొదలైంది. మానవులకు ఉన్న ఈ తపన వారి కల్పనల్లో ప్రతిఫలించింది. పురాణాలు మొదలుకొని ఆధునిక సాహిత్యం వరకు ప్రతిసృష్టి కల్పనలు కోకొల్లలుగా కనిపిస్తాయి.

ప్రతిసృష్టికి ఉదాహరణ మన పురాణాల్లోనే కనిపిస్తుంది. అదే– విశ్వామిత్ర సృష్టి. త్రిశంకుడి కోసం విశ్వామిత్రుడు ఏకంగా స్వర్గానికే నకలును సృష్టించాడు. విశ్వామిత్రుడు సృష్టించిన త్రిశంకుస్వర్గం దేవేంద్రుడి స్వర్గానికి ఏమాత్రమూ తీసిపోదు. కాకుంటే, కర్మకొద్ది త్రిశంకుడే అందులో తలకిందులుగా వేలాడుతూ నిలిచిపోయాడు. తన కోసం సృష్టించిన స్వర్గంలో తానే తలకిందులుగా వేలాడే దుర్గతి తటస్థించడమే ప్రతిసృష్టిలోని వికృతి!

కృత్రిమ మేధతో పనిచేసే మరమనిషి ప్రస్తావన గ్రీకు పురాణాల్లో కనిపిస్తుంది. హిఫీస్టస్ అనే గ్రీకుల దేవుడు క్రీట్ దీవిని రక్షించడానికి టాలోస్ అనే భారీ కంచు మరమనిషిని సృష్టించాడు. హిఫీస్టస్ మన భారతీయ పురాణాల్లోని విశ్వకర్మలాంటి వాడు. శిల్పులు, లోహశిల్పులు వంటి వారికి, అగ్నిపర్వతాలకు అధిదేవుడు. క్రీస్తుపూర్వం మూడో శతాబ్దికి చెందిన గ్రీకు కవి అపలోనీయస్ ఆఫ్ రోడ్స్ రాసిన 'ఆర్గనాటికా' కావ్యంలోనిది ఈ గాథ. ఈ కావ్యంలోనే ఒళ్లంతా బంగారమే గల మరమగువల గురించి కూడా వర్ణించాడు. వాళ్లను కూడా హిఫీస్టస్ సృష్టించాడు. 'ఆర్గనాటికా' గాథ ప్రకారం– హిఫీస్టస్ సృష్టించిన టాలోస్‌ను క్రీట్ రాజు జూస్ తన కొడుకు మైనోస్‌కు బహుమతిగా ఇచ్చాడు. మైనోస్ నియంతగా మారి టాలోస్‌ను తన శత్రువులను నిర్మూలించడానికి వాడుకున్నాడు. కృత్రిమ మేధ శక్తిని, దుర్మార్గుల చేతిలో పడితే దానివల్ల వాటిల్లగల ప్రమాదాలనూ అపలోనీయస్ ఎంతో ముందుగానే ఊహించడం విశేషం.

'ఆర్గనాటికా' గాథకు ఇరవైమూడు శతాబ్దాల తర్వాత గాని 'రోబో' అనే మాట పుట్టలేదు. చెక్ రచయిత కారల్ కాపెక్ 1920లో రాసిన నాటకం 'రోసమ్స్ యూనివర్సల్ రోబో' ద్వారా 'రోబో' అనే మాటను వాడుకలోకి తెచ్చాడు. అప్పటి నుంచి మరమనిషికి 'రోబో' అనే మాట ఇంగ్లిష్‌లోకి వచ్చింది. తర్వాత ప్రపంచవ్యాప్తంగా వాడుకలోకి వచ్చింది.

క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దికి చెందిన గ్రీకు మేధావి అరిస్టాటిల్ కూడా కృత్రిమ మేధ గురించిన ఆలోచనలు చేశాడు. ఆయన తన 'పాలిటిక్స్' గ్రంథంలో 'ప్రతి పరికరమూ తనను ఉపయోగించే వ్యక్తి ఆదేశాలకు అనుగుణంగా లేదా వారి అవసరాలను ముందుగానే గుర్తించి అందుకు అనుగుణంగా వాటి పని అవి చేసుకోగలిగితే చేతివృత్తుల వారికి కార్మికుల అవసరం ఉండదు. అలాగే యజమానులకు బానిసల అవసరం కూడా ఉండదు' అని రాశాడు. మనుషులు శ్రమలో నిరంతరం నలిగిపోకుండా, వాళ్లు తమ పనులను యంత్రాలకు అప్పగించి నిక్షేపంగా జీవితాన్ని ఆస్వాదించాలనేది ఆయన ఆలోచన.

కృత్రిమ మేధతో పనిచేసే మరమనుషులను గురించి ప్రాచీనులు కల్పనలు చేసేనాటికి ప్రపంచంలో కనీసం విద్యుత్తు వినియోగంలో లేదు. అప్పట్లో రవాణా వసతులు కూడా అంతంత మాత్రమే! అయితే, నాటి కల్పనలే నేటి కార్యాచరణలు. కాల్పనికమైన ఊహలే శాస్త్ర పురోగతికి ఊతమిస్తాయి. ఎందరో శాస్త్రవేత్తల కృషి ఫలితంగా ఆనాటి కల్పనల్లోని వర్ణనల మాదిరిగానే ఇంచుమించుగా మనుషులను పోలిన హ్యూమనాయిడ్ రోబోలు ఇప్పటికే వాడుకలోకి వచ్చేశాయి. ఇవి ఎప్పటికప్పుడు మరింతగా ఆధునికతను సంతరించుకుంటున్నాయి. ఇవి కృత్రిమ మేధతో మనుషుల మాదిరిగానే పనులు చేయగలుగుతున్నాయి. కృత్రిమ మేధ తెరమీద ఏకంగా మనుషులకు నకళ్లనే సృష్టిస్తోంది. కృత్రిమ మేధ ఇప్పుడు ఆధునిక కరాభరణాలైన స్మార్ట్‌ఫోన్‌లకూ పాకింది. కృత్రిమ మేధను విస్తృతంగా వాడుకలోకి తేగలిగిన శాస్త్రవేత్తలు అపర విశ్వామిత్రులే!

విశామిత్రుడు సృష్టించిన త్రిశంకుస్వర్గంలో త్రిశంకుడు తలకిందులుగా వేలాడుతున్నట్లుగానే, ఆధునిక శాస్త్రవేత్తలు సృష్టించిన కృత్రిమమేధతో మానవాళి పరిస్థితులు తలకిందులవుతాయా అనే భయాలు కూడా పుట్టుకొస్తున్నాయి. ఇవి నిష్కారణమైన భయాలు కావు. కృత్రిమ మేధ సృష్టిస్తున్న సమస్యలతో సతమతమవుతున్న వారిలో అనుభవపూర్వకంగా తలెత్తుతున్న భయాలు. పలు దేశాలు రాజ్యాంగబద్ధంగా గోప్యత హక్కుకు భరోసా కల్పిస్తున్నా, కృత్రిమ మేధ వల్ల మనుషుల గోప్యతకు పూచీలేని పరిస్థితి ఇప్పటికే ఏర్పడింది. కృత్రిమ మేధ దుర్వినియోగం వల్ల నేరాలు కూడా జరుగుతున్నాయి. కృత్రిమ మేధ కళా సాహితీరంగాల్లోని సృజనకు సవాలుగా మారింది. నిన్న మొన్నటి వరకు నటీనటులు కెమెరా ముందు స్వయంగా నటిస్తేనే తెరమీద కనిపించేవారు. నటీనటులు కెమెరా ముందు స్వయంగా నటించకపోయినా, అచ్చంగా వారి రూపాలను, హావ భావ విన్యాసాలను తెరమీద ప్రదర్శించే స్థాయికి చేరుకుంది కృత్రిమ మేధ. బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ ఇదే సమస్యపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. తన అనుమతి లేకుండా, తన రూపాన్ని, మాటలను, హావభావాలను కృత్రిమ మేధ సహాయంతో ప్రదర్శించకుండా ఉండేలా కోర్టు నుంచి ఇటీవల ఉత్తర్వులను కూడా పొందాడు. కృత్రిమ మేధ ఒకవైపు కొన్ని పనులను సులభతరం చేస్తున్నా, మరోవైపు కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది. వాటికి పరిష్కారం కనుక్కోకుంటే... మన పరిస్థితి త్రిశంకుస్వర్గమే!

డౌనింగ్ స్ట్రీట్ మార్జాల మిత్రుడు

కామెంట్



కరణ్ థాపర్

నిష్క్రమించే ప్రధాని వీడ్కోలు కార్యక్రమ గౌరవ ఆహ్వానితుల జాబితాలో 'ల్యారీ' ఎందుకు కనిపించదు అని బ్రిటన్ ప్రజలు తరచూ ఆలోచిస్తూ ఉంటారు. బహుశా ఆహూతుల అందరి దృష్టీ తన వైపు మళ్లేందుకు ల్యారీ ఎప్పటికప్పుడు కళాత్మకమైన మార్గాలను కొనుగొంటూ ఉండడం అందుకు కారణం కావచ్చు. అవడానికి అది మామూలు మార్జాలమే అయినప్పటికీ దానిని 'సివిల్ సర్వెంట్'గా పరిగణించాలని 2016లో నాటి బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరున్ పార్లమెంటులో ప్రకటించారు. ప్రస్తుతం చీఫ్ మౌజర్ హోదాలో ఉన్న ఆ సివిల్ సర్వెంట్ పేరే 'ల్యారీ'. 2011 నుంచి ల్యారీ బ్రిటన్ ప్రధాని నివాసంలో ఉంటోంది. డేవిడ్ కామెరున్, థెరెసా మే, బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్, రుషి సునాక్... ప్రధానులుగా ఇంతమంది మారారు కానీ, ల్యారీ అక్కడే ఉంది. కాలధర్మం లేదా వృద్ధాప్యం మాత్రమే ల్యారీని డౌనింగ్ స్ట్రీట్ నుంచి కదలించగలవు.

పెంపుడు కుక్కలపై మక్కువ కలిగిన వారిగా బ్రిటిషర్‌లు లోక విదితం అయినప్పటికీ, వారి ప్రధానమంత్రి అధికారిక నివాసంలో ప్రాముఖ్యం పొందే చతుష్పాదం మాత్రం మార్జాలమే. పిల్లిది అక్కడ 'చీఫ్ మౌజర్' హోదా. చీఫ్ మౌజర్ ప్రధాన విధి డౌనింగ్ స్ట్రీట్‌లో ఒక్క ఎలుకైనా లేకుండా చూడటం. డౌనింగ్ స్ట్రీట్‌లోనే ప్రధాని నివాసం, ప్రధాని కార్యాలయాలు ఉంటాయి. అవడానికి అది మామూలు మార్జాలమే కానీ, దానిని 'సివిల్ సర్వెంట్'గా పరిగణించాలని 2016లో నాటి బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరున్ పార్లమెంటులో ప్రకటించారు. ప్రస్తుతం చీఫ్ మౌజర్ హోదాలో ఉన్న ఆ సివిల్ సర్వెంట్ పేరు 'ల్యారీ'. 'బ్యాటర్‌సీ డాగ్స్ అండ్ క్యాట్స్ హోమ్' నుంచి తప్పించి, దానిని అక్కడికి తెప్పించారు. 2011 నుంచి ల్యారీ బ్రిటన్ ప్రధాని నివాసంలో ఉంటోంది. డేవిడ్ కామెరున్, థెరెసా మే, బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్, రుషి సునాక్... ప్రధానులుగా ఇంతమంది మారారు కానీ, ల్యారీ అక్కడే ఉంది. కాలధర్మం లేదా వృద్ధాప్యం మాత్రమే ల్యారీని డౌనింగ్ స్ట్రీట్ నుంచి కదలించగలవు.

జీవిత చరిత్రల రచనలో ప్రావీణ్యం కలిగిన నా మేనకోడలు నారాయణీ బసు బ్రిటిష్ ప్రభుత్వ అధికారిక మార్జాలాల జీవిత చరిత్రను సంక్షిప్తంగా సంకలన పరిచారు. ఎనిమిదవ హెన్రీ చక్రవర్తి కాలం నాటి బ్రిటిష్ ప్రభుత్వ మార్జాల జీవిత చరిత్రతో సంకలనం మొదలౌతుంది. ఆ కాలపు రాజనీతిజ్ఞుడు, క్యాథలిక్ బిషప్ అయిన లార్డ్ ఛాన్సలర్... థామస్ వోల్సే దగ్గర ఆ మార్జాలం ఉండేది. 1929కి ముందే బ్రిటిష్ ప్రభుత్వం అధికారికంగా పిల్లి సంరక్షణ బాధ్యతలను చేపట్టినట్లు రికార్డులను బట్టి తెలుస్తోంది. పిల్లి పోషణ, పాలన కోసం రోజుకు ఒక పెన్నీ కేటాయించినట్లు అప్పటి బడ్జెట్ లెక్కలు వెల్లడిస్తున్నాయి. నాటి నుంచి పిల్లి ఖర్చు క్రమంగా పెరుగుతూ వచ్చి 21వ శతాబ్దానికి 'చీఫ్ మౌజర్' బ్రిటిష్ ఖజానాకు పెట్టిస్తున్న ఖర్చు 100 పౌండ్లకు చేరుకుంది.

డౌనింగ్ స్ట్రీట్ వెబ్‌సైట్ ప్రకారం ల్యారీ విధులు ఇలా ఉన్నాయి: ఇంటికి వచ్చే అతిథులను పలకరించడం, భద్రతకు ఉద్దేశించిన రక్షణ ఏర్పాట్లను తనిఖీ చేయడం, కునుకు తీయడానికి పురాతన ఫర్నిచర్ ఏ మాత్రం నాణ్యతను కలిగి ఉన్నదో పరీక్షించడం. అలాగే, భవంతిలో ఎలుకలు చేరకుండా ఉండేందుకు పరిష్కారం ఆలోచించడం కూడా చేస్తోందనీ, ఆ పరిష్కారం ఇంకా వ్యూహాత్మక ప్రణాళిక దశలోనే



ప్రస్తుత బ్రిటన్ ప్రధాని రుషి సునాక్‌తో 'ల్యారీ'

ఉందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లిందని కూడా వెబ్‌సైట్‌లో ఉంది. స్పష్టంగా చెప్పాలంటే ల్యారీ తన బాధ్యతల కంటే కూడా ప్రధాని కార్యాలయ అవసరాలను చూడ్డానికే ఎక్కువ ఇష్టపడుతుంది.

నారాయణి పరిశోధనను బట్టి కామెరున్ దగ్గర తన తర్వాత వచ్చిన ప్రధానుల కంటే కూడా ల్యారీ గురించి చెప్పడానికే ఎక్కువ సమాచారం ఉంది. ఆ పిల్లి గురించి సునాక్ అభిప్రాయాన్ని నారాయణి ప్రస్తావించలేదు. కనుక ల్యారీని అర్థం చేసుకోవాలంటే మనం కామెరున్ మీద ఆధారపడాలి.

ఆయన చెబుతున్న దానిని బట్టి ల్యారీ పురుషుల సమక్షంలో కాస్త బెరుకుగా ఉంటాడు. అయితే అందుకు బరాక్ ఒబామా మినహాయింపు. "తమాషా ఏంటంటే ఒబామాను ల్యారీ ఇష్టపడతాడు. ఒబామా అతడికి మృదువైన చిన్న తాటింపు వంటి స్పర్శను ఇస్తాడు. దాంతో ల్యారీ ఒబామా దగ్గర సౌఖ్యంగా ఉంటాడు.

అయితే ల్యారీ ప్రధానమంత్రుల సతీమణులను కలవరపెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. ల్యారీ ఒంటి వెంట్రుకలు తన భర్త సూట్‌లపై కనిపించడంతో సమంతా కామెరున్ ల్యారీని ప్రధాని నివాసంలోకి అడుగు పెట్టనివ్వకుండా చేశారు. అంతెందుకు, పక్కనే ఉండే విదేశాంగశాఖ కార్యాలయంలోకి ల్యారీని ప్రవేశించనివ్వకుండా క్యాట్–ప్రూఫ్‌ను ఏర్పాటు చేయడం కూడా జరిగింది. విదేశాంగ కార్యదర్శి విలియం హేగ్ దానిని కిందికి తీసుకెళ్లండి అని కోరారు. అయితే హేగ్‌కి ల్యారీ పట్ల కొంత ఆపేక్ష ఉండేదట.

కఠోర వాస్తవం ఏంటంటే ల్యారీకి ఉన్న ప్రజాదరణ కారణంగా తరచూ ప్రధాన మంత్రి కంటే కూడా ఎక్కువగా ల్యారీకి భద్రతా బలగం అవసరం అయ్యేది. కామెరాన్ దంపతులు ఆ పిల్లిని ఇష్ట పడటం లేదని కథలు వ్యాప్తి చెందడం ప్రారంభవమడంతో ల్యారీ, తను 'పర్–ఫెక్ట్‌లీ వెల్' అని ప్రధాని కామెరున్ తప్పనిసరై ట్వీట్ చేయవలసి వచ్చింది. ఆ ట్వీట్ బ్రిటిష్ ప్రభుత్వానికి భరోసాను ఇచ్చింది.

నిష్క్రమించే ప్రధాని వీడ్కోలు కార్యక్రమ గౌరవ ఆహ్వానితుల జాబితాలో ల్యారీ ఎందుకు కనిపించడు అని బ్రిటన్ ప్రజలు తరచూ ఆలోచిస్తూ ఉంటారు. బహుశా ఆహుతుల అందరి దృష్టీ తన వైపు మళ్లేందుకు ల్యారీ ఎప్పటికప్పుడు కళాత్మకమైన మార్గాలను కనుగొంటూ ఉండడం అందుకు కారణం కావచ్చు. 10 డౌనింగ్ స్ట్రీట్ ప్రవేశ ద్వారం వద్ద ట్రంప్‌తో కలిసి థెరెసా మే, ఆమె భర్త ఫొటోలు దిగుతున్నప్పుడు ల్యారీ వారి వెనుక కిటికీ అంచుపై నిలబడి ప్రతి ఫొటోలోనూ కనిపించింది. తర్వాత వర్షం నుంచి తలదాచుకోడానికి సాయుధుల కనురెప్పల కాపలాలో ఉన్న ట్రంప్ క్యాడిలాక్ కారు కింద దూరిన ల్యారీని ఎంత నచ్చచెప్పీ బయటకు రప్పించలేక పోయారు. బి.బి.సి.కి చెందిన జోన్ సోపెల్ ఆ ఘటనను... "బ్రేకింగ్ న్యూస్: ట్రంప్ వ్యతిరేక ప్రదర్శనకారులు డొనాల్డ్ ట్రంప్ వాహన శ్రేణిని నిలువరించడంలో విఫలమయ్యారు. కానీ 10 డౌనింగ్ స్ట్రీట్ పిల్లి ఆ పని చేయగలిగింది"... అని ట్వీట్ చేశారు.

కొంతకాలంగా ల్యారీపై మునుపెన్నడూ లేని విధంగా తరచూ విమర్శలు వినవస్తున్నాయి. ల్యారీ స్వభావం, పనితీరు చుట్టూ కేంద్రీకృతం అయిన విమర్శలవి. వేటాడి చంపే క్రూర స్వభావం ల్యారీలో విస్పష్టంగా లోపించడాన్ని డౌనింగ్ స్ట్రీట్ అధికారులు గమనించారు. "ఎలుకల్ని వేటాడడం కన్నా ఎక్కువ సమయం ల్యారీ నిద్రలోనే గడుపుతున్నాడు" అని కొందరు ఫిర్యాదు చేశారు. అయితే నేను విన్నదేమంటే సునాక్ అతడిని విధుల నుంచి విరమింపజేసే ప్రమాదం లేదని. ఏ విధంగా చూసినా కూడా సునాక్ దంపతులకు వీడ్కోలు పలికి, కొత్తగా వచ్చేవాళ్ల మెప్పు పొందే వరకైనా ల్యారీ అక్కడ ఉంటాడు. ల్యారీ మాంసం కూరను ఇష్టపడతాడా లేక పప్పూ, అన్నం అంటాడా అనేది బహుశా అప్పుడు మనం తెలుసుకోవచ్చు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త ఆవిష్కరణలు



ప్రతి రెండు నిమిషాలకు ఒక తల్లి ప్రసవ సమయంలో మరణిస్తోంది. అధునాతన వైద్య ఆవిష్కరణలను అత్యంత అవసరం అయినవారికి అందుబాటులో ఉంచడం ద్వారా 2030 నాటికి 20 లక్షల మంది తల్లులు, శిశువుల జీవితాలను రక్షించవచ్చు.

– బిల్ గేట్స్, ఐటీ దిగ్గజం

విముక్తి అనుభూతి



మహిళలు తమకు అసౌకర్యంగా ఉన్నా కూడా నవ్వుతూ కనిపించాలి!. లేదంటే 'కోపిష్టి' అనే ముద్ర వేస్తారు. ఆశించడాలకు తగ్గట్లు ఉండవలసిన ఒత్తిడితో ఆడపిల్లలు సతమతమౌతుంటారు. దీని గురించి నాకు వ్యక్తిగత అనుభవం ఉంది. ఆ ఆశించడాలను వదులుకోవడం నిజంగా చాలా విముక్తిని కలిగించే అనుభూతి.

– ప్రొ॥ ప్రజ్ఞా అగర్వాల్, సైంటిస్ట్

ఐ రన్ ఫర్ ఇవాన్



నా సహోద్యోగి ఇవాన్ గెర్ష్కోవిచ్ తన స్వస్థలానికి 4,707 మైళ్ల దూరంలో ఉన్న రష్యన్ జైలులో చట్ట విరుద్ధమైన నిర్బంధంలో ఉన్నాడు. ఆ దూరాన్ని చిన్నది చేయడం కోసం మాలో కొందరం 'ఐ రన్ ఫర్ ఇవాన్' సోషల్ మీడియా ఉద్యమాన్ని సోమవారం నుంచి ప్రారంభిస్తున్నాం. దయచేసి మాతో చేరండి.

– క్రిస్టీనా రోకా, వాల్‌స్ట్రీట్ జర్నల్ ఎడిటర్

వరుస ఘటనలు



గత ఆరు నెలల్లో హతం అయిన ఖలిస్థాన్ తీవ్రవాదులు : హర్విందర్ రెండా (పాకిస్థాన్), హ్యాపీ సంఘేరా (ఇటలీ), బషీర్ అహ్మద్, పర్మజిత్ పంజ్వార్, ఖలీద్ రజా (పాకిస్థాన్), అవతార్ ఖండ (యు.కె.), ఐజాజ్ అహ్మద్, సయ్యద్ నూర్ (ఆఫ్ఘనిస్థాన్), నిజ్జర్, సుక్ డునెకె (కెనడా).

– రిపి బాగ్రీ, డేటా ఎనలిస్ట్

మిశ్రమ స్పందన



నేను లోక్‌సభ, రాజ్యసభ సిబ్బందిలో చాలా మందితో మాట్లాడాను. ఎక్కువ మందికి కొత్త పార్లమెంటు భవనం డిజైన్ నచ్చలేదు. ఇక రెండు సభలకు, సందర్శకుల గ్యాలరీకి దారి తీసే మార్గాలలో సూర్యరశ్మి, స్వచ్ఛమైన గాలి లేకపోవడం నేను గమనించాను. కాంతి, గాలి లేనప్పుడు మనుషుల అలికిడి కూడా తక్కువైపోతుంది.

– సీలా భట్, పాత్రికేయురాలు

అప్పటి రోజులు



మెడికల్ కాలేజీలో చేరి 23 ఏళ్లు! ఆ పెద్ద నోటీస్ బోర్డులో నా పేరు వెతుక్కుని, 'అబ్బ మళ్లీ రోల్ నెం.1' అని ముక్కు మూసుకోవడం నాకింకా గుర్తు. ఫార్మాలిన్ నిండిన అనాటమీ ల్యాబ్ దుర్వాసన గురించి ఇప్పుడు ఆలోచించినా నా కళ్లు మండిపోతున్నట్లే ఉంటుంది. ప్రస్తుతం పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు బోధకురాలిని.

– డాక్టర్ ఆరతి బళ్లారి, వైద్యశాస్త్ర బోధకురాలు

తెర వెనుక వైద్యుడు

ఆరోగ్యం పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే అందులో ఫార్మసిస్ట్ పాత్ర అత్యంత ప్రధానం. ప్రపంచవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న వ్యాధులను దృష్టిలో ఉంచుకొని, దానికి తగినట్లుగా కొత్త మందులను తయారు చేయడం, నివారణా మార్గాలు కనుగొనడంలో ఫార్మసిస్ట్ పాత్ర కీలకం. ఔషధాల తయారీ, వాటి నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించడం, తగిన సాంకేతిక పరిజ్ఞానంతో ఔషధాలను నిల్వచేయడం, వ్యాధిగ్రస్థులకు మందుల వినియోగ విధానం పట్ల తగిన సూచనలు, సలహాలు అందజేయడం, వాటి దుష్ఫలితాల పట్ల అవగాహన కల్పించడం లాంటి అనేక విషయాల్లో ఫార్మసిస్ట్ పాత్ర విస్మరించలేనిది. వ్యాధిని గుర్తించి, దానికి తగిన మందును సూచించేవాడు వైద్యుడైతే, ఔషధ ఎంపిక, మోతాదు, వినియోగ విధానం సమస్తమూ అవగాహన కల్పించేది ఫార్మసిస్టు. నిజం చెప్పాలంటే తెర వెనుక వైద్యుడు ఫార్మసిస్టే.

అందుకే ఆరోగ్యకేంద్రాల్లో అత్యవసర పరిస్థితుల్లో వైద్యాధికారులు అందుబాటులో లేనప్పుడు చికిత్స అందించే బాధ్యత ఫార్మసిస్టులదే. కేంద్ర ఆరోగ్యశాఖ 'జాతీయ ఆరోగ్య విధానం–2017' ఫార్మసిస్టులకు సామాజిక ఆరోగ్యంపై శిక్షణ ఇచ్చి వారి సేవలను క్షేత్రస్థాయిలో వినియోగించుకోవాలని సూచించింది. కొన్ని సమయాల్లో వైద్యులు రాసిన మందులను సమీక్షించే అధికారం కూడా ఫార్మసిస్టుకు ఉంటుంది. మందుల వినియోగంలో ఫార్మసిస్టుల పాత్రను విస్మరించడంవల్ల వాటి వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోయింది. తద్వారా అనేక ఆరోగ్య సమస్యలు చుట్టుముట్టి ప్రాణాంతకమైన దుష్ప్రభావాలు సంభవిస్తున్నాయి. జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, ఇటలీ లాంటి యూరోపియన్ దేశాల్లో, సౌదీ అరేబియా లాంటి అరబ్ దేశాల్లో ఫార్మసిస్టులకు పెద్దపీట వేస్తారు. ఆ యా దేశాల్లోని వైద్యులు పరీక్షల అనంతరం వ్యాధిని గుర్తించి, ఫలానా వ్యాధి, ఫలానా మందు అని నిర్ధారణ చేస్తారు. ఆ వ్యాధికి ఏ ఔషధం సరిపోతుందో, అది ఏయే సమయాల్లో, ఏ మోతాదులో, ఏ విధంగా వినియోగించాలో ఫార్మసిస్టే రోగికి సూచిస్తాడు. కొన్ని యూరప్ దేశాల్లో రోగి వ్యాధిని గుర్తించి, ఔషధాన్ని సిఫారసు చేసే అధికారం కూడా ఫార్మసిస్టేదే. కానీ మనదేశంలో పరిస్థితి దీనికి పూర్తి భిన్నం.

భారత్‌లో ఫార్మసిస్టులకు సరైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక, సొంత ఫార్మసీలు పెట్టుకొనే స్థోమత లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఫార్మసిస్టు పోస్టులను భర్తీ చేయాలి. నిరుద్యోగులైన ఫార్మసిస్టులకు ఫార్మసీలు ఏర్పాటు చేసుకోడానికి వడ్డీ రహిత రుణ సౌకర్యం కల్పించాలి. ఆ విధంగా ఫార్మసిస్టుల సేవలను మరింతగా ఉపయోగించుకోవచ్చు.

– ఎమ్.డి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్ – కెమిస్ట్
(రేపు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం)

ఆలోచన రేపుతున్న కథనాలు

విశ్లేషణ



యతిన్ కార్యేకర్

ప్రపంచమంతటా హిట్ అయిన 'డాక్టర్ హూ' రచయిత స్టీవెన్ మొఫాట్ ఒకసారి, 'చివరకు, మనందరమూ కథలమే' అని రాశాడు. విశిష్టమైన కథలలో జీవిస్తూ, శ్వాసిస్తూ, ప్రేమిస్తున్న ఒక కళాకారుడిగా అది నిజమని నాకు తెలుసు. మనల్ని మనం ఐడెంటిఫై చేసుకోగల కథల పట్ల మనం చాలా గట్టిగా స్పందిస్తాం. అదీ ఏదో మానవాతీతమైన బృహత్తరమైనదానికి మనల్ని అనుసంధానించినప్పుడూ, భాష, భౌగోళిక ప్రత్యేకతల పరిమితులను అధిగమించి మానవత్వాన్ని చవిచూసేలా చేసినప్పుడే! ఉదాహరణకు వ్యక్తిగత లక్ష్యం, స్నేహం, మానవతావాదానికి చెందిన ఇతివృత్తం కలిగినదైనందువల్లనే 'ఆర్ఆర్ఆర్' ప్రపంచవ్యాప్తంగా అందరికీ చాలా సన్నిహితం అయ్యింది. ఉత్తర అమెరికాలో 1 మిలియన్ యూఎస్ డాలర్లు, ఆస్ట్రేలియాలో రెండున్నర లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు దాటి వసూలు చేసిన మొదటి కన్నడ చిత్రంగా 'కాంతార' సాధించిన అద్భుత విజయానికి దాని ఉద్వేగ భరితమైన నేటివిటీయే సహాయపడింది. గొప్ప నమ్మకంతో ఈ సినిమాను సృష్టించారు. పైగా మానవ భావోద్వేగాలు ప్రతిచోటా ఒకేలా ఉంటాయని మనకు గుర్తు చేస్తూనే, ఆ చిత్రం దాని సొంత నీతికి కట్టుబడి ఉంది. ప్రతిధ్వనించే భావోద్వేగాలు, ప్రత్యేకమైన సాంస్కృతిక సందర్భం, ప్రపంచ స్థాయి టెక్నిక్‌ని కలిగి ఉన్నందున దక్షిణ భారత చిత్ర పరిశ్రమల కంటెంట్‌ని ప్రపంచవ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు.



గురుదేవులు రవీంద్రనాథ్ టాగూర్ ఒకసారి ఇలా అన్నారు: 'ఎవరూ ప్రపంచ భారాన్ని మరింతగా పెంచకూడదు, ప్రతి ఒక్కరూ దానిని తగ్గించడానికి ప్రయత్నించాలి.' ఈ భారాన్ని తగ్గించడానికి కథలు చెప్పడం ఉత్తమ మార్గం అని నేను భావిస్తున్నాను. భాషకు అతీతంగా మనల్ని కలిపే కథలు మనం ఒంటరిగా లేమని గుర్తుచేస్తాయి. పైగా అవి మన భావోద్వేగాలను తిరుగులేని విధంగా ప్రభావితం చేస్తాయి. జపనీస్ రచయిత అకిరా కురసోవా తీసిన 1954 క్లాసిక్ చిత్రం, 'ది సెవెన్ సమురాయ్స్'ని తీసుకోండి. దీన్ని దాదాపు ప్రతి భాషలోనూ రీమేక్ చేశారు. దాని ఇంగ్లీష్ వెర్షన్ 1960లో జాన్ స్టర్జెస్ తీసిన 'ది మాగ్నిఫిసెంట్ 7', హిందీ వెర్షన్ 1975లో 'షోలే'. విజయ్‌టెండూల్కర్ రాసిన 'గిధాడే', 'శాంతత! కోర్ట్ చాలూ ఆహే', 'సఖారం బైండర్', 'కమలా', 'మిత్రాచి గోష్టా' వంటి మరాఠీ నాటకాలను వివిధ భాషల్లోకి అనువదించారు. వీటిలో చాలా నాటకాలు ఇప్పుడు 'జీ థియేటర్'లో హిందీలో అందుబాటులో ఉన్నాయి.

గత కొన్నేళ్లుగా, భారతీయ వినోద పరిశ్రమ మంచి కథా కథనాలపై దృష్టి సారించినందుకు నేను సంతోషిస్తున్నాను. థియేటర్ అయినా, సినిమా అయినా, ఓటీటీ అయినా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కంటెంట్ ప్రభావాన్ని మనం చూస్తున్నాం. దక్షిణ కొరియా, స్పెయిన్, ఫ్రాన్స్, అర్జెంటీనా, జపాన్, జర్మనీ వంటి అనేక ఇతర దేశాల నుండి కథలు ఇప్పుడు సులభంగా అందుబాటులో ఉంటున్నాయి. అలాగే మన కథకులు కూడా ఇంతవరకు ఎవరూ చెప్పని కథలతో ప్రయోగాలు చేస్తున్నారు. ఇప్పటికే సుపరిచితమైన కథనాలను కూడా తిరిగి ఆవిష్కరిస్తున్నారు. డబ్బింగ్, సబ్‌టైటిలింగ్‌ల ద్వారా కథల పరిధిని విస్తరిస్తున్నారు. సాంస్కృతికంగా సున్నితమైనవీ, సందర్భోచితమైనవీ అయిన ఉపశీర్షికలూ; సంభాషణకు చెందిన సారాంశాన్ని సంగ్రహించేలా, రెండు భాషల సూక్ష్మ నైపుణ్యాలను పుణికిపుచ్చుకున్న మంచి అనువాదకులు, ట్రాన్స్‌క్రైబర్లు ఇందుకు ఎంతో అవసరమనేది ఈ సందర్భంగా గమనార్హం.

ఇక థియేటర్ గురించి చెప్పాలంటే, ఇది కూడా మౌఖిక సంప్రదాయాల నుండి వీధి ప్రదర్శనలు, ప్రోసినియం (పరదాకు ముందు థియేటర్ వేదికకి చెందిన భాగం) ప్రదర్శనలతోపాటు, ముఖ్యంగా టెలివిజన్ ప్రేక్షకుల కోసం రూపొందించిన టెలిప్లేల వరకు అభివృద్ధి చెందింది. ఇవి ఇప్పుడు భాషా సరిహద్దులను దాటి విస్తృత శ్రేణి థీమ్‌లను, పాత్రలను సృష్టిస్తున్నాయి. మనం అలాంటి సృజనాత్మక ప్రకంపనల కాలంలో జీవిస్తున్నందుకూ; నా టెలిప్లేలలో ఒకటైన 'మా రిటైర్ హోతీ హై' ఇప్పుడు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రేక్షకులకు కన్నడ, తెలుగు భాషలలో అందుబాటులో ఉన్నందుకూ నేను ఎంతో పులకరించి పోతున్నాను


మంచి కథలలోని మరొక ముఖ్య అంశం ఏమిటంటే – అవి ఆలోచనలను రేకెత్తిస్తాయి. చాలా సూక్ష్మంగా సామాజిక మార్పును ఉత్కృష్ట స్థాయిలో ప్రారంభిస్తాయి. ఉదాహరణకు – స్వలింగ సంబంధాలు, లింగ పరమైన రాజకీయాలతో సహా అనేక సామాజిక సమస్యల గురించి మన ఆలోచనలను సరిదిద్దుకునేలా చేయడంలో చేతన్ దత్తర్, విజయ్ టెండూల్కర్ వంటి నాటక రచయితల రచనలు సహాయపడ్డాయి. టెండూల్కర్ రాసిన 'కమలా'ను చలనచిత్రంగా రూపొందించినప్పుడు సాధారణ స్త్రీల, మరీ ముఖ్యంగా గిరిజన స్త్రీల గౌరవం గురించి తీవ్రమైన సామాజిక చర్చ రేకెత్తింది.

ఈ రోజు కంటెంట్‌కు టెక్నిక్ సహాయం చేసినమాట నిజమే అయినా, కొత్త బాధ్యతలవైపు మారడానికీ, సమస్యల ప్రపంచంలో వారి స్థానం గురించి కొత్తగా ఆలోచించడానికీ ప్రజలను ప్రేరేపించే కథనాలు ఇప్పటికీ అవసరమే. భారతదేశంలో అటువంటి సుసంపన్నమైన కథనాలకు ఎన్నడూ కొరత లేదు. అవి అపారమైన సాంస్కృతిక, భౌగోళిక వైవిధ్యం నుండి ఉద్భవించినప్పటికీ వాటికి మనల్ని కదిలించే, తరలించే శక్తి ఉంది. మనల్ని కలిసికట్టుగా నవ్వుతూ, దుఃఖిస్తూ జీవితాన్ని ఆస్వాదింప చేస్తాయి.

వ్యాసకర్త ప్రముఖ బాలీవుడ్ నటులు

చేయరానివి ఇవి!

పరస్తుతి, పరనింద, ఆత్మస్తుతి, ఆత్మనింద – ఈ నాలుగూ సజ్జనులు చేసే పనులు కావు అని మహాభారతంలో ఒక నీతి ఉంది. 'అన్య కీర్తనంబు, అన్య నిందయు, తన్ను/ పరగ పొగడికోలు, ప్రబ్బికోలు,/ ఆపగా తనూజ! ఆర్యవృత్తములు కా/వనిరి వీని ఆద్యులైన మునులు...' ఇక్కడ 'ఆపగా తనూజుడు' (నదీ పుత్రుడు) అంటే గాంగేయుడైన భీష్ముడు. ఆ ధర్మవేత్తకు ఈ నీతి బోధిస్తున్నది ఛేదిరాజు శిశుపాలుడు. 'నువ్వు అదే పనిగా శ్రీకృష్ణుడినే పొగుడుతున్నావు. ఇది పెద్దలు చేయదగిన పనికాదు' అని శిశుపాలుడి అభ్యంతరం. ఉటంకించింది శిశుపాలుడయినా, ఇది 'ఆద్యులైన మునుల' మాట కదా! పెద్దలిలా ఎందుకు చెప్పారో ఇంచుక చింతన చేసుకొంటే తప్పులేదు.



జ్యోతిర్మయం

పరులను వాళ్ళ ఎదుటే 'ముఖస్తుతి' చేసేవాడు... పలచనైపోయి, ఆశ్రితుల స్థాయికి జారిపోతాడు. గౌరవం కోల్పోతాడు. పరులను వాళ్ళ పరోక్షంలో పొగిడినా, అలా పదేపదే చేస్తుంటే... దానివల్ల తనవాళ్ళకు నిరుత్సాహం కలగడమే కాక, వాళ్ళు దాన్ని పరి పరి విధాలుగా అపార్థం చేసుకొనే ప్రమాదం ఉంది. అలాగే పరనింద కూడా ప్రయోజన శూన్యం. అహంకారాన్ని ప్రకటించుకోవడమూ, శత్రుత్వాన్ని పెంచుకోవడమూ తప్ప నింద వల్ల సాధించేదేముంది? నిందను సకారాత్మకంగా స్వీకరించి, తమ 'తప్పు' గ్రహించి మారిపోయే 'పరులు' ఎక్కడయినా ఉంటారా?

ఆత్మస్తుతి సరేసరి. అది సాధారణంగా అల్పత్వాన్నీ, ఆత్మ న్యూనతా భావాన్నీ సూచిస్తుంది. ధీరులూ, సమర్థులూ వాళ్ళ ఘనత వాళ్ళు చెప్పుకోరు. ఘనతను చేతలే చెప్తాయి. చేతలు లోపించి నప్పుడే మాటలు. 'నేను ఘనుడిని' అని ఎంత చెప్పుకొన్నా దానికి విలువా, విశ్వసనీయతా ఉండవు. నమ్మేదెవరు?

ఆత్మనింద కూడా ప్రమాదకరమే. ఆత్మవిమర్శతో తన తప్పులు గ్రహించుకొని, తొలగించుకొంటే మంచిదే కానీ ఊరకే తనను తాను నిందించుకొంటూ కూర్చొంటే, అది ఉన్న ఆత్మవిశ్వాసాన్నీ, ధైర్యాన్నీ కూడా దెబ్బ తీసి, క్రమంగా మరింత పిరికితనానికీ, అసమర్థతకూ, కుంగుబాటుకూ దారి తీస్తుంది.

అయితే ఒకటి! మహాభారతమయితే ఇలా చెప్పింది కానీ ఈ రోజులలో, ఆత్మస్తుతీ, పరనిందా, దాంతోపాటు అవసరార్థం 'తమంత వారు లేరు సుమా!' అంటూ పరస్తుతీ, లోకం చేత ఓహో అనిపించుకొనేందుకు అప్పుడప్పుడూ ఆత్మనిందా మానేస్తే, సమాజంలో ఎక్కువగా మౌనమే రాజ్యం చేయాల్సివస్తుందేమో!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.1.36 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.9.17 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.1.02 నుండి 2.32 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.16 నుండి 1.05 వరకు, తదుపరి ప.2.41 నుండి 3.27 వరకు, **అమృతఘడియలు:** రా.10.01 నుండి 11.31 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.52, **సూర్యాస్తమయం:** 5.53.

మరో 15 రోజులు రిమాండ్ పొడిగించండి

తదుపరి దర్యాప్తు నిమిత్తం పొడిగింపు తప్పనిసరి

కీలక డాక్యుమెంట్లు సేకరించాల్సి ఉంది.. పలువురు సాక్షులను విచారించాలి

- ప్రధాన సాక్షులు పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని పారిపోయారు
- వారిద్దరికీ ఈ కుంభకోణంతో చాలా దగ్గర సంబంధం ఉంది
- వారి పరారీ వెనుక చంద్రబాబు ప్రధాన అనుమానితుడుగా ఉన్నారు
- సాక్షులను ప్రభావితం చేస్తున్నారు.. సాక్ష్యం ఇచ్చే వారిని ప్రలోభపెడుతున్నారు
- అందువల్ల మరికొంత కాలం రిమాండ్‌లో ఉంచాలని ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసిన సీఐడీ

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న మాజీ సీఎం చంద్రబాబు రిమాండ్‌ను మరో 15 రోజుల పాటు పొడిగించాలని కోరుతూ సీఐడీ ఆదివారం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో మెమో దాఖలు చేసింది. తదుపరి దర్యాప్తు నిమిత్తం చంద్రబాబు రిమాండ్‌ను పొడిగించడం తప్పనిసరి అని అందులో పేర్కొంది. స్కిల్ కుంభకోణంలో దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, పలు కీలక డాక్యుమెంట్లను సేకరించాల్సి ఉందని, పలువురు సాక్షులను కూడా విచారించాల్సి ఉందని సీఐడీ తెలిపింది. ఈ కేసులో ప్రధాన సాక్షులైన పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ వాసుదేవ్ పార్థసాని దర్యాప్తు సంస్థకు అందుబాటులో లేకుండా పరారీలో ఉన్నారని నివేదించింది. ఈ కేసుతో వారిద్దరికీ చాలా దగ్గర సంబంధం ఉందని పేర్కొంది. పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ వాసుదేవ్ పార్థసాని పరారీ వెనుక చంద్రబాబు ప్రధాన అనుమానితుడిగా ఉన్నారని తెలిపింది. దుర్వినియోగమైన నిధులు అంతిమంగా ఎక్కడకు వెళ్లాయి? షెల్ కంపెనీల ద్వారా నగదు రూపంలో ఎవరికి చేరాయి? అనే వివరాలు వీరిద్దరికీ తెలుసని సీఐడీ తన మెమోలో పేర్కొంది.

సాక్షులపై ఆ స్థాయిలో ప్రభావం చూపుతున్నారు..

చంద్రబాబును జుడీషియల్ కస్టడీలో ఉంచాల్సిన అవసరం ఉందని, అప్పుడు మాత్రమే ఈ కుంభకోణంలో చంద్రబాబు పాత్ర గురించి మాట్లాడే సాక్షులకు రక్షణ ఉంటుందని సీఐడీ తెలిపింది. మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్ దర్యాప్తును పక్కదారి పట్టించేలా మీడియాలో మాట్లాడారని నివేదించింది. సాక్షులపై చంద్రబాబు, ఆయన మద్దతుదారులు ఆ స్థాయిలో ప్రభావం చూపుతున్నారని వివరించింది. ఈ కేసును డ్యామేజ్ చేసేందుకు చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారంది. సాక్షులను బెదిరించడం, భయపెట్టడం, ప్రభావితం చేస్తూ, సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందని పేర్కొంది. చంద్రబాబుకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇచ్చే వారిని ప్రలోభపెట్టడం, బెదిరించడం లాంటివి చేస్తూ దర్యాప్తులో జోక్యం చేసుకునే అవకాశం ఉందని సీఐడీ తన మెమోలో తెలిపింది. దర్యాప్తు సంస్థకు, కోర్టుకు వాస్తవాలను తెలియనివ్వకుండా చేస్తున్నారని, వీటిని పరిగణలోకి తీసుకుని చంద్రబాబు రిమాండ్‌ను మరో 15 రోజుల పాటు పొడిగించాలని కోర్టును అభ్యర్థించింది.

బాబూ.. స్కిల్ స్కామ్ డబ్బు రాష్ట్ర ఖజానాకు జమ చేయండి

చంద్రబాబుకు ప్రజల పోస్టుకార్డులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): 'గజదొంగ చంద్రబాబునాయుడు గారికి.. అయ్యా.. మీరు స్కిల్ స్కామ్‌లో ప్రజల సొమ్మును దోచుకున్నారని ప్రాథమిక విచారణ జరిగి ఏసీబీ కోర్ట్ రిమాండ్ విధించింది. మాజీ ముఖ్యమంత్రిగా బాధ్యతగల వ్యక్తివంటూ మీ వందిమాగధులు కీర్తిస్తున్న నేపథ్యంలో మీరు నిజాయితీగా ఆ డబ్బు ఎక్కడికి మళ్లించారో రాష్ట్ర ప్రజలకు సవివరంగా తెలియ చేసి.. ఆ సొమ్మును రాష్ట్ర ఖజానాకు జమ చేయాలని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాము'అంటూ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామ ప్రజలు చంద్రబాబుకు పోస్ట్ కార్డులు పంపారు. స్కిల్ స్కామ్‌లో రిమాండ్ ఖైదీ(7691)గా రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గొల్లపూడి గ్రామస్తులు ఆదివారం నిర్వహించిన పోస్ట్ కార్డుల ఉద్యమంలో భాగంగా గ్రామ ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. పోస్ట్ కార్డులపై పైవిధంగా రాసి ఆ పోస్ట్ కార్డ్‌లను చంద్రబాబు పేరుతో రాజమండ్రి సెంట్రల్ జైల్ చిరునామాకు పోస్ట్ చేశారు.

5 వరకు రిమాండ్ పొడిగింపు

చంద్రబాబు పోలీసు కస్టడీ ముగియడంతో ఏసీబీ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు

సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టు ముందు హాజరుపరిచిన అధికారులు

- థర్డ్ డిగ్రీ ప్రయోగించారా? భౌతికంగా ఏమైనా ఇబ్బంది పెట్టారా? అని ప్రశ్నించిన కోర్టు
- అలాంటిది ఏమీ లేదు.. అన్యాయంగా ఇరికించారు.. అక్రమంగా జైల్లో ఉంచారన్న బాబు
- దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది.. అన్ని డాక్యుమెంట్లు ఇవ్వడం సాధ్యం కాదన్న న్యాయస్థానం
- ఆధారాలన్నింటినీ పరిశీలించాకే మీ పాత్రపై ప్రాథమిక నిర్ధారణకు వచ్చాం
- అందుకే మిమ్మల్ని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపామన్న కోర్టు
- రిమాండ్ ఉత్తర్వులు యాంత్రికంగా ఇచ్చారన్న చంద్రబాబు న్యాయవాది
- దీనిపై తీవ్రంగా స్పందించిన న్యాయస్థానం
- కేసు డైరీ, సెక్షన్ 164 వాంగ్మూలాలు, 2 వేల పేజీలపైగా డాక్యుమెంట్లను పరిశీలించామని స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్న మాజీ సీఎం చంద్రబాబు జుడీషియల్ రిమాండ్‌ను ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం అక్టోబర్ 5వ తేదీ వరకు పొడిగించింది. చంద్రబాబు రెండు రోజుల పోలీసు కస్టడీ ఆదివారం సాయంత్రంతో ముగిసిన నేపథ్యంలో ఏసీబీ కోర్టు ఆయన రిమాండ్‌ను పొడిగిస్తూ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసు కస్టడీ ముగియడంతో జైలు అధికారులు ఆదివారం సాయంత్రం 5.45 గంటలకు చంద్రబాబును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీబీ కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా న్యాయస్థానం ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసుకుంది. విచారణ సందర్భంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించారా? కఠినంగా ఏమైనా వ్యవహరించారా? అని ఆరా తీసింది. అలాంటిది ఏమీ లేదని చంద్రబాబు కోర్టుకు నివేదించారు. విచారణ సందర్భంగా ఆహారం, మందులతోపాటు న్యాయవాదులతో మాట్లాడుకునే వెసులుబాటు తదితర అవకాశాలిస్తూ ఆదేశాలిచ్చామని, వాటిని ఏమైనా అధికారులు ఉల్లంఘించారా? అని న్యాయస్థానం ప్రశ్నించగా అలాంటిది ఏమీ లేదని చంద్రబాబు సమాధానం ఇచ్చారు. భౌతికంగా ఇబ్బందులకు గురి చేశారా? అని కోర్టు ప్రశ్నించగా, లేదని చంద్రబాబు సమాధానం ఇచ్చారు. ఇంకేమైనా చెప్పాల్సి ఉందా? అని న్యాయస్థానం ప్రశ్నించడంతో, తనను అన్యాయంగా ఈ కేసులో ఇరికించారని, అక్రమంగా జైలులో ఉంచారని చంద్రబాబు పేర్కొన్నారు.

మీ పాత్రపై 600కిపైగా డాక్యుమెంట్లు...

మీపై ప్రస్తుతం ఉన్నవి ఆరోపణలేనని కోర్టు చంద్రబాబుకు తెలిపింది. సీఐడీ దర్యాప్తు చేస్తోందని, ఇప్పటి వరకు సాగించిన దర్యాప్తులో మీ పాత్రకు సంబంధించిన ఆధారాలను కోర్టు ముందుంచిందని పేర్కొంది. సీఐడీ సమర్పించిన ఆధారాలను పరిశీలించి వాటికి ప్రాథమిక ఆధారాలున్నాయని నిర్ధారణకు వచ్చిన తరువాతే జుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు కోర్టు చంద్రబాబుకు తేల్చి చెప్పింది. సీఐడీ అధికారులు చార్జిషీట్ దాఖలు చేసిన అనంతరం అన్ని సాక్ష్యాధారాలను పరిశీలించిన తరువాతనే మీరు దోషినా? నిర్దోషినా? అన్నది కోర్టు తేలుస్తుందని చంద్రబాబుకు స్పష్టం చేసింది. చట్టాన్ని అనుసరించే ఈ కోర్టు ముందుకెళుతుందని తెలిపింది. సీఐడీ అధికారులు ఈ కేసులో మీ పాత్రకు సంబంధించి 600కిపైగా డాక్యుమెంట్లను కోర్టు ముందుంచారని తెలిపింది. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో అవన్నీ ఈ దశలో రహస్య డాక్యుమెంట్లే అవుతాయని చంద్రబాబుకు స్పష్టం చేసింది.

దర్యాప్తు జరగాల్సిందే.. అది ప్రొసీజర్

దర్యాప్తు అధికారులకు విశిష్ట అధికారాలుంటాయని కోర్టు పేర్కొంది. అయితే మీ హక్కులను, దర్యాప్తు సంస్థ విశిష్టాధికారాన్ని పరిగణలోకి తీసుకుని తగిన న్యాయం చేయాల్సిన బాధ్యత కోర్టుపై ఉందని, ఇప్పుడు తాము అదే చేస్తున్నామని ఏసీబీ కోర్టు చంద్రబాబుకు తేల్చి చెప్పింది. ఎలాంటి ఆధారాలు లేకుండానే అరెస్ట్ చేశారని, సీఐడీ ఈ కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇవ్వలేదని చంద్రబాబు పేర్కొనగా, మీకు ఇవ్వదగ్గ డాక్యుమెంట్లు కొన్ని ఉంటాయని, వాటిని మీ న్యాయవాదుల ద్వారా తీసుకోవచ్చని సూచించింది. వాటిని పరిశీలిస్తే మిమ్మల్ని ఎందుకు అరెస్ట్ చేశారన్న సంగతి మీకు అర్థం కావచ్చని చంద్రబాబునుద్దేశించి కోర్టు వ్యాఖ్యానించింది. దర్యాప్తు జరగాల్సిందేనని, అది ప్రొసీజర్ అని కోర్టు గుర్తు చేసింది. మీ న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారని, దానిపై విచారణ జరపాల్సి ఉందని కోర్టు తెలిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న తరువాతే బెయిల్ ఇవ్వాలా? వద్దా? అనే విషయాన్ని నిర్ణయించడం జరుగుతుందని, ఇందుకు సమయం పడుతుందని తెలిపింది. అందుకోసమే జుడీషియల్ రిమాండ్‌ను అక్టోబర్ 5 వరకు పొడిగిస్తున్నట్లు వెల్లడించింది. మీరు ప్రస్తుతం పోలీసు కస్టడీలో లేరని, కోర్టు కస్టడీలో ఉన్నారని పేర్కొంటూ చంద్రబాబును జాగ్రత్తగా చూసుకోవాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించింది.

యాంత్రికంగా ఉత్తర్వులిస్తున్నామా?

అంతకు ముందు చంద్రబాబు తరఫు న్యాయవాదులు ఏసీబీ కోర్టులో చిన్నపాటి హైడ్రామా నడిపారు. జుడీషియల్ రిమాండ్ పొడిగింపుపై చంద్రబాబు తరపున హాజరైన సీనియర్ న్యాయవాది, టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు అభ్యంతరం తెలిపారు. కోర్టు తనంతట తానుగా రిమాండ్‌ను పొడిగించలేదన్నారు. రిమాండ్‌ను పొడిగించవద్దని కోరారు. పొడిగింపు కోసం సీఐడీ మెమో దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో రిమాండ్ పొడిగింపు పిటిషన్ వేయలేదా? అని ఏసీబీ కోర్టు ప్రశ్నించడంతో తాము రిమాండ్ పొడిగింపు కోసం పిటిషన్ దాఖలు చేసినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నివేదించారు. ఆ కాపీని చంద్రబాబు న్యాయవాదులకు అందచేయాలని పీపీని న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం పోసాని స్పందిస్తూ కోర్టు యాంత్రికంగా జుడీషియల్ రిమాండ్ ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొనడంపై న్యాయస్థానం ఒకింత తీవ్రంగా స్పందించింది. సీఐడీ తమ ముందుంచిన కేసు డైరీని, సెక్షన్ 164 స్టేట్‌మెంట్లన్నింటినీ చదివామని, అలాగే 2000 పేజీలపైగా డాక్యుమెంట్లను పరిశీలించామని, వాటన్నింటినీ చూసిన తరువాతనే చంద్రబాబు పాత్రకు సంబంధించి ప్రాథమిక ఆధారాలున్నాయని నిర్ధారణకు రావడం జరిగిందని కోర్టు స్పష్టం చేసింది. ప్రాథమిక ఆధారాలకు అనుగుణంగానే జుడీషియల్ రిమాండ్ ఉత్తర్వులు ఇచ్చినట్లు తేల్చి చెప్పింది. అంతేకానీ మీరు చెబుతున్నట్లు యాంత్రికంగా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని స్పష్టం చేసింది. కోర్టు ఆగ్రహంతో ఖంగుతిన్న చంద్రబాబు న్యాయవాది తమ ఉద్దేశం అది కాదంటూ సమర్థించుకునే యత్నం చేశారు. చంద్రబాబుతో మాట్లాడిన అనంతరం న్యాయస్థానం ఆయన రిమాండ్‌ను పొడిగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది.

మాకు సమయం ఎక్కడిస్తున్నారు..?

అటు తరువాత ఏసీబీ కోర్టు ఇరుపక్షాలను ఉద్దేశించి పలు వ్యాఖ్యలు చేసింది. ఈ కోర్టు ఏదీ యాంత్రికంగా చేయడం లేదని పేర్కొంది. ప్రతి చిన్న విషయానికి పలు పిటిషన్లు వేస్తున్నారని, ఒకదాని వెంట మరొకటి పిటిషన్లు దాఖలు చేస్తూనే ఉన్నారని గుర్తు చేసింది. 'మీరు వేసిన దానికి వారు, వారు వేసిన దానికి మీరు కౌంటర్లు వేస్తారు. వాటిన్నింటినీ ఈ కోర్టు క్షుణ్ణంగా చదవాలి. అర్థం చేసుకోవాలి. చట్టం ఏం చెబుతుందో చూడాలి. కోర్టు ఇన్ని పనులు చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ చేసేందుకు మీరు కోర్టుకు సమయం ఎక్కడ ఇస్తున్నారు? ఇప్పుడు పిటిషన్ వేశాం, వినాల్సిందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అందరూ కోర్టుకు సహకరిస్తేనే పని చేయడం సాధ్యం అవుతుంది. చట్టానికి లోబడే వ్యవహరించాలి. ఈ విషయాన్ని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నాం'అని న్యాయస్థానం పేర్కొంది.

మళ్లీ ఆవు కథే!

సాక్షి, అమరావతి, రాజమహేంద్రవరం: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ సీఎం చంద్రబాబు రెండు రోజుల సీఐడీ విచారణ ఆదివారం ముగిసింది. రూ.3,300 కోట్ల ప్రాజెక్టుగా నకిలీ ఒప్పందంతో నిబంధనలకు విరుద్ధంగా రూ.371 కోట్లు విడుదల చేసి రూ.241 కోట్లను షెల్ కంపెనీల ద్వారా కొల్లగొట్టిన కేసులో ప్రధాన ముద్దాయి చంద్రబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న విషయం తెలిసిందే. న్యాయస్థానం ఆదేశాలతో సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆయన్ని రెండు రోజులపాటు కస్టడీలోకి తీసుకుని విచారించింది. పక్కా పన్నాగంతో 'స్కిల్'కుంభకోణానికి పాల్పడ్డ చంద్రబాబు సీఐడీ విచారణను కూడా పక్కదారి పట్టించేందుకు విశ్వ ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. రెండు రోజుల విచారణలోనూ ఆయన ఏమాత్రం సహకరించనందున చంద్రబాబు కస్టడీని పొడిగించాల్సిందిగా న్యాయస్థానాన్ని కోరాలని సీఐడీ నిర్ణయించింది.

40 ఇయర్స్ ఇండస్ట్రీ.. 14 ఏళ్లు సీఎంనంటూ

సీఐడీ విచారణలో చంద్రబాబు సంబంధం లేని సంగతులు చెబుతూ తప్పించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు స్కిల్ కుంభకోణానికి సంబంధించి సిట్ అధికారులు ఏ ప్రశ్నలు వేసినా చంద్రబాబు ఒకటే చెబుతూ వచ్చారు. రాజకీయాల్లో తాను 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని... 14 ఏళ్లు సీఎంగా చేశానంటూ కాలయాపన చేసేందుకే ప్రయత్నించారు. దీంతో ఆయన రాజకీయ అనుభవం గురించి తమకు కూడా తెలుసని, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్ట్ జీవో, ఒప్పందాలను ఏ ప్రాతిపదికన చేశారు? బిల్లులు చెల్లింపుల్లో హేతుబద్ధత ఏమిటి? నిధుల మళ్లింపులో పాత్రధారులతో సంబంధాలు ఏమిటి? అనే అంశాలకు సూటిగా సమాధానాలు చెప్పాలని సిట్ అధికారులు పదేపదే పట్టుబట్టాల్సి వచ్చింది.

వ్యూహాత్మక ప్రశ్నావళి.. కొంతవరకు సఫలీకృతం

మొదటి రోజు చంద్రబాబు విచారణకు ఏమాత్రం సహకరించకపోవడంతో రెండో రోజు సిట్ అధికారులు ప్రశ్నావళిలో కొన్ని మార్పులు చేశారు. వరుస క్రమంలో కాకుండా ఓ అంశం నుంచి మరో అంశానికి జంబ్లింగ్ విధానంలో ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. ప్రధానంగా ఈ కేసులో ఇప్పటికే సీఐడీతోపాటు ఈడీ అరెస్ట్ చేసిన సుమన్ బోస్, వికాస్ వినాయక్ కన్విల్కర్‌లతోపాటు నిధుల అక్రమ తరలింపులో షెల్ కంపెనీలతో చంద్రబాబు సంబంధాలు, ఉత్తర ప్రత్యుత్తరాల గురించి కీలక ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. నిధుల అక్రమ మళ్లింపులో కీలక పాత్రధారులైన చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తాలతో చంద్రబాబు, లోకేశ్ లావాదేవీలపై కీలక ఆధారాలను ప్రదర్శిస్తూ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. సీఐడీ నోటీసులు జారీ చేయగానే పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసాని పరారు కావడంపై సూటిగా ప్రశ్నించినట్లు సమాచారం. వెరసి రెండు రోజుల విచారణలో వ్యూహాత్మకంగా ప్రశ్నలు సంధించడం ద్వారా సీఐడీ అధికారులు కొంతవరకు సఫలీకృతమైనట్లు తెలుస్తోంది. న్యాయస్థానం ఆదేశాల మేరకు చంద్రబాబు విచారణ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేశారు. అనంతరం మధ్యవర్తుల సమక్షంలో చంద్రబాబు వాంగ్మూలాన్ని నమోదు చేశారు. విచారణ సాగిన తీరు, వీడియో రికార్డింగ్ తదితర ఫైళ్లను న్యాయస్థానానికి సిట్ అధికారులు సమర్పించనున్నారు.

మరింత విచారించాల్సిన అవసరం: విచారణ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించి కాలహరణం చేసినందున చంద్రబాబును మరి కొద్ది రోజులు కస్టడీలో విచారించేందుకు అనుమతించాల్సిందిగా న్యాయస్థానాన్ని కోరాలని సీఐడీ నిర్ణయించింది. మరోవైపు ఈ కేసులో సిట్ నోటీసులు జారీ చేసిన ఇద్దరు కీలక వ్యక్తులు విదేశాలకు పరారీ కావడం వెనుక చంద్రబాబు పాత్ర ఉన్నట్లు నివేదించనుంది. ఈ కేసులో గతంలో విచారించిన సాక్షులను ప్రభావితం చేసిన ఉదంతాలను కూడా న్యాయస్థానం దృష్టికి మరింత వివరంగా తీసుకెళ్లనుంది. ఈ నేపథ్యంలో ఈ కుంభకోణంలో కుట్రకోణానికి సంబంధించి పూర్తి వాస్తవాలను రాబట్టేందుకు చంద్రబాబును మరి కొద్ది రోజులు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు అనుమతించాలని న్యాయస్థానానికి సిట్ అధికారులు విజ్ఞప్తి చేయనున్నారు.

సీఐడీ విచారణకు సహకరించని చంద్రబాబు

- సుదీర్ఘ రాజకీయ అనుభవం, దీర్ఘకాలం సీఎంనంటూ దాటవేత యత్నాలు
- ముగిసిన 2 రోజుల కస్టడీ విచారణ
- జంబ్లింగ్ విధానంతో ప్రశ్నలు సంధించిన అధికారులు
- మరికొద్ది రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని కోరనున్న సిట్

పవన్ కల్యాణ్ ఎక్కడ?

జనసేన నేతలను ప్రశ్నించిన బ్రాహ్మణి

రాజమహేంద్రవరం విద్యానగర్‌లో లోకేశ్ క్యాంపు వద్ద ఆయన భార్య బ్రాహ్మణితో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసేన పార్టీ నేతలు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. పవన్ కల్యాణ్ ఎక్కడని జనసేన నేతలను బ్రాహ్మణి ప్రశ్నించారు. దీంతో ఒక్కసారిగా కంగు తిన్న నేతలు పవన్ బిజీగా ఉన్నారని చెప్పారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు రెండు పార్టీలూ అన్నదమ్ముల్లా కలిసి పోరాడాలని బ్రాహ్మణి కోరారు. తమకు అండగా నిలబడుతున్న నేతలకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ నేతలు తమకు మద్దతు ఇస్తే పోరాటం చేస్తామని జనసేన నేతలు చెప్పారు. అయితే ఉమ్మడి పోరాటానికి అవసరమైన నిధులు సమకూర్చాలని బ్రాహ్మణిని జనసేన నేతలు కోరినట్టు సమాచారం. 'నిధుల విషయం తరువాత మాట్లాడదాం.. ఉమ్మడి పోరు ప్రారంభిద్దాం'అని బ్రాహ్మణి చెప్పడంతో జనసేన నేతలు మెల్లగా జారుకున్నట్లు తెలిసింది.

మా కులానికి బాబు కరోనాలా మారాడు

- 'సాక్షి'తో టీడీపీ మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాశ్



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: చంద్రబాబు స్వశక్తి హీనుడని, పరాన్నజీవి రకమని.. సొంత బలంతో ఎప్పుడూ ముందడుగు వేయలేదని, ఇకపైనా వేయలేడని టీడీపీ మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత అడుసుమిల్లి జయప్రకాశ్ వ్యాఖ్యానించారు. కుట్రలు, కుతంత్రాలు, అవినీతే ప్రధాన బలాలని.. వ్యవస్థల విధ్వంసం, మాయోపాయాలే ఆయన ఆయుధాలన్నారు. ఎన్టీఆర్, వైఎస్సార్, జగన్‌మోహన్‌రెడ్డిలా ప్రజలకు శాశ్వతంగా గుర్తుండిపోయేలా ఒక్క మంచి పథకాన్ని అమలుచేయలేకపోయాడని 'సాక్షి'తో అన్నారు. తమ కులానికి కరోనాలా మారాడని తమ పెద్దలు మథనపడుతున్నారని అడుసుమిల్లి ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

బాబు పాపం పండింది

వైఎస్సార్‌ను మించి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారు. కానీ.. అమరావతి రాజధాని పేరిట ఐదేళ్లలో చంద్రబాబు చేసిందేముంది? అవినీతికి కేరాఫ్ అడ్రస్ అయిన బాబు పాపం పండి రాజమండ్రి జైలులో ఊచలు లెక్కిస్తున్నాడు. ఒంటరిగా పోటీ చేయలేని స్థాయికి టీడీపీని దిగజార్చాడు. బాబు జైలుకు వెళ్లింది కేవలం ఆయన చేసిన అవినీతి, అక్రమాలవల్లే. దానికోసం సామాజికవర్గం మొత్తం రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయా లా? వీటివల్ల గ్రామాల్లో మా వర్గం ఒంటరిదవుతోంది. తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకుని బాబు బయటకు రావాలే తప్ప సైకో ఫ్యాన్స్ తో కృత్రిమ ఉద్యమాలు చేయించకూడదు.

కిలారు.. పరారు!

అదృశ్యమైన లోకేశ్ సన్నిహితుడు రాజేశ్

ఇన్నర్ రింగ్‌రోడ్, ఫైబర్‌నెట్ కుంభకోణాల్లో కీలక పాత్రధారి

అక్రమంగా నిధుల తరలింపులోనూ అతడే కీలకం

సాక్షి, అమరావతి: మాజీ సీఎం చంద్రబాబు హయాంలో సాగించిన కుంభకోణాల్లో పాత్రధారుల పరారీ పరంపర కొనసాగుతోంది. సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణలో టీడీపీ సర్కారు అవినీతి బాగోతాలు బయటపడుతున్న కొద్దీ పరారవుతున్న వారి జాబితా పెరుగుతూ వస్తోంది. తాజాగా నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడైన కిలారు రాజేశ్ అదృశ్యం కావడం కలకలం రేపుతోంది. ఎప్పుడూ లోకేశ్ వెన్నంటే ఉండే రాజేశ్ కొద్ది రోజులుగా కనిపించడం లేదు. లోకేశ్ ప్రస్తుతం ఢిల్లీలో ఉండగా రాజేశ్ మాత్రం ఎక్కడున్నాడో ఎవరికీ అంతుబట్టడం లేదు. చంద్రబాబు, లోకేశ్ ఆదేశాలతోనే అతడు పరారైనట్లు టీడీపీ వర్గాలే చెబుతుండటం గమనార్హం.

నిధుల తరలింపులో పాత్రధారి..

నారా లోకేశ్‌కు కిలారు రాజేశ్ అత్యంత సన్నిహితుడన్నది బహిరంగ రహస్యం. చినబాబు తరపున అన్ని వ్యవహారాలను నెరిపేది రాజేశే. కొన్ని వ్యవహారాల్లో చంద్రబాబు మాట కంటే రాజేశ్ చెప్పిన దానికే లోకేశ్ మొగ్గు చూపుతారని టీడీపీ వర్గాలు చెబుతుండటం గమనార్హం. రాజేశ్ పరోక్షంగా టీడీపీ వ్యవహారాలన్నీ తన గుప్పిట్లో పెట్టుకున్నారు. పార్టీ ఆర్థిక వ్యవహారాలన్నీ రాజేశ్ కనుసన్నల్లోనే సాగుతున్నాయి. పార్టీలో ఏదైనా పదవి కావాలంటే చంద్రబాబు కంటే రాజేశ్ వద్దకు వెళితేనే పని అవుతుందన్న అభిప్రాయం సర్వత్రా నెలకొంది. లోకేశ్ యువగళం పాదయాత్రకు రాజేశ్ నిర్వాహకుడిగా వ్యవహరిస్తున్నాడు.


టీడీపీ నేత లోకేశ్‌తో కిలారు రాజేశ్ (ఫైల్)

షాడో మంత్రి.. నెట్‌వర్క్‌లో కీలకం

లోకేశ్ మంత్రిగా ఉన్నప్పుడు రాజేశ్ షాడో మంత్రిగా చెలరేగిపోయాడు. అన్ని ఫైళ్లను అనధికారికంగా అతడే చూసేవారని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. చంద్రబాబు, లోకేశ్ సూత్రధారులుగా సాగించిన అన్ని కుంభకోణాల్లోనూ రాజేశ్ కీలక పాత్రధారిగా ఉన్నాడు. స్కిల్ డెవలప్‌మెంట్, అమరావతిలో తాత్కాలిక భవనాల నిర్మాణ కాంట్రాక్టుల ఖరారు, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్, ఫైబర్ నెట్ టెండర్ల ఖరారు.. ఇలా అన్ని కుంభకోణాల్లోనూ ప్రధానంగా వినిపించిన పేరు కిలారు రాజేశ్. అక్రమంగా కాంట్రాక్టులు కట్టబెట్టడం, నిబంధనలకు విరుద్ధంగా నిధుల విడుదల, షెల్ కంపెనీల ద్వారా అక్రమ నిధుల తరలింపు కోసం చంద్రబాబు ఏర్పాటు చేసిన నెట్‌వర్క్‌కు కిలారు రాజేశ్ సంధాన కర్తగా వ్యవహరించాడు. అదే విషయం సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. చంద్రబాబు, లోకేశ్ ప్రధాన నిందితులుగా ఉన్న ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ నెట్, అసైన్డ్ భూముల కేసుల్లో కిలారు రాజేశ్‌ను కూడా విచారిస్తామని సీఐడీ అదనపు ఎస్పీ సంజయ్ ఇప్పటికే ప్రకటించారు. అతడి పాత్రపై పూర్తి ఆధారాలు లభించడంతోనే విచారించాలని సీఐడీ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రాజేశ్ అదృశ్యం కావడం గమనార్హం.

మూడుకు చేరుకున్న అదృశ్యాలు..

కిలారు రాజేశ్‌ను విచారించాలని సీఐడీ నిర్ణయించడంతో చంద్రబాబు, లోకేశ్ బెంబేలెత్తారు. అతడిని సీఐడీ విచారిస్తే టీడీపీ హయాంలో సాగించిన మరెన్నో కుంభకోణాలు బయటకు వస్తాయని ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో రాజేశ్‌ను అజ్ఞాతంలోకి పంపించాలని నిర్ణయించిన చంద్రబాబు అదే విషయాన్ని ములాకత్‌లో తనను కలిసిన యనమల రామకృష్ణుడుకు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రాజేశ్ అదృశ్యమయ్యాడు. అతడు దేశంలోనే ఎక్కడైనా అజ్ఞాతంలో ఉన్నాడా...? విదేశాలకు పరారయ్యాడా? అన్నది తెలియరాలేదు. దీంతో చంద్రబాబు ఆదేశాలతో పరారైన వారి సంఖ్య మూడుకు చేరుకుంది. స్కిల్ కుంభకోణంలో విచారణకు హాజరు కావాలని సీఐడీ నోటీసులు జారీ చేయగానే చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ అమెరికాకు, షాపూర్జీ–పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ పార్థసాని దుబాయ్‌కు పరారైన విషయం తెలిసిందే.


మాకు సీఎం కావాలన్న ఆలోచనలేదు

- చంద్రబాబుకు మద్దతుగా మాత్రమే ఉన్నాం
- కాపు నేతలు టీడీపీతో పొత్తును వ్యతిరేకిస్తున్నారు
- ఇలా వ్యతిరేకించే వారిని మేం పరిగణనలోకి తీసుకోం
- టీడీపీ పొత్తు పట్ల 95 శాతం జనసైనికులు అనుకూలంగా ఉన్నారు
- జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

సాక్షి, తిరుపతి : తమకు సీఎం కావాలన్న ఆలోచన లేదని.. టీడీపీకి, చంద్రబాబుకు తాము మద్దతుగా మాత్రమే ఉన్నామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు చెప్పారు. టీడీపీతో పొత్తుపట్ల 95 శాతం పార్టీ శ్రేణులు అనుకూలంగా ఉన్నారని తెలిపారు. వ్యతిరేకంగా ఉన్న వారిని పరిగణనలోకి తీసుకోవడంలేదని ఆయన స్పష్టంచేశారు. తిరుపతి సమీపంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీకి మద్దతుగా కలిసి పోరాడాలని నిర్ణయించామని ప్రకటించారు. అయితే, కాపు నేతలు టీడీపీతో పొత్తును వ్యతిరేకిస్తున్నారన్నారు. ఎవరు సీఎం అనేది కాలమే నిర్ణయిస్తుందని నాగబాబు చెప్పారు. ఇక పొత్తుపై బీజేపీ నుంచి కూడా త్వరలోనే నిర్ణయం వస్తుందని నాగబాబు ఒక ప్రశ్నకు బదులిచ్చారు. ప్యాకేజీ అంటే చెప్పు తీసుకుని కొడతామని వ్యాఖ్యానించారు. త్వరలోనే రాయలసీమలో పవన్ వారాహి యాత్ర ఉంటుందన్నారు.

మేం అలా అనలేదు..

జనసైనికులు ఎప్పుడూ ఎవరిదో ఒకరి జెండాను మోయాల్సిందేనా? అని మీడియా అడిగిన ప్రశ్నకు.. 'మీరు సాక్షి వారా? ఈరోజు సాక్షిలో



వచ్చిన వార్త గురించి చర్చించుకున్నాం. మేం అలా అనలేదు'.. అని అంటూ.. సాక్షికి సమాధానం చెప్పడం కూడా వృథా అని వ్యాఖ్యానించారు. కేసులకు భయపడబోమని, వాటిని ఎదుర్కొంటామని.. తమకూ మంచి లీగల్ టీం ఉందన్నారు. అలాగే, తమ పార్టీ శ్రేణులు భూదందాలు చేయడంలేదని, న్యాయస్థానంలోనే తేల్చుకుంటామని ఆయనన్నారు. కోట్ల రూపాయలు దోచేసి భయభ్రాంతులకు గురిచేసే నాయకులు తమకు లేరన్నారు.

టీడీపీతో పొత్తుకు ఒప్పుకోం..

అంతకుముందు జరిగిన కార్యకర్తల సమావేశంలో.. టీడీపీతో పొత్తుకు ఒప్పుకునేది లేదని, వారితో కలిసి వెళ్లే ప్రసక్తేలేదని జనసేన శ్రేణులు నాగబాబు సమక్షంలో తేల్చి చెప్పారు. లేదంటే పవన్‌ని సీఎం అభ్యర్థిగా టీడీపీ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. జనసేన శ్రేణులను టీడీపీ వాడుకుని వదిలేసే రకమని సభలో కొందరు బిగ్గరగా అరిచినట్లు తెలిసింది. అయితే, సమావేశంలో పాల్గొన్న ముఖ్య నాయకులు దీనిపై స్పందించకుండా మౌనం వహించినట్లు సమాచారం. దీంతో చేసేదిలేక మరోసారి క్షేత్రస్థాయిలో అందరితో కలిసి చర్చిద్దామని, అందరూ సంయమనం పాటించాలని ప్రాథేయపడినట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. ఇక వీరిని శాంతింపజేసేందుకు నాగబాబు నానా తంటాలు పడ్డారని తెలిసింది.

క్లుప్తంగా...

బిహార్‌లో పోలీసు స్టేషన్‌లో దొంగతనం

చోరీకి గురైన మద్యం సీసాలు

పట్నా: దొంగలు ఏకంగా పోలీసు స్టేషన్‌ను టార్గెట్ చేశారు. రాత్రిపూట లోపలికి ప్రవేశించి, మద్యం సీసాలు ఎత్తుకెళ్లారు. బిహార్ రాష్ట్రంలోని ముజఫర్ నగర్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. బిహార్‌లో మద్యంపై నిషేధం అమల్లో ఉంది. అక్రమ రవాణా జరుగుతున్న మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకొని ఈ స్టేషన్‌లోని స్టోర్‌రూమ్‌లో భద్రపర్చారు. శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. చిమ్మచీకట్లో దొంగలు చాకచక్యంగా గోడదూకి లోపలికి అడుగుపెట్టారు. స్టోర్ రూమ్‌లో ఐదు పెట్టెలు, ఒక సంచిలో ఉన్న మద్యం బాటిళ్లను చోరీ చేశారు. విచిత్రం ఏమిటంటే ఈ సంఘటన జరుగుతున్నప్పుడు పోలీసు సిబ్బంది స్టేషన్‌లోనే ఉన్నారు. అసలు విషయం మరుసటి రోజు బయటపడింది. దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. పోలీసుల నిర్లక్ష్యంపై సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి.

80 శాతం సైబర్ నేరాలు 10 జిల్లాల నుంచే..



నోయిడా: దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు పెచ్చరిల్లుతున్నాయి. దేశంలో ఇలాంటి నేరాల్లో 80 శాతం నేరాలు కేవలం 10 జిల్లాల నుంచే జరుగుతున్నట్లు ఐఐటీ–కాన్పూర్‌కు చెందిన ఫ్యూచర్ క్రైమ్ రీసెర్చ్ ఫౌండేషన్(ఎఫ్‌సీఆర్‌ఎఫ్) అనే స్టార్టప్ కంపెనీ అధ్యయనంలో వెల్లడయ్యింది. రాజస్తాన్‌లోని భరత్‌పూర్, ఉత్తర ప్రదేశ్‌లోని మధుర, జార్ఖండ్‌లోని జామ్‌తారా, హరియాణాలోని నూహ్ జిల్లాల్లో సైబర్ నేరగాళ్లు అధికంగా తిష్ట వేశారని అధ్యయనం తెలియజేసింది. ప్రధానంగా భరత్‌పూర్, మధుర జిల్లాలు కేటుగాళ్లకు హాట్‌స్పాట్లుగా మారాయని పేర్కొంది. భరత్‌పూర్ నుంచి 18 శాతం, మధుర నుంచి 12 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నట్లు వెల్లడించింది. వీటితోపాటు దేవగఢ్, గురుగ్రామ్, అల్వార్, బొకారో, కర్మాటాండ్, గిరిదీ జిల్లాల నుంచి సైబర్ నేరగాళ్లు పంజా విసురుతున్నట్లు అధ్యయనంలో తేలింది. ఇవన్నీ ప్రధాన నగరాలకు సమీపంలో ఉన్నాయని, ఆయా జిల్లాల్లో సైబర్ సెక్యూరిటీ మౌలిక సదుపాయాలు పెద్దగా లేవని ఎఫ్‌సీఆర్‌ఎఫ్ వ్యవస్థాపకుడు హర్షవర్ధన్ సింగ్ చెప్పారు.

2023 హాటెస్ట్ వేసవి

కనీ వినీ ఎరుగని వడ గాడ్పులు ● గ్లోబల్ వార్మింగ్, ఉద్గారాలే కారణం

పులి మీద పుట్రలా ఎల్ నినో ● మేలుకోకుంటే వచ్చే వేసవి మరింత భయానకమే!

2023లో ఎండలు అక్షరాలా మండిపోయాయి. ఎంతగా అంటే, మానవ చరిత్రలో రికార్డయిన అత్యంత హెచ్చు ఉష్ణోగ్రతలు ఈ ఎండాకాలంలోనే నమోదయ్యాయి. ఈ ఏడాదే ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రికార్డులు బద్దలయ్యేంతటి వడ గాడ్పులు, వాటి అనంతర పరిణామాలు ఇందుకు మరింతగా దోహదం చేశాయి. కొన్ని దశాబ్దాలుగా భూగోళం అంతటా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగిపోతున్న పరిణామానికి ఇది ప్రమాదకరమైన కొనసాగింపేనని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

2023 వేసవి 1880లో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వివరాలు నమోదు చేయడం మొదలు పెట్టిన నాటినుంచి అత్యంత వేడిమితో కూడినదిగా రికార్డు సృష్టించింది. ఈ ఆందోళనకర గణాంకాలను న్యూయార్క్‌లోని నాసాకు చెందిన గొడార్డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ (జీఐఎస్‌ఎస్) వెల్లడించింది. 'ఇప్పటికైనా మేలుకుని గ్లోబల్ వార్మింగ్‌కు, ముఖ్యంగా విచ్చలవిడిగా సాగిస్తున్న పర్యావరణ విధ్వంసానికి అడ్డుకట్ట వేయడం ప్రపంచ దేశాల ముందున్న తక్షణ కర్తవ్యం' అని పర్యావరణ ప్రియులు, శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

పులి మీద పుట్రలా...

ఈ వేసవిలో ఎండలు గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టడం వడ గాడ్పుల పాత్ర చాలా ఎక్కువే. ఈ ఏడాది ప్రపంచంలో చాలా ప్రాంతాలను అవి తీవ్రంగా వణికించాయి...

- ఇటు అమెరికా నుంచి అటు జపాన్ దాకా, యూరప్ నుంచి దక్షిణ అమెరికా ఖండం దాకా కానీ వినీ ఎరగని స్థాయిలో వేడి గాలులు అతలాకుతలం చేసి వదిలాయి.
- ఇటలీ, గ్రీస్ తో పాటు పలు మధ్య యూరప్ దేశాల్లో విపరీతమైన వర్షపాతానికి కూడా ఈ గాలులు కారణమయ్యాయి.
- ఈ వడ గాడ్పుల దుష్పరిణామాలను ఏదో ఒక రూపంలో ప్రపంచమంతా చవిచూసింది.

ఇవీ రికార్డులు...

ఈ ఏడాది ఎండలు అన్ని రికార్డులనూ బద్దలు కొట్టి పర్యావరణ ప్రియుల ఆందోళనలను మరింతగా పెంచాయి.



ముందుంది మరింత ముప్పు...

- వాతావరణ మార్పుల పుణ్యమా అని వడ గాడ్పులూ ఏటికేడాది విజృంభిస్తున్నాయి.
- ఎల్ నినో తాలూకు అతి దారుణ దుష్పరిణామాలు 2024 ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో చవిచూడనున్నామని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు.
- వీటివల్ల వాయవ్య అమెరికా జల ప్రళయాలను చవిచూస్తుంది.
- పసిఫిక్ కు దక్షిణాన ఉన్న దేశాలు తీవ్ర కరువు బారిన పడతాయి.

- ముఖ్యంగా జూన్, జూలై, ఆగస్ట్ ఉమ్మడి ఉష్ణోగ్రతలు నాసా రికార్డుల్లోని గత అన్ని గణాంకాల కంటే 0.23 డిగ్రీ సెంటిగ్రేడ్ ఎక్కువగా నమోదయ్యాయి.
- అదే 1951–1980 మధ్య అన్నీ వేసవి కా సగటు ఉష్ణోగ్రత కంటే ఏకంగా 1.2 డిగ్రీ సెంటిగ్రేడ్ ఎక్కువగా తేలాయి!

మేలుకోకుంటే అంతే...

గ్రీన్ హౌస్, కర్బన ఉద్గారాలు ఉష్ణోగ్రతల్లో విపరీతమైన పెరుగుదలకు ప్రధాన కారణమని నాసా జెట్ ప్రొపల్షన్ లేబోరేటరీలో క్లైమేట్ సైంటిస్ట్, ఓషనోగ్రఫర్ జోష్ విల్లిస్ అంటున్నారు. ' కొన్నేళ్లుగా భూగోళం స్థిరంగా వేడెక్కుతూ వస్తోంది. ప్రధానంగా మనిషి నిర్వాకమే ఈ వాతావరణ అవ్యవస్థకు దారి తీస్తోంది. సాధారణంగా కూడా ఎల్ నినో ఏర్పడ్డప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడం రివాజు' అని ఆయన అన్నారు.

'ఈ రికార్డు స్థాయి ఉష్ణోగ్రతల దుష్ప్రభావం మున్ముందు కూడా ప్రపంచం మొత్తం మీదా చెప్పలేనంతగా ఉండనుంది'

- బిల్ నెల్సన్, నాసా అడ్మినిస్ట్రేటర్

సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో అత్యంత హెచ్చుదల నమోదవడమే ఈసారి కనీ వినీ ఎరుగని ఎండలకు ప్రధాన కారణం.

- జోష్ విల్లిస్, క్లైమేట్ సైంటిస్ట్, ఓషనోగ్రఫర్, నాసా జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ

ఎలా నమోదు చేస్తారు?

నాసా ఉష్ణోగ్రతల రికార్డు పద్ధతిని జిస్ టెంప్ అని పిలుస్తారు.

- ➤ దీనిలో భాగంగా భూ ఉపరితల ఉష్ణోగ్రతలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న వేల వాతావరణ కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు సేకరిస్తారు.
- ➤ నౌకలు తదితర మార్గాల ద్వారా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను కూడా సేకరిస్తారు.
- ➤ 1951–1980 మధ్య కాలాన్ని సూచికగా తీసుకుని, ఆ 30 ఏళ్ల సగటుతో పోలిస్తే ఏటా ఉష్ణోగ్రతల తీరుతెన్నులు ఎలా ఉన్నదీ లెక్కిస్తారు. మరీ విపరీతమైన మార్పులుంటే తక్షణం అన్ని దేశాలనూ అప్రమత్తం చేస్తారు.

చైనా నిండా ఖాళీ ఇండ్లే!

- వాటి సంఖ్య 100 కోట్ల పై చిలుకేనట
- పుట్టగొడుగుల్లా అపార్ట్‌మెంట్లు
- నిర్మాణ దశలో ఉన్నవారికి లెక్కే లేదు



రియల్టీ సంక్షోభంలో చైనా

న్యూఢిల్లీ: చైనా తీవ్ర రియల్టీ సంక్షోభంలో నానాటికీ పీకల్లోతున కూరుకుపోతోందా? దేశవ్యాప్తంగా ఇప్పటికే జనాభాకు మించి గృహాలున్నాయా? అవించాలవని ఇంకా ఎటు చూస్తే అటు భారీ సంఖ్యలో గృహ నిర్మాణ ప్రాజెక్టులే కనిపిస్తున్నాయా? అవుననే అంటున్నారు చైనా ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగి ఒకరు! తన ఆర్థిక వ్యవస్థ కళకళలాడుతోందని చైనా ప్రభుత్వం బయటికి ఎన్ని మాటలు చెబుతున్నా, రియల్టీ సంక్షోభం నానాటికీ ఆందోళన కలిగించేంతగా విస్తరిస్తోందని చెబుతున్నారు! చైనాలో నివాస గృహాల సంఖ్య కనీసం 100 కోట్లు దాటి ఉంటుందని భావిస్తున్నారు. అవి కనీసం 300 కోట్ల మందికి సరిపోతాయట! దేశ స్టాటిస్టిక్స్ బ్యూరో మాజీ డెప్యూటీ హెడ్ హే కేంగ్ స్వయంగా చెప్పిన వివరాలివి. 'చైనాలో ఖాళీగా ఉన్న ఇళ్ల సంఖ్యపై ఒక్కో నిపుణుడు ఒక్కో మాట చెబుతున్నారు. కానీ, ఎవరి నమ్మినా, నమ్మకపోయినా ఒకటి మాత్రం నిజం. ఇప్పటికే దేశవ్యాప్తంగా నిర్మాణం పూర్తయి అందుబాటులో ఉన్న ఖాళీ ఇండ్లు కనీసం 300 కోట్ల మందికి సరిపోతాయి' అని హేంగ్‌ను ఉటంకిస్తూ 'రాయిటర్స్' వార్తా సంస్థ పేర్కొంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

రియల్టీ సంస్థల దివాలా బాట

చైనాలో 2021 నుంచీ రియల్టీ రంగం సంక్షోభ బాట పట్టింది. క్రమంగా ఒకటి తర్వాత ఒకటిగా దిగ్గజ సంస్థలన్నీ దివాలా బాట పడుతుండడం సమస్య తీవ్రతకు అద్దం పడుతుంది. చైనాలో నెలకొన్న ఈ రియల్టీ సంక్షోభానికి దేశమంతటా ఎక్కడ చూస్తే అక్కడ పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన అపార్ట్ మెంట్లే ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి...

- ఇవి చాలవన్నట్టు దేశం మొత్తంమీద ఇంకా అసంఖ్యాకమైన అపార్ట్ మెంట్లు నిర్మాణంలో ఉన్నాయి.
- అయితే కొనుగోలు చేసేవాళ్లు లేక నిర్మాణ సంస్థలు కొన్నాళ్లుగా అల్లాడుతున్నాయి.
- రుణ భారానికి తాళలేక 2021లో చైనా రియల్టీ దిగ్గజం ఎవర్ గ్రాండ్ గ్రూప్ నిలువునా దివాలా తీసింది.
- అంతకంటే పెద్ద నిర్మాణ సంస్థ కంట్రీ గార్డెన్ వంటివి దివాలా అంచులో కొట్టుమిట్టాడుతున్నాయి!
- గత ఆగస్టు నాటికే చైనాలో ఏకంగా 700 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణానికి సమానమైన ఇళ్లు అమ్ముడుకాకుండా ఖాళీగా మిగిలిపోయినట్టు ఆ దేశ జాతీయ గణాంక బ్యూరో తాజా అధికారిక గణాంకాలే చెబుతున్నాయి.
- ఇది దాదాపు ఒక్కోటీ 90 చదరపు మీటర్ల పరిమాణంలో ఉండే 72 లక్షల ఇళ్లకు సమానమని రాయిటర్స్ అంచనా వేసింది.
- ఇవిగాక ఇప్పటికే అమ్ముడుపోయి నిర్మాణ సంస్థలు ఎదుర్కొంటున్న నగదు ప్రవాహ సమస్యల కారణంగా ఇంకా పూర్తికాని ఇండ్ల ప్రాజెక్టులు దేశమంతటా అసంఖ్యాకంగా ఉన్నాయి.

అవి శ్మశాన నగరాలు!

- అత్యధిక ఇళ్లను ప్రధానంగా మార్కెట్ స్పెక్యులేటర్లు 2016 సమయంలో మార్కెట్లు కళకళలాడుతున్న సమయంలో ఎగబడి కొన్నారు. ఇప్పుడు వాళ్ళూ, రియల్టీ సంస్థల యజమానులూ ఏం చేయాలో తెలియక తల పట్టుకుంటున్నారు!
- ఆర్థిక సంక్షోభం బారి నుంచి దేశాన్ని ఎలాగోలా బయట పడేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్న చైనా కమ్యునిస్టు ప్రభుత్వానికి ఈ రియల్టీ సంక్షోభం పెను సవాలుగా పరిణమించింది.
- చైనా జీడీపీలో దాదాపు 30 శాతం వాటా రియల్టీ రంగానిదే.
- ఒకప్పుడు దేశానికి వెన్నెముకగా ఉన్న రియల్టీ రంగమే ఇప్పుడు పెను భారంగా మారింది.
- 1970ల నుంచి గృహ, వాణిజ్య సముదాయాల నిర్మాణం ఊపందుకుంది.
- దాంతో ఒకప్పుడు 18 శాతమున్న పట్టణ జనాభా ఇప్పుడు ఏకంగా 60 శాతం దాటింది.
- ఆ సమయంలో సంపన్నులు విచ్చలవిడిగా ఇళ్లు, గృహ సముదాయాలనే కొని అట్టిపెట్టుకున్నారు. దాంతో ఇప్పుడు పట్టణాలకు పట్టణాలే ఖాళీగా ఉన్న పరిస్థితి! క్వింగ్ హుయి, జెంగ్ డాంగ్, చెన్ గాంగ్, బిన్ హయీ వంటివి శ్మశాన నగరాలుగా మారాయి!!



భారత్ వెలుపల అతిపెద్ద దేవాలయం

వచ్చే 8న అమెరికాలోని న్యూజెర్సీలో ప్రారంభం

రాబిన్స్‌విల్లె: భారత్ వెలుపల నిర్మితమైన ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ దేవాలయం అమెరికాలో అక్టోబర్ 8వ తేదీన ప్రారంభం కానుంది. న్యూజెర్సీ రాష్ట్రంలోని రాబిన్స్‌విల్లె పట్టణంలో బీఏపీఎస్ స్వామినారాయణ్ అక్షర్‌ధామ్‌గా పిలుచుకునే ఈ గుడి రూపుదిద్దుకుంది. అమెరికా వ్యాప్తంగా తరలివచ్చిన 12 వేల మంది కార్యకర్తలు ఈ ఆలయ నిర్మాణంలో పాలుపంచుకున్నారు. 183 ఎకరాల విస్తీర్ణంలో దీని నిర్మాణానికి 2011 నుంచి 2023 వరకు సుమారు 12 ఏళ్లు పట్టింది. సుమారు 10 వేల విగ్రహాలను ఇందులో వాడారు. కంబోడియాలోని 12వ శతాబ్దం నాటి అంగ్‌కోర్ వాట్ హిందూ ఆలయం తర్వాత బహుశా ఇదే అతిపెద్దదని అంటున్నారు. ఆలయాన్ని చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి హిందువులు తరలివస్తున్నారు.

అది ప్రపంచ వాణిజ్యానికి అడ్డా

'భారత్-మధ్యప్రాచ్యం- యూరప్' కారిడార్‌పై ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారత్–మధ్యప్రాచ్యం–యూరప్ ఆర్థిక నడవా(కారిడార్) రాబోయే కొన్ని శతాబ్దాలపాటు ప్రపంచ వాణిజ్యానికి ప్రధాన ఆధారం కాబోతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ కారిడార్ ఆలోచన భారత్ గడ్డపైనే పుట్టిందన్న విషయాన్ని చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని అన్నారు. ఆదివారం 105వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని దేశ ప్రజలను ఉద్దేశించి రేడియోలో ప్రసంగించారు. ప్రాచీన కాలంలో వాణిజ్య మార్గంగా ఉపయోగపడిన సిల్క్ రూట్ గురించి ప్రస్తావించారు. ఈ మార్గం ద్వారా భారత్ విదేశాలతో వాణిజ్య వ్యాపార కార్యకలాపాలు నిర్వహించిందని అన్నారు. ఇటీవల జీ20 శిఖరాగ్ర సదస్సులో ఇండియా–మిడిల్ ఈస్ట్–యూరప్ ఎకనామిక్ కారిడార్‌ను భారత్ ప్రతిపాదించిందని గుర్తుచేశారు. ఈ కారిడార్‌తో శతాబ్దాల పాటు భారీ స్థాయిలో ప్రపంచ వాణిజ్యం జరుగుతుందని వెల్లడించారు. ఢిల్లీలో జీ20 సదస్సు జరిగిన 'భారత్ మండపం' ఒక సెలబ్రిటీగా మారింది. జీ20లో భాగంగా ఈ నెల 26న ఢిల్లీలో 'జీ20 యూనివర్సిటీ కనెక్ట్ ప్రోగ్రాం' నిర్వహించబోతున్నామన్నారు. అక్టోబర్ 1న ఉదయం 10 గంటలకు భారీ స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టబోతున్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. దేశీయంగా తయారైన ఖాదీ, ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రజలను కోరుతున్నానన్నారు.

హైదరాబాద్ బాలిక ఆకర్షణ కృషి ప్రశంసనీయం

హైదరాబాద్‌కు చెందిన 11 ఏళ్ల ఆకర్షణ సతీష్ గురించి మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆకర్షణ సతీష్ ఏడో తరగతి చదువుతోందని, నిరుపేద విద్యార్థుల కోసం ఏడు గ్రంథాలయాలు నడుపుతోందని ప్రశంసించారు. ఇరుగుపొరుగు, బంధువులు, స్నేహితుల నుంచి పుస్తకాలు సేకరించి, లైబ్రరీల్లో అందుబాటులో ఉంచుతోందని చెప్పారు. ఏడు లైబ్రరీల్లో దాదాపు 6,000 పుస్తకాలు అంబాటులో ఉన్నాయని తెలిపారు. చిన్నారుల భవిష్యత్తు కోసం ఆకర్షణ సతీష్ కొనసాగిస్తున్న కృషి అందరికీ స్ఫూర్తినిస్తోందని ప్రధానమంత్రి కొనియాడారు.

9 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రారంభం

న్యూఢిల్లీ/ఉదయ్‌పూర్: 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలకు సరితూగేలా మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రక్రియ శరవేగంగా సాగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. ఆదివారం 9 వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆయన ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. 9 రైల్వే స్టేషన్లలో వందేభారత్ రైళ్ల ప్రారంభోత్సవంలో గవర్నర్లు, సీఎంలు, కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్–బెంగళూరు, విజయవాడ–చెన్నై, ఉదయ్‌పూర్–జైపూర్, తిరునల్వేలి– మధురై–చెన్నై, పట్నా–హౌరా, కాసర్‌గోడ్–తిరువనంతపురం, రూర్కేలా– భువనేశ్వర్–పూరీ, రాంచీ–హౌరా, జామ్‌నగర్–అహ్మదాబాద్ మార్గాల్లో ఇవి ప్రయాణించనున్నాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. వందేభారత్ రైళ్లు దేశవ్యాప్తంగా ప్రతి ప్రాంతాన్నీ అనుసంధానించే రోజు ఎంతోదూరంలో లేదని చెప్పారు.

ఖలిస్తాన్ వాదులూ జాగ్రత్త!

అమెరికాలోని సానుభూతిపరులకు ఎఫ్‌బీఐ హెచ్చరిక

వాషింగ్టన్/న్యూఢిల్లీ: ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యతో భారత్–కెనడాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన తరుణంలో అమెరికా కీలక వ్యాఖ్యలు చేసింది. తమ దేశంలో ఉన్న ఖలిస్తానీల ప్రాణాలకు ముప్పు ఉందంటూ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ) హెచ్చరికలు చేసింది. అమెరికన్ సిఖ్ కాకస్ కమిటీ కోఆర్డినేటర్‌గా ఉన్న ప్రీత్‌పాల్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ..తనతోపాటు మరో ఇద్దరు అమెరికన్ సిక్కులను ఎఫ్‌బీఐ అధికారులు జూన్‌లో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారని చెప్పారు.

కెనడాకు ఉప్పందించింది అమెరికానే

నిజ్జర్ హత్య అనంతరం ఆ నిఘా సమాచారాన్ని అగ్రరాజ్యం అమెరికానే ఆ దేశానికి అందజేసిందని న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. సదరు సమాచారాన్ని ఆధారంగా చేసుకునే కెనడా భారత్‌పై నేరుగా ఆరోపణలకు దిగినట్లు తెలుస్తోందని ఆ కథనం పేర్కొంది. తమ దేశంలోని భారత దౌత్యాధికారుల సంభాషణలను దొంగచాటుగా వినడం ద్వారా కెనడా నిఘా విభాగాలు ఇదే విషయాన్ని ధ్రువీకరించుకున్నట్లు కూడా భావిస్తున్నారు.

ట్రూడోకు వ్యతిరేకంగా ఆందోళన

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు వ్యతిరేకంగా ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో యునైటెడ్ హిందూ ఫ్రంట్ నిరసన తెలిపింది. భారత వ్యతిరేక ఖలిస్తానీలకు కెనడా ప్రధాని మద్దతు, రక్షణ కల్పించడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. వారిపై అంతగా ప్రేముంటే కెనడాలోనే ప్రత్యేక ఖలిస్తాన్‌ను ట్రూడో ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొంది.

ఆ మహిళలు.. పేరుకే సర్పంచులు


రాంచీ: మహిళా సాధికారత సాధనకు ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో చూస్తే మాత్రం మహిళల భాగస్వామ్యం అంతంతమాత్రంగానే ఉంటోంది. జార్ఖండ్‌లో చేపట్టిన సర్వేలో దిగ్భ్రాంతికర వాస్తవాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో మహిళలకు సగం సీట్లు కేటాయించారు. ధన్‌బాద్ జిల్లాలో 95 మంది మహిళా సర్పంచులున్నారు. తమ ఫోన్‌కాల్‌కు వీరిలో 11 మంది సర్పంచులు మాత్రమే స్వయంగా స్పందించినట్లు సర్వే నిర్వాహకులు తెలిపారు. మిగతా 84 మందిలో సర్పంచుల భర్తలో, మరుదులో, లేక ఆమె కుటుంబంలోని ముఖ్యులో ఆ ఫోన్ కాల్‌లకు స్పందించారు. అధికారులు ఏర్పాటు చేసిన సమావేశాలకు సైతం సర్పంచులకు బదులుగా వారి భర్తలు, ఇతర కుటుంబసభ్యులే హాజరవుతున్నట్లు కూడా ఈ సర్వేలో తేలింది. బ్లాక్, సబ్ డివిజన్, జిల్లా స్థాయి సర్పంచుల సమావేశాలకు హాజరై వీరు తమను ఫలానా గ్రామ సర్పంచి భర్త అనో లేక ఇతర కుటుంబ సభ్యులమనో పరిచయం చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఇకపై అధికారులు ఏర్పాటు చేసే సమావేశాలకు మహిళా సర్పంచులు మాత్రమే హాజరు కావాలని స్పష్టం చేసింది. వారికి బదులుగా కుటుంబసభ్యులను, ఇతరులను లోపలికి రానివ్వద్దంటూ అధికారులను ఆదేశించాల్సి వచ్చింది!

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో గెలుపు పక్కా

- తెలంగాణలో గెలిచే అవకాశం
- ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుపై రాహుల్ గాంధీ ధీమా

న్యూఢిల్లీ: రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలను సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ధీమా వ్యక్తంచేశారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కచ్చితంగా విజయం సాధిస్తుందన్న రాహుల్.. తెలంగాణలో నెగ్గే అవకాశాలున్నాయని చెప్పారు. ఇక రాజస్తాన్‌లో రెండు పార్టీల మధ్య హోరాహోరీ పోటీ ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీయే విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిదిన్ మీడియా నెట్‌వర్క్ ఆఫ్ అసోమ్ సంస్థ ఆదివారం ఏర్పాటు చేసిన సదస్సుకు హాజరైన రాహుల్ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ ఐక్య పోరాటం చేస్తాయని, ఆ ఎన్నికల్లో బీజేపీని నివ్వెరపరిచే ఫలితాలు వస్తాయని అన్నారు. ఆయన ఇంకా ఏం అన్నారంటే..

'ప్రజా సమస్యల నుంచి పక్కదారి పట్టించడానికే బీజేపీ ఒకే దేశం ఒకే ఎన్నికలు అన్న పాట పాడుతోంది. కులగణన వంటి అంశాలను పక్కదారి పట్టించడానికి బీజేపీ ఎన్నో వ్యూహాలు రచిస్తోంది. బీజేపీ ఎంపీ రమేష్ బిధూరీ మరో ఎంపీ దానిష్‌పై చేసిన అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ప్రజా అంశాలను పక్కదారి పట్టించడానికే. ఆదాయ అసమానతలు, కొందరి చేతుల్లోనే సంపద పోగుపడిపోవడం, నిరుద్యోగం తీవ్ర రూపం దాల్చడం, వెనుకబడిన కులాలు, ఓబీసీలు, ఆదివాసీల పట్ల చిన్నచూపు, అధిక ధరలు వంటి సమస్యలు దేశాన్ని బాధిస్తున్నాయి. ఈ అంశాలపై దృష్టి సారించలేని బీజేపీ వాటిని పక్కదారి పట్టించే మార్గంలో నడుస్తోంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల విషయానికొస్తే తెలంగాణలో కాంగ్రెస్‌కు గెలిచే అవకాశాలున్నాయి. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కచ్చితంగా గెలుస్తాం. రాజస్తాన్‌లో గట్టి పోటీ ఉంది. కానీ కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుంది. ఇది మా పార్టీ అంచనా కాదు. బీజేపీ చేసుకున్న అంతర్గత సర్వేల్లోనూ ఇదే విషయం తేలింది' అని రాహుల్ గాంధీ వివరించారు.



సదస్సులో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

జిమ్ అంటేనే ఇష్టం

విలేకరులు అడిగిన కొన్ని సరదా ప్రశ్నలకూ రాహుల్ హుషారుగా బదులిచ్చారు. తీరిక సమయాల్లో నెట్‌ఫ్లిక్స్ చూస్తారా, జిమ్ చేస్తారా అని ప్రశ్నిస్తే జిమ్ చేయడమంటేనే తనకు ఇష్టమని చెప్పారు. గెడ్డంతో ఉండడం ఇష్టమా, లేకపోతే ఇష్టమా అని అడిగితే కాంగ్రెస్ పార్టీలో ఉన్నాను కాబట్టి వేసుకునే వీటిని పట్టించుకోవడం లేదని, ఎలా ఉన్నా ఫర్వాలేదని నవ్వారు. రాజకీయ నేత కాకపోయి ఉంటే ఏమై ఉండేవారు అని ప్రశ్నించగా 'ఏదైనా అయి ఉండేవాడిని. నా మేనల్లుడు, వాడి స్నేహితుల్ని కలిసినప్పుడు టీచర్‌గా మారతా. వంటగదిలోకి అడుగు పెడితే చెఫ్ అయిపోతా. ఇలా నేను బహుముఖ పాత్రలు పోషిస్తుంటా' అని రాహుల్ చెప్పారు. 'క్రికెట్ కంటే ఫుట్‌బాల్ అంటే ఇష్టం. క్రీడాకారుడు మెస్సి రొనాల్డో అంటేఇష్టమన్నారు. గాడ్‌ఫాదర్, డార్క్‌నైట్ వీటిల్లో ఏ సినిమా అంటే ఇష్టం అని అడగ్గా.. రెండూ నాకు ఇష్టమే' అని చెప్పారు. ఇండియా, భారత్‌లో దేశానికి ఏ పేరు ఉండాలని ప్రశ్నించగా ఇండియా అంటేనే భారత్ అని రాహుల్ చెప్పారు.

నాసా తొలి ఆస్టరాయిడ్ శాంపిల్ వచ్చింది

- అమెరికాలో సైనిక స్థావరంలో ల్యాండింగ్
- రేపటి నుంచి పరిశోధనలు

వాషింగ్టన్: అల్లంత దూరాన అంతరిక్షంలో సేకరించిన ఆస్టరాయిడ్ తాలూకు తొలి శాంపిల్‌ను అమెరికా భూమి మీదికి తీసుకొచ్చింది. ఓసిరిస్ ఎక్స్ అంతరిక్ష నౌక భూమికి దాదాపు లక్ష కిలోమీటర్ల దూరం నుంచి విసిరేసిన శాంపిల్ క్యాప్సూల్ 4 గంటల ప్రయాణం తర్వాత ఆదివారం అమెరికాలోని ఉటా ఎడారిలో సైనిక భూభాగంలో దిగింది. నమూనాను సోమవారం హ్యూస్టన్ లోని నాసా జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలిస్తారు. అనంతరం వాటిమీద పరీక్షలు, పరిశోధనలు చేస్తారు. అక్కడ గతంలో తెచ్చిన చంద్ర శిలలున్నాయి. వాటిని 50 ఏళ్ల క్రితం అపోలో మిషన్‌లో భాగంగా చంద్రుని మీదికి వెళ్ళిన అంతరిక్ష యాత్రికులు తీసుకొచ్చారు. తాజా క్యాప్సూల్‌లో కనీసం పావు కేజీ పరిమాణంలో ఆస్టరాయిడ్ తాలూకు శకలాలు ఉండి ఉంటాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. భూమి ఎలా రూపొందిందో, దానిపై జీవం ఎలా వికసించిందో అర్థం చేసుకోవటానికి అవి మరింతగా ఉపకరిస్తాయని భావిస్తున్నారు. ఇప్పటిదాకా జపాన్ ఒక్కటే ఆస్టరాయిడ్ శకలాలను భూమికి తెచ్చింది.

ఏడేళ్ల ప్రయత్నం...

ఆస్టరాయిడ్లపై పరిశోధన నిమిత్తం నాసా 2016లో 100 కోట్ల డాలర్ల ఖర్చుతో ఓసిరిస్ ఎక్స్ అంతరిక్ష నౌకను ప్రయోగించింది. రెండేళ్ల అనంతరం అది బెన్నూగా పిలిచే ఆస్టరాయిడ్ ఉపరితలంపై దిగింది. 2020లో దాని మీదినుంచి స్వల్ప పరిమాణంలో శకలాలను ఒక క్యాప్సూల్ లోకి సేకరించి వెనుదిరిగింది. అప్పటికే అది కోట్లాది కిలోమీటర్ల ప్రయాణం పూర్తి చేసుకుంది. దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవున్న బెన్నూ ఆస్టరాయిడ్ ప్రస్తుతం భూమికి 8.1 కోట్ల కిలోమీటర్ల దూరంలో సూర్యుని చుట్టూ తిరుగుతోంది. అది 2182 సంవత్సరంలో భూమికి అతి సమీపంగా వస్తుందని, అప్పుడది బహుశా మనను ఢీకొనే ప్రమాదమూ లేకపోలేదని అంచనా. ఓసిరిస్ ఎక్స్ ప్రస్తుతం అపోఫిస్‌గా పిలిచే మరో ఆస్టరాయిడ్ వైపు పయనిస్తోంది.



తిరిగొచ్చిన క్యాప్సూల్ వద్ద నాసా సేఫ్టీ బృందం



ఖరీదైన కృత్రిమ వజ్రాలను ఎవరో రోడ్డుపై పడేయడంతో వాటి కోసం కళ్లను భూతద్దాల్లా చేసుకుని వెతుకుతున్న స్థానికులు. ఆదివారం సూరత్‌లోని మినీ హీనాబజార్‌లో తీసిందీ ఫొటో.

సాక్షి
కరీంనగర్

సోమవారం ; 25 ; సెప్టెంబర్ ; 2023

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లో చేపడుతున్న విద్యుత్ పనుల్లో భాగంగా 11కేవీ ఐబీ ఫీడర్‌లో సోమవారం కరెంట్ సరఫరాకు అంతరాయం కగలనుంది. ఉదయం 9 గంటల 11 గంటల వరకు గీతాభవన్ ఏరియా, ముకరంపుర, 7 హిల్స్ ఏరియా, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ పేర్కొన్నారు.

సెల్ఫీ విత్ మట్టి గణేశ్



పర్యావరణాన్ని కాపాడేలా మట్టిగణేశుడిని ప్రతిష్ఠించారా? ప్రత్యేక ఆకృతుల్లో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ లేదా ఇళ్లలో మట్టి గణపతులను పూజిస్తున్నారా.. అయితే మీరు పర్యావరణహిత గణేశుడితో సెల్ఫీఫొటో తీసుకుని సెల్ నంబరు **94912 47184**కు వాట్సప్ చేయండి. మీరు పంపిన ఫొటోను 'సాక్షి' దిన పత్రికలో ప్రచురిస్తాం.

న్యూస్‌రీల్

ఈ- పంచాయతీ ఆపరేటర్ల సమ్మె నోటీసు



అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆపరేటర్లు

కరీంనగర్: ఉద్యోగ భద్రత కల్పించాలని, పే స్కేల్ ఇచ్చి జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పిస్తూ ఇతరత్రా డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఆదివారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీపీవో వీరబుచ్చయ్యకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఈ-పంచాయతీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ, పంచాయతీరాజ్ శాఖ టెక్నికల్ వ్యవస్థలో 13 ఏళ్లుగా 32 మంది జిల్లా ప్రాజెక్టు మేనేజర్లుగా, 1,619 మంది ఈ-పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. పంచాయతీలను మరింత శక్తివంతంగా తయారు చేయడమే కాకుండా పారదర్శకత, జవాబుదారీ తనాన్ని పెంపొందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వారం రోజుల్లో తమ సమస్యలు పరిష్కరించకుంటే జిల్లాస్థాయిలో పనిచేస్తున్న ఆపరేటర్లు సమష్టిగా సమ్మెకు దిగుతామని వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యం చాటిన ముస్లిం నాయకులు



అన్నదానం నిర్వహిస్తున్న ముస్లిం నాయకులు

హుజూరాబాద్: మత సామరస్యాన్ని చాటారు ముస్లిం నాయకులు. హుజూరాబాద్ పట్టణంలోని ప్రతాపవాడలో మహాత్మ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హుజూరాబాద్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున ఆదివారం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు కలిసిమెలిసి జీవించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ గఫార్, ఉపాధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ రహీం, మాజీ అధ్యక్షుడు మొహమ్మద్ యూసుఫ్‌ఖాన్, బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు మొహమ్మద్ ఇసాక్, లడ్డు కౌసర్, మొహమ్మద్ యాసిన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏకదంతా.. ఏళ్ల చరిత్ర

- నగరంలో ఒక్కో మండపానికి ఒక్కో చరిత్ర • 50ఏళ్లకు పైగా వినాయక కమిటీల నిర్వహణ • తరాలు మారుతున్నా తరగని వైభవం

విద్యానగర్(కరీంనగర్): విశిష్ట రూపుడు.. విఘ్నేశ్వరుడు.. ప్రథమ పూజ్యుడు.. నవరాత్రుల సందర్భంగా ఘనమైన పూజలందుకుంటున్నాడు. ఉదయం, సాయంత్రం మంగళహారతులు, నైవేద్యాలు స్వీకరిస్తూ భక్తుల విన్నపాలు ఆలకిస్తున్నాడు. కరీంనగర్ సిటీలో వందల సంఖ్యలో మండపాలు ఏర్పాటు చేయగా.. ఒక్కో మండపానిది ఒక్కో చరిత్ర. ఏళ్లకాలంగా వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్నవారు కొందరైతే.. తరాలు మారినా ఏకోదంతుడిని కొలుస్తూ ఆచారాన్ని కొనసాగిస్తున్న వారు మరికొందరు. నగరంలోని ఒకటో నంబరు పాతబజార్ వినాయకుడి నుంచి శాస్త్రీరోడ్డు, టవర్, సాయినగర్, బోయవాడ.. ఇలా వాడవాడకో చరిత్ర కలిగిన మండపాలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే..!!

ప్రకాశం గంజ్‌లో..



ప్రకాశంగంజ్ వినాయకుడి వద్ద భక్తులు

- నగరంలోని వ్యాపారప్రాంతమైన ప్రకాశంగంజ్‌లో 52ఏళ్లక్రితం రాచర్ల అంజయ్య, రాగి విజయ్, పాంపటి అంజయ్య, రాగి రాజేశం ఆధ్వర్యంలో గణేశ్ ఉత్సవాలు ప్రారంభించారు. తరువాత కాలంలో ఆ బాధ్యతలను రాగి రాములు, పాంపటి హనుమండ్లు తీసుకున్నారు. మూడోతరంగా ప్రస్తుతం పాంపటి శ్రీనివాస్, రాచర్ల రమేశ్, పెద్ది రమేశ్, గంప రమేశ్, గౌరిశెట్టి రాజు మిత్రబృందం విఘ్నేశ్వర నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు.

శాస్త్రీరోడ్



వినాయకుని వద్ద నిర్వాహకులు

- శాస్త్రీరోడ్డులో సిటీలోనే అతిపెద్ద విగ్రహం ఏర్పాటు చేయడం ఆనవాయితీ. గత 32ఏళ్లుగా ఇక్కడ వినాయకుడిని ఏర్పాటు చేస్తున్నారు. శాస్త్రీరోడ్, తిలక్‌రోడ్, ద్వారకనగర్, కుమ్మరివాడలకు చెందిన యూత్ నవరాత్రుల నిర్వహణలో భాగస్వాములు అవుతున్నారు. ఏటా ప్రత్యేక పూజలతోపాటు నిమజ్జన శోభాయాత్ర వైభవంగా నిర్వహిస్తారు. ప్రస్తుతం నవరాత్రుల నిర్వహణలో నగునూరి వేణు, బత్తిని సత్యం, తొడుపునూరి కరుణాకర్, తాళ్లపల్లి హరికుమార్ గౌడ్ తదితరులు భాగస్వాములుగా ఉన్నారు.



పాతబజార్‌లో..

- కరీంనగర్‌లోని పాతబజార్ చిన్నహనుమాన్‌స్వామి ఆలయ ప్రాంతంలో సిటీలోనే తొలిసారిగా 1950లో వినాయకుడిని ప్రతిష్ఠించారు. మంచాల బుచ్చయ్య ఇంట్లో అద్దెకుండే బ్యాంక్ ఉద్యోగి ఎంఆర్.పెంటయ్య ప్రోద్బలంతో కిష్టయ్య, పైడ ఓంకారం, శంకరయ్య ఆ ప్రాంత వ్యాపారుల ఆధ్వర్యంలో చవితి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. వైదిక పురోహితుడు మంగళంపల్లి మురాహరి శర్మ తొలిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం మంగళంపల్లి శ్రీనివాసశర్మ, ఆలయ పూజారి శ్రీధర్ శర్మ పూజాకార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు.

కుర్మవాడ, సాయినగర్, గౌరీశంకర్ కాంప్లెక్స్‌ల్లో..



సాయినగర్‌లో గణపతికి పూజలు చేస్తున్న భక్తులు

- జ్యోతినగర్ కుర్మవాడ జెండాగద్దె చౌరస్తా వద్ద 42ఏళ్ల క్రితం అప్పటి కుర్మసంఘం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రులు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గోకుల్ ఉత్సవ కమిటీ బాధ్యులు ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. సాయినగర్‌లో 1995లో అప్పటి యూత్ రాజమణి, రాజనందం, సబ్బని లక్ష్మీనారాయణ, జక్కం విఠల్, సురేందర్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు సాయినగర్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసి నవరాత్రోత్సవాలు ప్రారంభించారు. ప్రసుత్తం బొజ్జ రాజు, సురేందర్‌రెడ్డి, వి.శ్రీనివాస్, జి.రాంనారాయణచారి, శివలింగం, రాజు, చిమ్మని శ్రీనివాస్ బాధ్యతలు చూస్తున్నారు. అశోక్‌నగర్ పరిధిలోని గౌరీ శంకర్ కాంప్లెక్స్‌లో ప్రథమంగా భారతీయ విద్యా కేంద్రం వారు ఏర్పాటు చేయగా కొన్నేళ్ల విరామం తరువాత 2011లో ఎలుగూరి నవీన్‌కుమార్ ఉత్సవాలు ప్రారంభించారు.



కురుమవాడలో..



గౌరీ శంకర్ కాంప్లెక్‌లో భక్తుల భజన

బోయవాడచౌరస్తా

- నగరంలోని బోయవాడలో ప్రథమంగా 1971లో గంజి సుధాకర్, మాజీ ఎమ్మెల్యే కొడూరి సత్యనారాయణగౌడ్, మాజీ మేయర్ డి.శంకర్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రులు ప్రారంభమయ్యాయి. 1980 నుంచి ఇక్కడ భారీ వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్నారు. ప్రస్తుతం ఉప్పుల శంకర్, సందబోయిన రవి యాదవ్, దూళి మల్లేశం, దామ వెంకటేశ్, సీహెచ్.అనంతస్వామి, తుంగోని సుదర్శన్ ఆధ్వర్యంలో కమిటీ కొనసాగుతోంది.



విఘ్నేశ్వరుడి వద్ద భక్తులు

ఐక్యత కోసం



భక్తభావం పెంపొందించడంతో పాటు కాలనీవాసులు కలిసికట్టుగా ఉండాలనే ఉద్దేశంతో 1995లో సాయినగర్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటుచేసి వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించాం. అప్పటినుంచి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. కాలనీవాసులు అందరూ మండపం వద్ద పూజా, భజన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

– సబ్బని లక్ష్మీనారాయణ, సాయినగర్ వెల్ఫేర్ అసోసియేషన్

మేం అప్పుడు యువకులం



శాస్త్రీరోడ్డులో వినాయకుడి మండపం ఏర్పాటు చేసినప్పుడు మేమందరం యువకులం. నాకు మొదటి నుంచి భక్తి ఎక్కువ. సిటీలో అన్నిప్రాంతాల్లో వినాయకుడిని పెడుతున్నారు. మన వాడలోనూ పెట్టాలనే ఉద్దేశంతో అప్పటి కార్పొరేటర్ వావిలాల హన్మంతరెడ్డి సహకారంతో ఏర్పాటుచేసి కొనసాగిస్తున్నాం.

– తాళ్లపల్లి హరికుమార్‌గౌడ్, శాస్త్రీరోడ్, కరీంనగర్

మంచి జరుగుతుందని..



గౌరీశంకర్ కాంప్లెక్స్‌లో మొదట్లో భారతీయ విద్యాకేంద్రం వారు ఏర్పాటు చేశారు. ఆ స్కూల్ ఇక్కడి నుంచి షిఫ్ట్ చేయడంతో నేనే ముందుకొచ్చి కాంప్లెక్స్‌వాళ్లతో కలిసి నవరాత్రులు కొనసాగిస్తున్నాం. ఈ పదిరోజులు అందరూ ఒక చోట చేరుతారని, యూనిటీ పెరుగుతుందనే ఉద్దేశంతో ఉత్సవాలు చేస్తున్నాం.

– ఎలుగూరి నవీన్, గౌరీ శంకర్ కాంప్లెక్స్

వంశపారంపర్యంగా



పాతబజార్ చిన్నహనుమాన్ స్వామి ఆలయం వద్ద 1950లో వినాయకమండపం ఏర్పాటు చేశారు. మా తాత మురాహరి శర్మ తొలిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత మా నాన్న, ప్రస్తుతం నేను పూజా కార్యక్రమాలు చూస్తున్నాం.

– మంగళపల్లి శ్రీనివాసశర్మ, నగర వైదిక పురోహితుడు, పాతబజార్

ప్రజల్లో నమ్మకం



సిటీలోని గంజ్‌లో మొదటిసారిగా 1972లో 16మంది కమిటీగా ఏర్పడి మండపం ఏర్పాటు చేశాం. ఇక్కడి వినాయకుడిపై ప్రజలకు నమ్మకం ఉంది. ఏటా వేలాది మంది వచ్చి గణపతిని దర్శించుకుంటారు. గంజ్ వినాయక మండపం అలంకరణలో ప్రత్యేకత ఉంటుంది.

– రాగి రాములు, గంజ్, కరీంనగర్

బీజేపీ, కాంగ్రెస్ పాలన మనకొద్దు

- మంత్రి గంగుల కమలాకర్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఢిల్లీ పాలకులు మనకొద్దని, కేసీఆర్ చేతిలోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్, చెర్లభూత్కుర్‌కు చెందిన యువకులు పెద్దఎత్తున మంత్రి సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమైక్య పాలనలో పక్కనే గోదావరి పారినా మన పొలాల్లోకి చుక్కా నీరు రాని పరిస్థితి ఉండేదని, రైతులు వ్యవసాయం చేయాలంటే ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. సాగునీటి కోసం గ్రామాల మధ్య యుద్ధాలు జరిగిన రోజులు గుర్తున్నాయని, ఎరువుల కోసం లైన్‌లో చెప్పులు పెట్టి రోజుల తరబడి ఎదురుచూసి చివరకు పోలీసుల చేతుల్లో లాఠీ దెబ్బలు తిన్న రోజులు ఉండేవన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాక కాళేశ్వరం జలాలతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. మనం పడిన కష్టం భవిష్యత్ తరాలు పడొద్దంటే అభివృద్ధి కొనసాగాలని, కేసీఆర్, బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, రూరల్ అధ్యక్షుడు పెండ్యాల శ్యామ్‌సుందర్‌రెడ్డి, కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, బండారి వేణు పాల్గొన్నారు.

అభివృద్ధిలో కరీంనగర్‌దే మొదటిస్థానం

ఐదు దశాబ్దాలుగా తెలంగాణను వల్లకాడు చేసిన కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మధు గార్డెన్‌లో బీఆర్‌ఎస్ కరీంనగర్ యువజన విభాగం ఇన్‌చార్జి నేతికుంట హరీశ్ ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన 300 మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 50 ఏళ్లలో జరగని అభివృద్ధిని పదేళ్లలో చేసి, దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రాన్ని నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. పదేళ్ల క్రితం కరీంనగర్ ఎలా ఉండేదో ఇప్పుడో ఎలా ఉందో ఒక్కసారి ఊహించుకోవాలని సూచించారు. వేల కోట్ల నిధులతో నగరాన్ని అభివృద్ధి చేసి రూపురేఖలు మార్చానని గుర్తు చేశారు. నగర మేయర్ వై.సునీల్‌రావు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతుందని, మరోసారి బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కొత్తపల్లి, కరీంనగర్‌రూరల్ మండలాల అధ్యక్షులు కాసారపు శ్రీనివాస్, శ్యాంసుందర్, యాద య్య, ఐలేందర్, బోనాల శ్రీకాంత్, పిట్టల శ్రీనివా స్, గందె మహేశ్, నందెల్లి మహిపాల్, కులదీప్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని సన్నిధిలో మంత్రి, ఎంపీ పూజలు



నిర్వాహకులతో మంత్రి గంగుల



ఎంపీ సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్‌కల్చరల్: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా కరీంనగర్ నగరంలోని భగత్ నగర్, రామచంద్రాపూర్ కాలనీ, పలు వినాయక మండపాల వద్ద రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కరీంనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గణేశ్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సభ్యుల సహకారంతోనే సంఘం అభివృద్ధి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌గౌడ్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అనిల్, మధు

కొత్తపల్లి(కరీంనగర్): సభ్యుల సహకారంతోనే సంఘం అభివృద్ధి పథంలో పయనిస్తుందని, అందుకు పాలకమండలి సభ్యుల కృషి అభినందనీయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్ అన్నారు. కొత్తపల్లి మండలం చింతకుంటలోని సంఘ భవనంలో ఆదివారం జరిగిన సహకార సంఘం 6వ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనతికాలంలోనే చింతకుంట సహకార సంఘం అభివృద్ధి బాటలు పట్టడం సంతోషదాయకమన్నారు. కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. సంఘం అధ్యక్షుడు న్యాలమడుగు శంకరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీటీసీ భూక్యా తిరుపతినాయక్, పత్తెం శారద, సహకార భారతి జిల్లా అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, మహిళా ప్రముఖ్ అనురాధ, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంజనీకుమార్, సురేందర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి తిరుపతి, రైతు సంఘం ఉపాధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కదిలిన ఉద్యోగ లోకం



చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న కలెక్టర్ గోపి



పనుల్లో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్



పరిశుభ్రత చర్యల్లో అధికారులు, ఉద్యోగులు

కరీంనగర్‌అర్బన్: కలెక్టరేట్ శుభ్రతకు అధికారులు, ఉద్యోగులు నడుం కట్టారు. కలెక్టర్ డా.బి.గోపి స్వయంగా రంగంలోకి దిగి అలుపెరగకుండా శ్రమదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ప్రతీ సెలవు రోజున కలెక్టరేట్ సముదాయంతో పాటు విభాగాలు, పరిసరాలను శుభ్రం చేయాలని కలెక్టర్ ఆదేశించిన విషయం విదితమే. కాగా ఆదివారం అధికారులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో కుందారపు మహేశ్వర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్పొరేషన్ ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం పక్కన గల పిచ్చిమొక్కలతో పాటు బ్యాంకు పరిసరాలను సౌకర్యంగా మలిచారు. కలెక్టర్ గోపి పనుల ప్రారంభం నుంచి ముగింపు వరకు విశ్రాంతి లేకుండా పనిచేసి స్ఫూర్తిగా నిలిచారు. కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, సూపరిండెంటెంట్లు గుర్రం శ్రీనివాస్‌గౌడ్, ముబిన్, మాధవి, నేరేళ్ల కిషన్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, డీసీవో రామానుజచార్యులు తదితరులు వివిధ విభాగాల వద్ద పిచ్చిమొక్కలను తొలగించారు. ఇన్‌చార్జి డీఆర్‌ఓ పవన్ కుమార్, జిల్లా అధికారులు రవీందర్, గంగారం, నేతినియల్, సురేశ్, సీహెచ్ కొండయ్య, ఎం.ఎ.కలీం, రెవెన్యూ, మున్సిపల్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రూప్‌-1 రద్దుపై ఏబీవీపీ నిరసన


నిరసన తెలుపుతున్న నాయకులు

కరీంనగర్‌: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో రెండో సారి గ్రూప్‌-1 ప్రిలిమ్స్‌ రద్దు కావడాన్ని నిరసిస్తూ ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి పూసల విష్ణు మాట్లాడుతూ, దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పేపర్‌ లీకులతో, పరీక్షల రద్దులో మొదటి స్థానంలో నిలిచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వానికి ఉద్యోగాలు భర్తీ చేయాలనే ఉద్దేశం లేదని, ఎలక్షన్లు దగ్గర కొస్తున్నాయనే కారణంతో ఓటు బ్యాంకు కోసం అడపాదడపా నోటిఫికేషన్లు ఇస్తూ పేపర్‌ లీకేజీలతో కుట్రపూరితంగా నిరుద్యోగుల జీవితాలను రోడ్డుకి ఈడుస్తున్నారని మండిపడ్డారు. గ్రూప్‌-1 రద్దుకు కారణమైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో జోనల్‌ ఇన్‌చార్జి బామండ్ల నందు, నగర సంయుక్త కార్యదర్శులు సంహిత్‌, నాగరాజు, వంశీ, కార్యకర్తలు సిద్ధూ, సాయికృష్ణ, అనిల్‌, మధు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌ అథ్లెటిక్స్‌ సంఘం ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్‌


నియామకపత్రం ఇస్తున్న ప్రభుకుమార్‌

కరీంనగర్‌స్పోర్ట్స్‌: హైదరాబాద్‌లోని మాస్టర్‌ అథ్లెటిక్స్‌ సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లాకు చెందిన నీలం లక్ష్మణ్‌ రాష్ట్ర మాస్టర్‌ అథ్లెటిక్స్‌ సంఘం ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి ప్రభుకుమార్‌ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌ను మాస్టర్‌ అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ గౌరవ అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గుడేల్లి మహిపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ పేర్యాల రవీందర్‌రావు, తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మెట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన రాంపల్లి రమేశ్‌(47) స్థానికంగా వివిధ వ్యాపారాలకు డీలర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ నెల 11న రాత్రి పని ముగించుకొని, బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో నిజామాబాద్‌ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.


మమత, కరీంనగర్‌


వేణుగోపాల్‌రెడ్డి, శ్రీరాములపల్లి, రామడుగు


ఎం.రామకృష్ణ, కరీంనగర్‌


హోంగణేశ్‌ ఉత్సవ సమితి, కాకతీయకాలనీ, హుజురాబాద్‌,


ధృతి, ప్రజ్ఞ, సరస్వతీనగర్‌, కరీంనగర్‌

మట్టి గణపతికి జై

కరీంనగర్‌కల్చరల్‌: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయకుడు ఘనమైన పూజలు అందుకుంటున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొందరు ప్రజలు మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు 'సాక్షి' ఆధ్వర్యంలో 'సెల్ఫీ విత్‌ గణేశ్‌' నిర్వహించగా తాము ఏర్పాటుచేసిన మట్టివిగ్రహాలతో సెల్ఫీ దిగి పంపించారు.

ఎల్లలు దాటొస్తున్న గంజాయి

- 'ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడు తన వాహనంపై భద్రాచలం అటవీ ప్రాంతానికి వెళ్లి, గంజాయి తరలిస్తుండగా మార్గమధ్యలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. ఇలా చాలా మంది కరీంనగర్‌ యువకులు గంజాయి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నట్లు సమాచారం.'

- 'నాలుగు రోజుల క్రితం కరీంనగర్‌ మండలానికి చెందిన 10 మంది యువకులు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ ప్రాంతాల నుంచి గంజాయి రవాణా చేస్తూ ఒడిశా పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది.'

- ఇతర రాష్ట్రాల నుంచి గుట్టుగా కరీంనగర్‌కు దిగుమతి
- ఒడిశా పోలీసులకు చిక్కిన 10 మంది యువకులు?


ఇటీవల పోలీసులు పట్టుకున్న గంజాయి

కరీంనగర్‌ క్రైం: వివిధ రాష్ట్రాల నుంచి కరీంనగర్‌కు గంజాయి దిగుమతి అవుతోంది. ఎల్లలు దాటి గంజాయి రవాణా చేస్తూ కరీంనగర్‌కు చెందిన పలువురు యువకులు ఇతర రాష్ట్రాల పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మొదట ఫ్యాషన్‌గా ప్రారంభించి, తర్వాత బానిసలుగా మారి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గంజాయి సేవించడంతోపాటు జల్సాల ఖర్చుల కోసం దాన్ని వ్యాపారంగా మార్చుకొని, చాలా మంది యువకులకు అలవాటు చేస్తున్నారు. ఎక్కువ శాతం కళాశాల విద్యార్థులు, పలుచోట్ల మైనర్లు, కార్మికులకు విక్రయించి, డబ్బులు దండుకుంటున్నారు.

మన రాష్ట్రంలో దొరక్కపోవడంతో..

మన రాష్ట్రంలో గంజాయి దొరక్కపోవడంతో ఎక్కువ శాతం మంది పక్క రాష్ట్రాల మీద దృష్టి పెడుతున్నారు. పలు రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు దిగుమతి అవుతోంది. అయితే అక్కడ కొనుగోలు చేస్తే రేటు ఎక్కువగా ఉంటుందని నేరుగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌, కర్నాటకలోని బీదర్‌, ఆంధ్రప్రదేశ్‌లోని అరకు సమీప ప్రాంతాలు, విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతాలు, సీలేరుకు వెళ్లి, కరీంనగర్‌కు తీసుకువస్తున్నారు. గతంలో పలువురు పోలీసులకు చిక్కడమే ఇందుకు ఉదాహరణ.

యువతే టార్గెట్‌..

గంజాయి వ్యాపారులు యువతనే టార్గెట్‌ చేస్తున్నారు. కరీంనగర్‌ పట్టణంతోపాటు జిల్లాలోని పల్లెల్లోనూ గంజాయి గుప్పుమంటోంది. సాయంత్రం అయిందంటే చాలు నిర్మానుష్య ప్రాంతాల్లో ఎక్కువ మంది గంజాయి సేవిస్తున్నారు. మూతపడిన దుకాణాలు, వాగుల పరిసరాలు, శివారు ప్రాంతాలు, వాడుకలో లేని భవనాల్లో ఇది గుట్టుగా సాగుతోంది. పోలీసులు తనిఖీలు చేసి, నియంత్రించినా చాప కింద నీరులాగా గంజాయి విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. కళాశాల విద్యార్థులు, కొంతమంది మైనర్లు, కార్మికులు గంజాయికి అలవాటు పడి, తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

వీఆర్‌వో, వీఆర్‌ఏల డిప్యూటేషన్‌కు గ్రీన్‌సిగ్నల్‌

- ఇప్పటికే పలువురికి విధుల కేటాయింపు

కరీంనగర్‌ అర్బన్‌: వీఆర్వో, వీఆర్‌ఏల వ్యవస్థ రద్దుతో ఎన్నికల నిర్వహణ తలకుమించిన భారమే. ప్రతి ఎన్నికల్లో వీరి పాత్రే కీలకం. అయితే సదరు అధికారులను ఇతర శాఖల్లో సర్దుబాటు చేయడం ఎన్నికల నిర్వహణపై ప్రభావం చూపనుంది. దీంతో డిప్యూటేషన్‌పై సదరు అధికారులు, సిబ్బందిని ఎన్నికల విధుల్లో నిర్వహించాలని కలెక్టర్‌ గోపి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రెండు విడతలుగా ఈవీఎంల చెకింగ్‌ జరగగా వీఆర్వో, వీఆర్‌ఏల లోటు స్పష్టమైంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్‌ వెలువడితే నిర్వహణ భారమని రాష్ట్ర అధికారులకు వివరించారు. దీంతో వివిధ శాఖల్లో సర్దుబాటుతో విధులు నిర్వహిస్తున్న వీఆర్వో, వీఆర్‌ఏల సేవలను డిప్యూటేషన్‌పై వినియోగించుకునేలా ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ఇప్పటికే కరీంనగర్‌, హుజూరాబాద్‌ రెవెన్యూ డివిజన్లలో బీఎల్‌వోలుగా, సూపర్‌వైజర్లుగా, ఈవీఎం ప్రదర్శన కేంద్రాల్లో 50మందిని నియమించారు. ఒకట్రెండు రోజుల్లో సుమారు 400 మంది ఉద్యోగులకు ఎన్నికల విధులను అప్పగించనున్నారు.

ఎన్నికల్లో వీరే కీలకం

ఈవీఎంలు వచ్చిన నుంచి కౌంటింగ్‌ తదుపరి స్ట్రాంగ్‌ రూంలో భద్రపరిచేవరకు, ఓటరు నమోదు, తొలగింపు, తుది జాబితా ప్రకటన వరకు వీఆర్‌వోలు, వీఆర్‌ఏలదే కీలకపాత్ర. ఈవీఎంల చెకింగ్‌, ర్యాండమైజేషన్‌, డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్లు, పోలింగ్‌ కేంద్రాల్లో సౌకర్యాలు, పోలింగ్‌ సిబ్బందిగా విధులు, ఈవీఎం యంత్రాల తరలింపు, పోలింగ్‌ సిబ్బందికి సౌకర్యాల కల్పన, వసతి ఏర్పాట్లు, ఎన్నికల పరిశీలకులకు బస ఏర్పాట్లు ఇలా వివిధ పనులు నిర్వహిస్తుంటారు. ఎన్నికల నిర్వహణలో ఇవే కీలకం.

ప్రత్యేక భత్యం ఉంటుందా..?

అయితే గతంలో జరిగిన ఎన్నికల్లో సేవలను వినియోగించుకోవడమే తప్ప భత్యం ఇవ్వలేదన్నది సుస్పష్టం. కేవలం ఈవీఎం మిషన్ల దింపడం వరకే తప్ప మిగతా పనుల్లో ప్రత్యేక భత్యం ఇవ్వడం లేదు. దీనికి తోడు జూలై నుంచి వేతనాలు రాకపోగా పడిగాపులు కాస్తున్నారు. తాజాగా అదనపు బాధ్యతలు అప్పగిస్తుండటంపై పెదవి విరుస్తున్నారు. జీతాలు, అదనపు భత్యం వచ్చేలా చూడాల్సిన అవసరముంది.

మొండి వైఖరి వీడి చర్చలకు పిలవాలి


వినోద్‌కుమార్‌ ఇంటిని ముట్టడిస్తున్న అంగన్‌వాడీలు, అడ్డుకుంటున్న పోలీసులు

కరీంనగర్‌: ప్రభుత్వం మొండి వైఖరి వీడి అంగన్‌వాడీల జేఏసీని చర్చలకు పిలవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య కోరారు. సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కలెక్టరేట్‌ ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారం 14వ రోజుకు చేరింది. ఈసందర్భంగా సమస్యలు పరిష్కరించాలని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌ ఇంటిని ముట్టడించడంతో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం సమ్మయ్య మాట్లాడుతూ, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రిటైర్‌మెంట్‌ బెనిఫిట్‌ టీచర్‌కు రూ.పది లక్షలు, ఆయాకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా మంత్రులను, ప్రభుత్వ అధికారులను అడ్డుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్‌ అండ్‌ హెల్పర్‌ అసోసియేషన్‌ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎ.రజిత, డి.రజిత, సంధ్య, అరుణ, రాజాదేవి, విజయ, ధన, పద్మ, అనురాధ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో విలీన గ్రామాలు

- మేయర్‌ సునీల్‌రావు


రేకుర్తిలో హైమాస్ట్‌ లైట్లు ప్రారంభిస్తున్న మేయర్‌

కరీంనగర్‌కార్పొరేషన్‌: నగరంలో విలీనమైన గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకువస్తున్నట్లు మేయర్‌ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. నగరంలోని 19వ డివిజన్‌ రేకుర్తిలో నూతనంగా ఏర్పాటు చేసిన రూఫ్‌ టాప్‌ హైమాస్ట్‌ లైట్లను ఆదివారం మేయర్‌ ప్రారంభించి మాట్లాడారు. విలీన డివిజన్లైన రేకుర్తి, సీతరాంపూర్‌, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, అలుగునూరు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. చాలా చోట్ల హైమాస్ట్‌, రూఫ్‌ టాప్‌ హైమాస్ట్‌ లైట్లు ఏర్పాటు చేశామని వివరించారు. తమ పాలకవర్గం హయాంలో నగరంలో ఇప్పటివరకు 600 మినీ హైమాస్ట్‌ లైట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. నగరపాలకసంస్థలో విలీనమైన తరువాత ఈ గ్రామాల రూపురేఖలు మారుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ ఏదుల్ల రాజశేఖర్‌, డివిజన్‌ ప్రజలు పాల్గొన్నారు.

యువత భవిష్యత్‌కు బీఆర్‌ఎస్‌ పెద్దపీట

కరీంనగర్‌: బీఆర్‌ఎస్‌లో పనిచేసే యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందని నగర మేయర్‌ యాదగిరి సునీల్‌ రావు అన్నారు. నగరంలోని 33 వ డివిజన్‌ భగత్‌నగర్‌ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం 53వ డివిజన్‌కు చెందిన దాదాపు 30 మంది గతంలో బీజేపీ పని చేసిన యువనాయకులు కార్పొరేటర్‌ శ్రీదేవి చంద్రమౌళి ఆధ్వర్యంలో గులాబీ గూటికి చేరారు. మేయర్‌ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్‌ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై గులాబీ జెండా నీడలో పని చేసేందుకు యువకులు ఉత్సాహంతో కండువా కప్పుకున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ముచ్చటగా 4వ సారి ఎమ్మెల్యేగా గంగుల కమలాకర్‌ను, ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ టికెట్‌ వేటలో సర్పంచ్‌


కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఖర్గేతో సర్పంచు శ్రీనివాస్‌

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలం బొమ్మకల్‌ సర్పంచు పురుమల్ల శ్రీనివాస్‌ కాంగ్రెస్‌పార్టీ టికెట్‌ కోసం చేస్తున్న ప్రయత్నాలతో జిల్లా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లోనే ఉండి కరీంనగర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఎమ్మెల్యే టికెట్‌ కోసం శ్రీనివాస్‌ దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 16న బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన సర్పంచు శ్రీనివాస్‌పై గతంలో కరీంనగర్‌రూరల్‌ పోలీసులు రౌడీషీట్‌ ఓపెన్‌ చేసిన సర్క్యులర్‌తోపాటు పలుకేసుల వివరాలు సోషల్‌మీడియాలో జోరుగా ప్రచారమైనాయి. ఈక్రమంలో శనివారం ఢిల్లీలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. టికెట్‌ కోసం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఆదివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను సర్పంచు శ్రీనివాస్‌ కలుసుకోవడం జిల్లాలో ప్రాధాన్యతను సంతరించుకుంది. కరీంనగర్‌ టికెట్‌ను ఆశిస్తున్న పలువురు నాయకులు హైదరాబాద్‌ స్థాయిలో టీపీసీసీ నాయకులతో ప్రయత్నిస్తుండగా శ్రీనివాస్‌ ఏకంగా ఢిల్లీస్థాయిలో ప్రయత్నాలు చేయడం రాజకీయవర్గాల్లో సంచలనంగా మారింది. కాంగ్రెస్‌లో చేరిన మరుసటిరోజే టికెట్‌ కోసం ఏఐసీసీ అధ్యక్షుడిని కలుసుకునే అవకాశం రావడం పార్టీలోని మిగతా ఆశావహులను కలవరపరుస్తోంది. ఏది ఏమైనా శ్రీనివాస్‌ ఢిల్లీలో రెండు రోజులుగా చేస్తున్న ప్రయత్నాలు చర్చనీయాంశంగా మారాయి.

విషాదం మిగిల్చిన ప్రయాణం

- కారు బోల్తా.. ఒకరి మృతి.. పలువురికి గాయాలు
- బాధితులు జమ్మికుంటవాసులు


నితిన్‌(ఫైల్‌)

జమ్మికుంట/చేవెళ్ల: కుటుంబ సభ్యులంతా ఆదివారం సరదాగా గడపాలని అనుకున్నారు. ఓ ఫాంహౌస్‌లో గెట్‌ టుగెదర్‌ పార్టీ ఉండడంతో వారి కారులో బయలుదేరారు. ఈ ప్రయాణం కాస్త విషాదంగా మారింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కరీంనగర్‌ జిల్లా జమ్మికుంటకు చెందిన హైతా యుగేందర్‌, అనురాధ దంపతులు. హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. చేవెళ్ల సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో ఆత్మీయ సమ్మేళనం ఉండడంతో యుగేందర్‌ దంపతులు, వారి పెద్ద కుమారుడు శరణ్‌, కోడలు సంఘవి, చిన్న కుమారుడు నితిన్‌ (27) కారులో ప్రయాణమయ్యారు. నితిన్‌ కారు డ్రైవ్‌ చేస్తుండగా, చేవెళ్ల మండల కేంద్రానికి సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నితిన్‌ తలకు బలమైన గాయమవగా, కారులో ప్రయాణిస్తున్న వారి కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నితిన్‌ అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. చేతికి వచ్చిన కొడుకు వ్యాపారం చేస్తూ కుటుంబానికి అండగా నిలబడ్డాడు. ఈ ఘటన వారి కుటుంబంలో విషాదం నింపింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. నితిన్‌ మృతితో జమ్మికుంటలో విషాదం నెలకొంది.

ఆర్‌ఎంపీపై కేసు

వీణవంక(హుజూరాబాద్‌): మండల కేంద్రానికి ఆర్‌ఎంపీ వైద్యుడు అన్వర్‌పాషాపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఆసీఫ్‌ వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఓ గ్రామానికి చెందిన అవివాహిత ఏడాది క్రితం ఆర్‌ఎంపీ వద్ద నర్సుగా పని చేసి మానేసింది. కాగా పది రోజుల నుంచి తన క్లినిక్‌లో పని చేయాలని అన్వర్‌పాషా సదరు అవివాహిత వెంట పడుతున్నాడు. తనతో గడపాలని వేధిస్తున్నాడని, ఇబ్బందులకు గురిచేస్తున్నాడని సదరు అవివాహిత, ఆర్‌ఎంపీపై ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


అజేయ్‌(ఫైల్‌)

జమ్మికుంట(హుజూరాబాద్‌): యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జమ్మికుంట మండల పరిధిలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని విలాసాగర్‌ గ్రామానికి చెందిన వేల్పుల అజేయ్‌ (18) ఆదివారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి బంధువుల ఇంటికి వెళ్లగా, తండ్రి గ్రామంలో పని మీద బయటకు వెళ్లిన క్రమంలో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మృతికి గల కారణాలు తెలియలేదు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు తెలిసింది.

కరీంనగర్‌- వరంగల్‌ రహదారిపై బస్సు, లారీ ఢీ

- బస్సు డ్రైవర్‌, కండక్టర్‌, లారీ డ్రైవర్‌, మరో ప్రయాణికునికి తీవ్రగాయాలు


లారీని ఢీకొట్టిన బస్సు

శంకరపట్నం(మానకొండూర్‌):మండలంలోని కరీంనగర్‌- వరంగల్‌ రహదారిపై ఆదివారం బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో 17 మంది గాయపడ్డారు. పోలీసుల వివరాలు.. వరంగల్‌ నుంచి నిజామాబాద్‌ వెళ్తున్న బస్సు, కరీంనగర్‌ నుంచి హుజురాబాద్‌ వెళ్తున్న లారీని కేశవపట్నం మండలం తాడికల్‌ గ్రామ శివారులోని మూలమలుపు వద్ద ఢీకొట్టింది. బస్సు డ్రైవర్‌ నవాజ్‌, కండక్టర్‌ తిరుపతి, లారీ డ్రైవర్‌తో పాటు పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 46 మంది ఉండగా ముగ్గురికి, లారీ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఘటన జరగగానే స్థానికులు, పోలీసులు 108 సిబ్బందికి కాల్‌ చేయగా వెంటనే అక్కడికి చేరుకున్నారు. సీఐ సంతోష్‌, ఎస్సై లక్ష్మారెడ్డి ప్రమాద స్థలాన్ని సందర్శించారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యాభై ఏళ్లకు.. ఒక్క చోటకు..


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): కరీంనగర్‌ గంజ్‌ హైస్కూల్లో 1973 బ్యాచ్‌ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండలంలోని వాగేశ్వరీ ఇంజినీరింగ్‌ కళాశాలలో ఘనంగా జరిగింది. చిన్ననాటి స్మృతులను నెమరేసుకున్నారు. చిన్నపిల్లలుగా వెళ్లినవారు.. మనవలు, మనమరాళ్లను ఎత్తుకుని రావడం ఒకరినొకరు గుర్తుపట్టకపోవడం కనిపించింది. మళ్లీ నూతనంగా పరిచయం చేసుకున్నారు. చాలామంది పూర్వ విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు చేసి రిటైర్మెంట్‌ అయ్యారు. కుటుంబసభ్యులతో రోజంతా ఆటాపాటలతో ఆనందంగా గడిపారు. గంజ్‌ పాఠశాల అభివృద్ధికి తామంతా కృషి చేస్తామని చెప్పారు. 50 ఏళ్ల తర్వాత కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. మరణించిన తోటి స్నేహితులు, నాటి ఉపాధ్యాయులకు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, రాజేశం, రవూఫ్‌, పూర్వ విద్యార్థులు విశ్వనాథ్‌ బాలకిషన్‌, చంద్రమౌళి, సత్యం, గౌరిశెట్టి రాజేందర్‌, ప్రభాకర్‌, సోమనాథ్‌, లక్ష్మారెడ్డి, అంజయ్యయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

వెల్లుల్ల కాకతీయ కాల్వలో మృతదేహం

మెట్‌పల్లిరూరల్‌: మండలంలోని వెల్లుల్ల శివారు కాకతీయ కాల్వలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కెనాల్‌లో ఆదివారం మృతదేహం కొట్టుకుపోతుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే స్పందించి, గజ ఈతగాళ్ల సహాయంతో బయటకు తీయించారు. మృతుడు నిజామాబాద్‌ జిల్లా ఆర్మూర్‌ మండలంలోని మామిడిపల్లికి చెందిన ఏనుగు రణధీర్‌రెడ్డి(46)గా గుర్తించారు. అనంతరం అతని కుటుంబసభ్యులకు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ నెల 21న హైదరాబాద్‌ వెళ్తున్నానని చెప్పి, ఇంటి నుంచి వెళ్లాడని, తిరిగిరాలేదని వారు తెలిపారు. కాగా, రణధీర్‌రెడ్డికి గతంలో వివాహం జరిగి, విడాకులయ్యాయని, తర్వాత మరో మహిళను పెళ్లి చేసుకున్నప్పటికీ ఆమెతో విభేదాలు వచ్చి, కొంతకాలంగా ఒంటరిగా ఉంటున్నాడని తెలిసింది. అతని మృతదేహాన్ని స్వగ్రామం తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఏఎస్సై మృతి


రాజమల్లయ్య(ఫైల్‌)

ధర్మపురి: రక్తకణాలు తగ్గిపోయి, కాలికి గాయంతో ఇన్‌ఫెక్షన్‌ అయిన ఓ ఏఎస్సై చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుని బంధువుల కథనం ప్రకారం.. ధర్మపురికి చెందిన కల్యాడపు రాజమల్లయ్య(60) వెల్గటూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా పని చేస్తున్నారు. ఇటీవల జ్వరం కారణంగా రక్తకణాలు తగ్గిపోయాయి. దీంతోపాటు కాలికి గాయమై, తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబసభ్యులు వారం రోజుల క్రితం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయారు. మృతుడికి భార్య సులీల, ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

మల్యాల(చొప్పదండి): మండలంలోని ముత్యంపేట శివారులో జగిత్యాల-కరీంనగర్‌ రహదారిపై ఓ ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. బల్వంతాపూర్‌ గ్రామానికి చెందిన కుటుంబసభ్యులు ఏడుగురు ఆదివారం ఆటోలో జగిత్యాల వెళ్తున్నారు. ఈ క్రమంలో లారీ వెనక నుంచి ఢీకొంది. ప్రమాదంలో జహంగీర్‌, హుస్సేన్‌ బీ తలకు తీవ్ర, మిగతా ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను 108 వాహనంలో జగిత్యాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆటోడ్రైవర్‌ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్‌ తెలిపారు.


హోమంలో పాల్గొన్న మేయర్ సునీల్‌రావు


తిరుమలనగర్‌లోని వినాయకుడి వద్ద..


సంతోష్‌నగర్‌లో మహా గణపతి హోమం

హోమాలు.. పూజలు.. అన్నదానాలు

కరీంనగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని పలు వినాయక పందపాల వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు, భజనలు, అన్నదానాలు నిర్వహించారు. మేయర్ సునీల్‌రావు పలు వినాయక మండపాలను సందర్శించారు. 33వ డివిజన్ భగత్‌నగర్‌లో భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద మహాగణపతి హోమంలో పాల్గొన్నారు. రాంనగర్‌లో 3 అడుగుల మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించిన నిర్వాహకులను హమ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ధనపురి సాగర్ సన్మానం చేశారు. పలు గణేశ్ మండపాలను మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. - కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్/కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌రూరల్


గణేశ్ మండపం వద్ద భక్తులతో జయపాల్‌రెడ్డి


దుర్శేడ్‌లో అన్నదానం


శాంతినగర్‌లోని గణేశ్ ఫ్రెండ్స్ యూత్ వద్ద..


జయంతి టవర్ వద్ద హోమం


శ్రీనగర్‌లోని గణేశ్ మండపంలో భజన


ఆదర్శనగర్‌లో అన్నదానం


మట్టి వినాయకుడి నిర్వాహకులను సన్మానిస్తున్న హమ్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు


ప్రకాశం గంజ్‌లోని వరసిద్ధి వినాయకుడి వద్ద..

4న ఎస్సీ ఉపకులాల ఆత్మ గౌరవసభ


మాట్లాడుతున్న బైరి వెంకటేశం

విద్యానగర్: చిందు కులస్తుల సమస్యల పరిష్కారం కోసం ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో అక్టోబర్ 4న హైదరాబాద్‌లో ఆత్మ గౌరవ సభ నిర్వహిస్తున్నట్లు ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం తెలిపారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ చిందు హక్కుల పోరాట సమితి 3వ మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిందు కులస్తుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. తమ హక్కుల సాధన కోసం ఆత్మ గౌరవ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాయిల లక్ష్మీ నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, ఉపాధ్యక్షులుగా ధనుంజయ, చిరంజీవి, కనుకయ్య, రమేశ్, దామెదర్, దాసు, మురళి, కార్యదర్శులుగా రాజేశ్వరి, వెంకటేష్, జనార్దన్, దుర్గయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా యాదగిరి, సుదర్శన్, కోశాధికారిగా శ్రీకాంత్, అధికార ప్రతినిధులుగా చిరంజీవి, మారుతి, రామచంద్రు, సమ్మయ్య, అనంతం, సిద్ధు, సాగర్, ప్రచార కార్యదర్శిగా రవిలను ఎన్నుకున్నారు.

క్లుప్తంగా

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ



విద్యానగర్: ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా, పట్టణ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆదివారం నగరంలోని కొండ సత్యలక్ష్మిగార్డెన్‌లో మేయర్ సునీల్‌రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర సలహాదారు మహిమల కేదార్నాథ్‌రెడ్డి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సిరి రవి, ప్రధాన కార్యదర్శి తుము చందు, కోశాధికారి గొంటి లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు కనుకరావు, ప్రధాన కార్యదర్శి నాగిశెట్టి రమేశ్, రఫీ, ప్రవీణ్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



కరీంనగర్: ఉత్తమ జిల్లా పంచాయతీ అధికారిగా వీరబుచ్చయ్య, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పెరుక నర్సయ్యలు అవార్డులు అందుకున్న సందర్భంగా ఆదివారం వారిని మున్నూరుకాపు ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కామ సతీశ్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మామిడి రమేశ్, జిల్లా నాయకులు పుల్లెల సుధీర్, బట్టు కరుణాకర్, వంగ సుధాకర్, శ్రీగిరి శ్రీనివాస్, తోట సునీల్, బోనాల శ్రీహరి , రాజగోపాల్, మౌనిక , రాజకుమార్, పత్తెం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చింతకుంటలో శ్రమదానం



కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఆదివారం శ్రమదానం నిర్వహించి పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించారు. ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఎంపీటీసీ భూక్య తిరుపతినాయక్, వార్డు సభ్యురాలు లత, పంచాయతీ కార్యదర్శి లచ్చయ్య, కె.సత్యనారాయణరెడ్డి, గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమాండ్ల ఆంజనేయులు గౌడ్, పెరుమాండ్ల కమల్‌గౌడ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సదస్సుకు తరలివెళ్లిన ఎంఐఎం శ్రేణులు

విద్యానగర్: హైదరాబాద్‌లోని దారుసలాంలో గల ఎంఐఎం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం నిర్వహిస్తున్న జల్సా రహమతుల్ -లీల్-ఆలమీన్ ఆధ్యాత్మిక సదస్సుకు కరీంనగర్ నుంచి ఎంఐఎం శ్రేణులు తరలివెళ్లారు. నగరంలోని పార్టీ కార్యాలయం వద్ద ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ జెండా ఊపి వాహన శ్రేణిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీ హాఫిజ్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, జగిత్యాల అధ్యక్షుడు యునూస్ నదీమ్, అంజద్ ఖాన్, ఫర్హాజ్ అలీ, ఇస్మాయిల్, బాజ్, కరీంఖాన్, ఖాజా మజ్హరొద్దీన్, ఖదీర్ ఖాన్, యఖూబ్ ఖాన్, ఖమరుద్దీన్, షేక్ రహీం, ముజఫర్ తదితరులున్నారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా..

- కరీంనగర్ బస్టాండులో నిఘా మరింత పటిష్టం
- 62 సీసీ కెమెరాలు ఏర్పాటు
- పోలీసు, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా నిర్వహణ
- కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం


బస్టాండులో సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న టౌన్ ఏసీపీ నరేందర్(ఫైల్)

కరీంనగర్‌క్రైం: ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా కరీంనగర్ బస్టాండులో సీసీ కెమెరాల నిఘా మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టారు. నిత్యం వందలాది మంది వస్తూ పోతుండే ప్రయాణికుల భద్రతతో పాటు గతంలో జరిగిన నేరాలను దృష్టిలో పెట్టుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల క్రితం 32 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి ఫుటేజీ వీక్షించేందుకు బస్టాండ్‌లో ఒక ప్రత్యేక గదిని కేటాయించి మూడు పెద్ద స్క్రీన్ల ద్వారా ఎప్పటికప్పుడు పోలీసులు వీక్షించారు. అయితే కొన్ని రోజులుగా అవి సరిగా పనిచేయక పోవడంతో వాటిపై ఆర్టీసీ అధికారులు, పోలీసులు దృష్టి సారించారు. వాటి మరమ్మతుతో పాటు కొత్తగా మరికొన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు నిర్ణయించారు.

62 సీసీ కెమెరాల ఏర్పాటు

కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికులకు భద్రత కల్పించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గతంలో గంజాయి రవాణాదారులు ఎవరికి అనుమానం రాకుండా ఉండాలని ప్రైవేటు వాహనాలు కాకుండా ఆర్టీసీ బస్సులో రవాణా చేస్తున్నారని పోలీసుల విచారణల్లో తేలింది. అప్పటి నుంచి ఆర్టీసీ బస్టాండ్‌లో నిఘా పటిష్టం చేశారు.



బస్టాండులో ఏర్పాటు చేసిన ప్రత్యేక గది

అయితే గతంలో అమర్చిన సీసీ కెమెరాలు చాలా వరకు పనిచేయకపోవడంతో వాటిని మరమ్మతు చేయాలని నిర్ణయించారు. ఇటీవల కరీంనగర్ టౌన్ ఏసీపీ ఆధ్వర్యంలో ఆర్టీసీ అధికారులందరూ కలిసి పనిచేయని కెమెరాలను గుర్తించారు. బస్టాండుపై నిఘా ఏర్పాటు చేయడానికి 62 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసు కమిషనరేట్‌లోని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయనున్నారు. బస్టాండులో సీసీ కెమెరాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలో పోలీసు శాఖ నుంచి ఒకరు, ఆర్టీసీ శాఖ నుంచి ఒకరు నిత్యం వాటిని పర్యవేక్షించేందుకు చర్యలు చేపడుతున్నారు.

మరమ్మతు చేపిస్తున్నాం



బస్టాండులో ప్రయాణికుల భద్రతతో పాటు నేరాల నియంత్రణకు ఉన్నతాధికారుల సూచనల మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అందులో కొన్ని పనిచేయనివి గుర్తించి మరమ్మతు చేపిస్తున్నాం. వీటితో పాటు మొత్తం 62 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. సీసీ కెమెరాల ఫుటేజీని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేస్తాం.

– రవికుమార్, వన్‌టౌన్ సీఐ

జేపీఎస్‌ల అయోమయం

- ఉద్యోగి గుర్తింపు నంబరు జారీలో జాప్యం
- వేతనాలు అందక ఆందోళన


మంత్రి గంగుల కమలాకర్ నుంచి నియామక పత్రాలు అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శులు(ఫైల్)

కరీంనగర్‌రూరల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శి నుంచి గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శిగా క్రమబద్ధీకరణ పొందిన ఆనందం జేపీఎస్‌లకు కరువైంది. నియామక ఉత్తర్వులు పొందిన కార్యదర్శులు వేతనాలు అందక ఆందోళన చెందుతున్నారు. వేతనాలు పొందడానికి ఉద్యోగి గుర్తింపు నంబరు, ప్రాన్(పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నంబరు) నంబర్ కేటాయించడంలో ట్రెజరీ అధికారులు జాప్యం చేస్తున్నారు. ప్రతినెలా 24వరకు ఉద్యోగుల వేతనాల చెల్లింపు ప్రక్రియను అధికారులు పూర్తి చేస్తారు. ఉద్యోగి గుర్తింపు నంబరు లేకపోవడంతో ఆగస్టు నెలలో కొన్ని రోజులు, సెప్టెంబరు నెల వేతనం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో 118మంది జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ

కరీంనగర్ జిల్లాలో మొత్తం 313 గ్రామపంచాయతీలున్నాయి. పంచాయతీ కార్యదర్శులు లేకపోవడంతో గ్రామాల పరిపాలన కుంటుపడింది. ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను 2019 ఏప్రిల్‌లో నియమించింది. మూడేళ్ల సర్వీసు పూర్తి కాగానే క్రమబద్ధీకరిస్తామని ముందుగా ప్రకటించిన ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఈ ఏడాది ఏప్రిల్‌తో నాలుగేళ్ల సర్వీసు పూర్తయినప్పటికీ ప్రభుత్వం క్రమబద్ధీకరించకపోవడంతో జేపీఎస్‌లు సమ్మె చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీ మేరకు 20రోజుల అనంతరం సమ్మెను విరమించారు. జిల్లాలో నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన జేపీఎస్‌ల పనితీరు ఆధారంగా ఆగస్టులో విడతల వారీగా మొత్తం 118 మందికి గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించి నియామకపత్రాలు అందజేశారు.

ఉద్యోగి గుర్తింపు నంబరులో జాప్యం

గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులుగా నియమితులైన వారికి వేతనాల చెల్లింపు కోసం ఉద్యోగి గుర్తింపు నంబరు, ప్రాన్(పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నంబరు) నంబరు జారీలో జిల్లా ట్రెజరీ శాఖ జాప్యం చేయడంతో ఆందోళన చెందుతున్నారు. నియామక పత్రం అందుకున్నప్పటి నుంచే ఉద్యోగి గుర్తింపు నంబరు కేటాయించాల్సి ఉండగా పలు కారణాలతో ఆలస్యం కావడంతో వేతనాలు అందని పరిస్థితి నెలకొంది. క్రమబద్ధీకరణ పొందిన వారికి వెంటనే ఉద్యోగి గుర్తింపు నంబర్ ఇచ్చి రెండునెలల వేతనాలు వచ్చేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు. పంచాయతీ అధికారులు వారం రోజుల నుంచి వేతనాల చెల్లింపు కోసం అవసరమైన చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి ఏ మండలంలో పనిచేస్తున్నారు, పేరు, తదితర వివరాలను డీటీవోకు పంపించారు.

నాలుగు నెలల సర్వీసు కోల్పోయారు

వాస్తవానికి జేపీఎస్‌లను ఏప్రిల్‌నెలలోనే క్రమబద్ధీకరించాల్సి ఉండగా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఆగస్టులో క్రమబద్ధీకరించడంతో నాలుగు నెలల సర్వీసును కోల్పోయారు. పదోన్నతుల సమయంలో సర్వీసు సమస్య తలెత్తే అవకాశముంది. అంతేకాకుండా జూలై 1 వరకు ఉన్న ఉద్యోగులకు మాత్రమే పీఆర్‌సీ వర్తిస్తుండగా సెప్టెంబర్‌లో ఉద్యోగి గుర్తింపు నంబర్ ఇవ్వడంతో పీఆర్‌సీని సైతం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

26వరకు ప్రక్రియ పూర్తవుతుంది

జిల్లాలోని 118 మంది జేపీఎస్‌లను క్రమబద్ధీకరించామని, ఇప్పటి వరకు 81 మందికి ఉద్యోగి గుర్తింపు నంబరు జారీ చేశాం. ట్రెజరీ శాఖలో ఉద్యోగుల వివరాలను ఆన్‌లైన్ నమోదులో సాంకేతిక సమస్యలతో కొంత జాప్యమేర్పడుతోంది. ఈనెల 26 వరకు ప్రక్రియ పూర్తవుతుంది.

– వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి, కరీంనగర్

ఏకతాటిపై ఉంటేనే రాణించగలుగుతాం


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్: పద్మశాలీలు రాజకీయంగా ఎదగడానికి ఆర్థికంగా బలంగా ఉండి కుల సంఘాలన్నీ ఐక్యమై ఏకతాటిపై ఉంటేనే రాజకీయాల్లో రాణించగలుగుతామని కాళేశ్వరం ప్రాజెక్ట్ ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు, పెద్దపల్లి జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ అన్నారు. ఆదివారం పోపా ఆధ్వర్యంలో పద్మశాలీ హస్టల్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థుల ప్రతిభా, ఉద్యోగుల పద్మ రత్న పురస్కారాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు వారి లక్ష్యాన్ని ఎంచుకొని సాధన కోసం కృషి చేస్తూ సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. వివిధ విద్య కోర్సుల్లో 2023 సంవత్సరంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, ఇప్పనపెల్లి సాంబయ్య, పోపా జిల్లా నాయకులు వి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'యూపీఎస్సీకి గ్రూప్-1 నిర్వహణ బాధ్యతలివ్వాలి'



మాట్లాడుతున్న మహేందర్

కరీంనగర్: గ్రూప్–1 నిర్వహణ బాధ్యతలను యూపీఎస్సీకి ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగేందర్ అన్నారు. ఆదివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో నిర్వహించిన ఏఐవైఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రూప్ వన్ అభ్యర్థుల బయోమెట్రిక్ తీసుకోలేదని, హాల్ టికెట్ నంబర్ లేకుండా ఓఎంఆర్ షీట్ ఇచ్చారనే ప్రధాన ఆరోపణలతో గ్రూప్–1 అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా విచారణ అనంతరం పరీక్షను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. టీఎస్పీఎస్సీ గ్రూప్–1 నిర్వహణలో కేసీఆర్ సర్కార్ నైతిక బాధ్యత వహిస్తూ తెలంగాణ ప్రజానికానికి, నిరుద్యోగులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు శీలం వెంకటేష్, శ్రావణ్, రమేశ్, భరత్, సురేందర్, మురళి, ప్రవీణ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నసైజు కోడిగుడ్ల సరఫరాతో ఇబ్బంది

కరీంనగర్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్న సైజు కోడిగుడ్లు సరఫరా చేస్తుండటంతో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుడ్ల పరిమాణంలో తేడాతో పంపిణీ చేసేటప్పుడు లబ్ధిదారులు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. కరీంనగర్‌రూరల్ మండలంలో మొత్తం 27 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 1,908 మంది పిల్లలు, గర్భిణులు 297, బాలింతలు 199 లబ్ధిదారులుగా ఉన్నారు. సాధారణంగా కేంద్రాలకు వచ్చే కోడిగుడ్ల బరువు 50 గ్రాములుంటుంది. ఒక ట్రేలో 30 గుడ్ల బరువు 1.5 కిలోలుండాలి. ప్రతినెలా మొదటి విడతలో 1వ తేదీ నుంచి 15 వరకు, రెండో విడతలో 15 నుంచి 30లోపు కాంట్రాక్టరు అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లను సరఫరా చేయాల్సి ఉంది. కొన్ని నెలల నుంచి కేంద్రాలకు వస్తున్న చిన్నగుడ్లతో అంగన్‌వాడీ టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేకాకుండా చిన్నసైజు గుడ్లతో పాటు పాడైన గుడ్లు కూడా వస్తున్నాయి. చిన్న గుడ్లను తీసుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. సకాలంలో గుడ్లను సరఫరా చేయకపోవడంతో కొంతమంది లబ్ధిదారులకు అందించలేక పోతున్నామని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. చిన్నసైజు గుడ్ల సరఫరాపై సంబంధిత కాంట్రాక్టరుతో మాట్లాడినట్లు కరీంనగర్ అర్బన్ సీడీపీవో ఉమారాణి తెలిపారు. తక్కువ పరిమాణం గుడ్లు, పాడైన గుడ్లు వస్తే టీచర్లు తీసుకోకుండా వాపస్ చేయాలని సూచించారు.

'ఇష్టానుసారంగా నిర్వహణతోనే గ్రూప్-1 పరీక్ష రద్దు'


మాట్లాడుతున్న తిరుపతి

కరీంనగర్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహణ అధికారులు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా నిర్వహించడం వల్లే గ్రూప్–1 పరీక్షను హైకోర్టు రద్దు చేసిందని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మొదట పరీక్ష నిర్వహించినప్పుడు 2,33,248 మంది చూపి తర్వాత 254 మందిని ఎక్కువ ఎలా చూపిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యువతకు ఉద్యోగ నియామక పరీక్షలు, ఉద్యోగాలు భర్తీ చేస్తామని మాయమాటలు చెబుతూ ప్రభుత్వం యువతకు తప్పుదారి పట్టిస్తుందని మండిపడ్డారు. టీఎస్పీఎస్ కమిషన్‌ను రద్దుచేసి ఉద్యోగాలు పారదర్శకంగా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నరేశ్, లక్‌పతి, భాస్కర్, రఘుపతి, రవీందర్, అజయ్, నవీన్, అభిలాష్, పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేయాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

కరీంనగర్: టీఎస్‌పీఎస్‌సీని తక్షణమే ప్రక్షాళన చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రూప్–1 అభ్యర్థులకు న్యాయం చేయాలని నగరంలోని తెలంగాణచౌక్‌లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు రోజురోజుకి అన్యాయంగా జరుగుతుందని అన్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన టిఎస్పీఎస్సీ కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తూ అభ్యర్థులను ఇబ్బంది పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. గ్రూప్–1 రద్దుకు కారణమైన టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి ని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి ఇంతవరకు దాని ఊసే లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పరాపు రోహిత్, జిల్లా సహాయ కార్యదర్శులు వినయ్, మనోజ్, నాయకులు సందేశ్, రాకేశ్, రోహిత్, నవదీప్, చందు, మహేష్ పాల్గొన్నారు.

నేడు అమర్‌నాథ్ దివ్యదర్శనం

కరీంనగర్ కల్చరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం కరీంనగర్ విద్యానగర్‌లోని ప్యారిస్ లైన్ వీధిలో గణేశ్ మండపం వద్ద అమర్నాథ్ దివ్యదర్శనం భక్తులకు కల్పించబోతున్నామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి భక్తులకు దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

ఎస్జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ



ట్రోఫీలు సాధించిన విద్యార్థులతో శ్రీపాల్‌రెడ్డి


ప్రతిభ కనబర్చిన వింధ్యావాలీ విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్: నగరంలో నిర్వహించిన కరీంనగర్ అర్బన్ పాఠశాలల క్రీడా పోటీల్లో సిద్ధార్థ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అండర్ 14, 17 విభాగంలో వాలీబాల్, కబడ్డీ పోటీల్లో ప్రథమ, ద్వితీయస్థానాలు గెలుచుకున్నారు. అథ్లెటిక్‌లో లాంగ్‌జంప్‌లో శివసాయి, అభిగ్నశ్రీ, కావ్య, 3 కిలోమీటర్ల రన్నింగ్‌లో తోగి నాధన్, 1,500 మీటర్ల రన్నింగ్‌లో హాసిని, డిస్కస్‌త్రోలో మణిదీప్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆదివారం సిద్ధార్థ విద్యా సంస్థల డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి అభినందించారు.

వింధ్యావాలీ విద్యార్థుల..

మెహర్‌నగర్‌లోని వింధ్యావాలీ పాఠశాల విద్యార్థులు అండర్–14 బాలుర వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆదివారం పాఠశాల చైర్మన్ లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

క్లుప్తంగా...

గుండెపోటుతో విద్యార్థిని మృతి



ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని టి.పల్లవి (16) ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. తొలుత విద్యార్థిని గుండెపోటుతో బాధపడుతుండటంతో వెంటనే అధ్యాపకులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే పల్లవి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థినిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ.

డిసెంబర్ 7న అసెంబ్లీ ఎన్నికలు!

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు/సహాయ వ్యయ పరిశీలకులు/ వ్యయ పర్యవేక్షణ బృందాలు/ రిటర్నింగ్ అధికారులు/సెక్టార్ అధికారులకు వేర్వేరుగా శిక్షణ, జిల్లాలకు నిధుల కేటాయింపు, అభ్యర్థుల ఎన్నికల వ్యయానికి సంబంధించిన ధరల ఖరారు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్/స్టాటిక్ సర్వేలియన్స్ టీమ్స్/వీడియో సర్వేలియన్స్ టీమ్‌ల ఏర్పాటు తదితర పనులన్నీ వచ్చే అక్టోబర్‌నెలలోగా పూర్తి చేయాలని సీఈఓ కార్యాలయం నిర్దేశించుకుంది.

నవంబర్‌లో..

నవంబర్‌లో వివిధ స్థాయిల్లోని పోలీసు అధికారులకు శిక్షణ, పోలింగ్ సిబ్బందికి నియామక ఆదేశాల జారీ, సోషల్ మీడియాపై పర్యవేక్షణ, ఈవీఎంల తొలి ర్యాండమైజేషన్, వ్యయ పరిశీలకులకు శిక్షణ, పోలింగ్ కేంద్రాల ప్రకటన, వికలాంగులు/80 ఏళ్లకు పైబడిన వయోవృద్ధులైన ఓటర్లకు ఇంటి నుంచే ఓటు హక్కు కల్పించడానికి ఫారం 12డీ దరఖాస్తుల స్వీకరణ, సీ-విజిల్ ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదుల స్వీకరణ, పెయిడ్ వార్తలపై సమీక్ష, ఎన్నికల్లో వినియోగించేందుకు సమీకృత ఓటర్ల జాబితా ప్రకటన, పోలింగ్/కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, బ్యాలెట్ పత్రాల ముద్రణ, సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ, ఈవీఎంలకు రెండో ర్యాండమైజేషన్ నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ల పంపిణీ/స్వీకరణ తదితరాలన్నీ పూర్తి చేయాలి.

డిసెంబర్‌లో..

డిసెంబర్ నెలలో పోలింగ్ సిబ్బందికి తుది శిక్షణ, పోలింగ్ కేంద్రాలకు రవాణా సదుపాయ కల్పన, పోలింగ్‌కు 48 గంటల ముందు మద్యం అమ్మకాలపై నిషేధం, పోలింగ్, కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలి.

గల్ఫ్.. ప'రేషన్'

- ఈ-కేవైసీకి ఇప్పటికిప్పుడు రాలేమని వలస కార్మికుల ఆందోళన
- లేకపోతే రేషన్‌కార్డుల్లో పేర్లు తొలగిస్తారనే భయం
- గల్ఫ్ దేశాల్లో పనిచేసేవారి సంఖ్య 15 లక్షలకు పైగానే...
- ప్రభుత్వం వీరి విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటుందో...!



మోర్తాడ్(బాల్కొండ): గల్ఫ్ దేశాల్లో పనిచేసే వలసకార్మికులు ఇప్పుడు పరేషాన్‌లో పడ్డారు. రేషన్‌కార్డుల్లో పేరు ఉన్న ప్రతి ఒక్కరు ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ సూచించిన విషయం తెలిసిందే. రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్ యంత్రంపై రేషన్ వినియోగదారులు వేలిముద్ర వేసి తమ ధృవీకరణ పూర్తి చేయాలి. రాష్ట్రంలోని వినియోగదారులు ఏ ప్రాంతంలో ఉన్నాసరే సొంతూరుకు వెళ్లకుండానే ఈకేవైసీ పూర్తి చేసే వెసులుబాటు కల్పించారు. పొరుగు రాష్ట్రాలు, విదేశాల్లో ఉన్నవారు మాత్రం స్వరాష్ట్రానికి వచ్చి ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ-కేవైసీ ప్రక్రియ ఇటీవలే ప్రారంభమైంది. అయితే దీనికి నిర్ణీత గడువు తేదీని మాత్రం ప్రభుత్వం నిర్ణయించలేదు. వీలైనంత త్వరగా రేషన్‌కార్డుల్లో పేర్లు ఉన్న వారితో ఈకేవైసీ పూర్తి చేయించాలని అధికారులు రేషన్‌డీలర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఒక కుటుంబంలోని సభ్యులు వేర్వేరు చోట్ల ఈకేవైసీ పూర్తి చేయించుకోవడానికి అవకాశముంది. ఈ విధానంతో పట్టణాలకు ఉన్నత చదువులకు వెళ్లినవారు, ఉపాధి పొందుతున్న వారు తాము ఉంటున్న పరిసరాల్లోనే ఈకేవైసీ పూర్తి చేయించుకోవచ్చు. కానీ గల్ఫ్‌తోపాటు ఇతర దేశాలకు వలస వెళ్లిన వారు ఇప్పట్లో వచ్చే అవకాశం లేకపోవడంతో వారి ఈకేవైసీ ఎలా అనే సంశయం నెలకొంది. పౌరసరఫరాల శాఖ నిబంధనల ప్రకారం ఈకేవైసీ చేయించుకోని వారి పేర్లు రేషన్‌కార్డుల నుంచి తొలగించే ప్రమాదముంది. విదేశాలకు వెళ్లినవారు సంవత్సరాల తరబడి స్వదేశానికి దూరంగానే ఉంటున్నారు. వారు వచ్చిన తర్వాతైనా ఈకేవైసీ చేయించుకోవచ్చా? అనే విషయంపై స్పష్టత లేకపోవడమే ఈ గందరగోళానికి కారణం. స్థానికంగా నివాసం ఉండనందుకు రేషన్‌బియ్యం కోటా తమకు దక్కకపోయినా ఇబ్బంది లేదని, రేషన్‌కార్డుల నుంచి పేర్లు తొలగించవద్దని అని వలస కార్మికులు వేడుకుంటున్నారు. ప్రభుత్వం ఏ సంక్షేమపథకం అమలు చేసినా రేషన్‌కార్డు ప్రామాణికంగా తీసుకుంటుంది. ఇలాంటి తరుణంలో తాము ఉపాధి కోసం సొంతూరిని విడిచి వేరే ప్రాంతానికి వెళ్లామని, రేషన్‌కార్డుల నుంచి పేర్లు తొలగిస్తే ఎలా అని వలస కార్మికులు ప్రశ్నిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్న తెలంగాణవాసుల సంఖ్య 15లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈకేవైసీ నిబంధనతో వలస కార్మికులు అధిక సంఖ్యలో నష్టపోయే ప్రమాదం ఉంది. వలస కార్మికుల అంశంపై తమకు ఎలాంటి స్పష్టత లేదని నిజామాబాద్ పౌర సరఫరాలశాఖ అధికారి చంద్రప్రకాశ్ 'సాక్షి'తో చెప్పారు. ఈకేవైసీ గడువు మూడు నెలల పాటు పొడిగించే అవకాశం ఉందన్నారు.

పేర్లు తొలగించకుండా స్టార్‌మార్క్ చేయాలి

ఈకేవైసీ పూర్తి చేయని వలస కార్మికుల పేర్లు రేషన్‌కార్డుల నుంచి తొలగించకుండా స్టార్‌మార్క్ చేయాలి. వారు సొంతూరికి వచ్చిన తర్వాత ఈకేవైసీ అవకాశం కల్పించాలి. వలస కార్మికుల పేర్లు రేషన్‌కార్డుల నుంచి తొలగిస్తే వారు ఏ ప్రభుత్వ పథకానికి అర్హులు కాకుండా పోతారు. ప్రభుత్వం పెద్ద మనసుతో అర్థం చేసుకోవాలి.

– మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు

సూర్య, చంద్ర ప్రభలపై కోనేటిరాయుడు



తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజైన ఆదివారం నాడు ఉదయం సూర్యప్రభపై ఊరేగుతూ మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి చంద్రప్రభపై చల్లని చంద్రకాంతుల్లో భక్తులను అనుగ్రహించారు. ఈ వాహన సేవల్లో భజన బృందాల కోలాహలం, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా భక్తులను ఆకట్టుకున్నాయి. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవంలో గరుడ సేవ తర్వాత అంత ప్రాధాన్యత కలిగిన వాహనంగా శ్రీవారి రథోత్సవాన్ని చెప్పవచ్చు. సోమవారం ఉదయం 6.55 గంటలకు మలయప్ప మహారథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై ఊరేగనున్నారు.

ఏసీబీ వలకు చిక్కిన మావల తహసీల్దార్

- పట్టా పాస్‌బుక్‌లో పేరు సవరణకు రూ.20 లక్షలు డిమాండ్
- రూ. 2 లక్షలు ముట్టజెబుతుండగా ఆర్‌ఐతో పాటు పట్టివేత
- ఆదిలాబాద్ జిల్లాలో ఘటన



రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మావల తహశీల్దార్ ఆరిఫా సుల్తాన, ఆర్‌ఐ హన్మంత్‌రావు

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ జిల్లా మావల తహసీల్దార్ ఆరిఫా సుల్తానా, ఆర్‌ఐ హన్మంత్‌రావు ఆదివారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. మావల పట్టణ శివారులోని వ్యవసాయ భూమికి సంబంధించిన పట్టా పాస్‌బుక్‌లో పేరు సవరణ కోసం రైతుల నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిజామాబాద్‌కు చెందిన నిర్మల్కర్ సుధాకర్ తోపాటు ఆయన కుటుంబీకులకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా మావల శివారు సర్వే నంబర్ 181లో 14 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఒక్కొక్కరి పేరిట మూడున్నర ఎకరాలు ఉన్నాయి. వీరు యతేంద్రనాథ్ యాదవ్‌ను రిప్రజెంటర్‌గా ఉంచారు. పట్టా పాస్‌బుక్‌లలో పేర్లకు సంబంధించి మార్పుల కోసం 2023, ఏప్రిల్ 13న మావల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ ఆరీఫా సుల్తానాను కలిసి పనులు పూర్తి చేయాలని విన్నవించారు. ఈ క్రమంలో ఆర్‌ఐ హన్మంత్‌రావు వారిని రూ.20 లక్షలు డిమాండ్ చేశాడు. మొదట రూ.2 లక్షలు ఇవ్వాలని సూచించగా, యతేంద్రనాథ్ ఈ నెల 21న ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో డబ్బులు ముట్టజెబుతుండగా ఏసీబీ అధికారులు తహసీల్దార్, ఆర్‌ఐలను పట్టుకున్నారు. వీరిని కరీంనగర్ ఏసీబీ కోర్టుకు రిమాండ్ కోసం తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు.

దళిత యువతిపై దాడి

- ప్రేమ పేరుతో వేధించి హత్యాయత్నం చేసిన యువకుడు
- జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతి
- ఆందోళనకు దిగిన దళిత సంఘాలు



జక్రాన్‌పల్లిలో ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

జక్రాన్‌పల్లి: ప్రేమ పేరుతో దళిత యువతిని వేధించి, హత్యాయత్నానికి పాల్పడ్డాడో యువకుడు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. జక్రాన్‌పల్లికి చెందిన దళిత యువతిని అదే గ్రామానికి చెందిన ఓ ముస్లిం యువకుడు కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. శనివారం రాత్రి ఆమెను బలవంతంగా తన బైక్‌పై ఎక్కించుకుని తీసుకువెళ్లాడు. ఈ క్రమంలో యువతి ప్రతిఘటించి బైక్‌పై నుంచి కిందకు దూకింది. దీంతో ఆగ్రహించిన సదరు యువకుడు మద్యం మత్తులో యువతిని కొట్టి రోడ్డు పక్కన పడేశాడు. ఆమెను గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది.

గ్రామంలో ఆందోళన..

యువతిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాత్రి దళిత సంఘాల ప్రతినిధులు, బాధిత యువతి కుటుంబ సభ్యులు గ్రామంలో కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. జక్రాన్‌పల్లి అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అర్హులకు దళిత బంధు ఇవ్వాలి

వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారిపై రాస్తారోకో

మోత్కూరు: అర్హులైన దళితులందరికీ దళిత బంధు ఇవ్వాలని కోరుతూ ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజిపురం గ్రామంలోని చౌరస్తాలో వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారిపై దళితులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దళితులు మాట్లాడారు. పేద దళితులను కాదని ఆర్థికంగా ఉన్నవారికి దళిత బంధు మంజూరు చేశారని ఆరోపించారు. ఒక కుటుంబంలో ముగ్గురు ఆడ కూతుళ్లను కలిగిన ఓ నిరుపేద దళిత కుటుంబానికి ఇవ్వక పోవడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వివాహం కాని యువకులకు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్హులైన వారికి దళిత బంధు ఇవ్వాలని ఆందోళనకు దిగితే పోలీస్ కేసులు బనాయిస్తున్నారని వాపోయారు. ఆందోళనలో బర్రె వెంకటయ్య, చింత నర్సయ్య, ఉప్పల నరేశ్, రాజు, మాతంగి నరేశ్, చలివేంద్ర అండాలు, మాతంగి ఎల్లమ్మ, కిష్టయ్య, మంజుల పాల్గొన్నారు.

పసి హృదయముంటేనే కవి

'అనితరుడు'పుస్తకావిష్కరణ సభలో గోరటి వెంకన్న



అనితరుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న, తదితరులు

కరీంనగర్‌కల్చరల్: పసి హృదయమున్నవాడు మానవవాద కవిగా విలసిల్లుతాడని ప్రజావాగ్గేయకారుడు, శాసనమండలి సభ్యుడు గోరటి వెంకన్న పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ రచయితల వేదిక (తెరవే) కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో కవి మువ్వా శ్రీనివాస్‌రావు రచించిన 'అనితరుడు'పుస్తకావిష్కరణ సభకు ఆయన హాజరయ్యారు. ధర్మాధర్మాలను కవులు ప్రజలకు బాధ్యతాయుతంగా వివరించాలని సూచించారు. పసితనం, ప్రజాక్షేత్రాలను వీడిన కవిలో సృజనాత్మకత సన్నగిల్లుతుందన్నారు. సున్నిత మనస్కుడైన కవిగా వైవిధ్యభరితమైన అభివ్యక్తితో మువ్వా శ్రీనివాస్‌రావు కవిలోకంలో వెలుగొందుతున్నారని అభినందించారు. కవి నగ్నముని మాట్లాడుతూ...తెలంగాణలో సాహిత్య కార్యక్రమాలకు కరీంనగర్ కేంద్రంగా వాసికెక్కుతుందన్నారు. 366 మంది 'విమర్శ వ్యాసా'లతో వెలువడిన ఈ పుస్తకం భావి పరిశోధకులకు దిక్సూచిగా ఉపయోగపడుతుందని తెలిపారు. వ్యాసాలు రాసిన నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, దామెర రాములు, గోపగాని రవీందర్, వెంకటేశ్వర్లు కె.అంజయ్యను జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ కీలక పాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి



పాల్గొన్న ఉపాధ్యాయులు

- యూనియన్ చొరవతోనే బదిలీ, పదోన్నతులు
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ కీలకపాత్ర పోషిస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. హాజీపూర్ మండలం వేంపల్లిలోని మంచిర్యాల గార్డెన్‌లో పీఆర్టీయూ మంచిర్యాల జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా యూనియన్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ పీఆర్టీయూ కృషితోనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. త్వరలోనే మల్టీజోన్-2లో కూడా ప్రారంభించేలా చూస్తామని తెలిపారు. పీఈటీలు, పండితులకు ఇదే షెడ్యూల్‌లో బదిలీలు, పదోన్నతులు జరిగేలా ఒత్తిడి తెస్తామని, ఎస్జీటీలకు కూడా న్యాయం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే రూ.40 లక్షల పరిమితితో ఈహెచ్‌ఎస్ కార్డులు అందనున్నాయని తెలిపారు. పీఆర్‌సీ చెల్లింపుల కోసం కమిటీ ఏర్పాటు చేయాలని, ఐఆర్ ఇచ్చేలా చూడాలని చేసిన వినతికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆ దిశగా కృషి చేస్తోందని వెల్లడించారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టేలా అధికారులు సహకరించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మాట్లాడుతూ, మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చి దిద్ది ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామన్నారు. గురుకులాలను ప్రారంభించడంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. సమావేశంలో భాగంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరించారు. సమావేశంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, గౌరవ అధ్యక్షురాలు బండ శాంకరి, ప్రతిక సంపాదక కార్యవర్గ సభ్యుడు రాసపల్లి రవి, బాధ్యులు ఉమాదేవి, ధనలక్ష్మి, సునీత, మాధుర్య, ప్రసాద్, విజయేందర్ రాజు, సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ రైతు వ్యతిరేక పార్టీలు

- వాస్తవిక ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలి
- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నర్సింహారెడ్డి

కరీంనగర్: దేశంలో అన్ని రకాల పంటలకు వాస్తవ పెట్టుబడి, రైతు కష్టానికి మిగలాల్సిన ఆదాయాన్ని పరిగణలోకి తీసుకొని, వాస్తవిక ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు ఉచితంగా అందించి, ఇన్‌పుట్ సబ్సిడీని పెంచాలని కోరారు. కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో మూడు రోజులుగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆయన హాజరై, మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్‌ఎస్‌లు పక్కా రైతు వ్యతిరేక పార్టీలని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు ఒక్కటే ఇచ్చి.. మిగిలిన రైతుల సౌకర్యాలను దూరం చేసిందన్నారు. దేశంలోని సాగు రంగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు, వ్యవసాయ కాంట్రాక్టీకరణ తీసుకొచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామని చెప్పి, ఎరువుల ధరలు పెంచుతూ సబ్సిడీకి కోత విధించిందన్నారు. వ్యవసాయాధారిత రంగాలను అభివృద్ధి చేయకుండా, పశు సంవర్థక శాఖను నిర్వీర్యం చేసి, సేంద్రీయ సాగు తీసుకురావాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. ఎఫ్‌సీఐ గోదాములను ప్రైవేటుపరం చేస్తూ సీసీఐకి ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించలేదన్నారు. ఈ విధానాల వల్ల దేశవ్యాప్తంగా 16 కోట్ల రైతాంగ ఆదాయానికి గండిపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వరి తప్ప మిగతా ఏ పంటలనూ ప్రోత్సహించడం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలను గుర్తించే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా రైతులను ముందుగా అలర్ట్ చేయని అసమర్థ పాలన సాగుతోందని మండిపడ్డారు. ఇప్పటికైనా స్వామినాథన్ కమిటీ సిఫారులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 200 రైతు సంఘాలు ఐక్యంగా ఢిల్లీలో సమావేశమై, ఉద్యమాలకు పిలుపునిచ్చాయని తెలిపారు. రాబోయే రోజుల్లో పోరాటాలకు రైతాంగం సిద్ధం కావాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు మిల్కూరి వాసుదేవరెడ్డి, ఎండీ.గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 అభ్యర్థులకు పరిహారం చెల్లించాలి

- ప్రజాస్వామ్యాన్ని సీఎం కేసీఆర్ ఖూనీ చేస్తున్నారు..
- 1న పాలమూరులో బహిరంగ సభకు రండి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



గణనాథునికి పూజలు చేస్తున్న ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: ఓట్ల కోసం సీఎం కేసీఆర్ ఎంతకైనా దిగజారతారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. ఉప ఎన్నికల్లో ఒక్కో ఓటుకు రూ.10 వేల దాకా పంచి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కేసీఆర్.. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని తెలిసి ఓటర్లకు గాలం వేసేందుకు గణేశ్ మండపాలకు దొంగచాటుగా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని అన్నారు. ఆదివారం కరీంనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీలు, బస్తీల్లో పర్యటించారు. స్థానిక బీజేపీ నాయకులతో కలిసి గణేశ్ మండపాలను సందర్శించి, గణనాథునికి పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్కాంలు, స్కీంలు తప్ప కేసీఆర్ పాలనలో సాధించేదేమిటని ప్రశ్నించారు. పదేళ్లుగా ఒక్క గ్రూప్ పోస్టును కూడా భర్తీ చేయలేదని, రెండుసార్లు గ్రూప్–1 పరీక్ష రద్దు చేసి, లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకున్నారని మండిపడ్డారు. బాధితులకు ఒక్కొక్కరికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని, వయో పరిమితిని సడలించి, మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం 2019 నుంచి ఇప్పటివరకు నిరుద్యోగ భృతి ఒక్కొక్కరికి రూ.1.80 లక్షలు చెల్లించాలన్నారు. అలాగే అనేక అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల 1న రాష్ట్రానికి వస్తున్నారని, ఆరోజు మహబూబ్‌నగర్‌లో నిర్వహించే విజయ సంకల్ప సభకు భారీ ఎత్తున తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు.

ధర్మపురి నృసింహుడు మా ఇలవేల్పు

- ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు



స్వామివారి సన్నిధిలో దిల్ రాజు దంపతులు

ధర్మపురి: ధర్మపురి నృసింహుడు తమ ఇలవేల్పు అని ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు అన్నారు. ఆదివారం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి క్షేత్రాన్ని సందర్శించారు. ముందుగా ప్రధాన ఆలయమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రెనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డిలు దిల్ రాజు దంపతులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, ఫొటో బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఇంటి ఇలవేల్పు అయిన ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహుడి సన్నిధిలో కుమారుడి తలనీలాలు సమర్పించామని తెలిపారు. ఏటా ఈ స్వామివారి దర్శనానికి వస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, బీఆర్‌ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు ఆకుల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బెర్లిన్ మారథాన్‌లో కుమురంభీం ఎస్పీ

- 5.30 గంటల్లో రేసు పూర్తి
- భార్యతోపాటు పాల్గొన్న సురేశ్‌కుమార్



జాతీయ జెండాతో ఎస్పీ దంపతులు

సాక్షి, ఆసిఫాబాద్: జర్మనీ రాజధాని బెర్లిన్‌లో ఆదివారం జరిగిన మారథాన్‌లో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ భార్య సంధ్యతో కలిసి పాల్గొన్నారు. నిర్దేశిత సమయానికి ముందే రేసు పూర్తి చేశారు. ఎస్పీ దంపతులు 42.195 కిలోమీటర్ల(26 మైళ్ల 385 గజాలు) దూరాన్ని పరుగు లాంటి నడకతో 5.30 గంటల వ్యవధిలో పూర్తి చేశారు. 2009లో పోలీసు శాఖలో చేరిన సురేశ్‌కుమార్ తొలుత కిలో మీటరుతో సాధన మొదలెట్టారు. తర్వాత అంచలంచెలుగా దూరాన్ని పెంచుకుంటూ పోయారు. వివాహం అయ్యాక భార్య సంధ్యతో కలిసి మారథాన్ సాధన కొనసాగించారు. మారథాన్‌లో పాల్గొని రాష్ట్రానికి పేరు తెచ్చిన ఎస్పీ దంపతులను పోలీసు శాఖ అభినందించింది.

హైదరాబాద్ చాప్టర్ కౌన్సిల్ చైర్మన్‌గా ప్రభాకర్‌రావు



ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న సభ్యులు

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో ఎస్‌ఓటూ సీటీసీగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.ప్రభాకర్‌రావు హైదరాబాద్ చాప్టర్ కౌన్సిల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇండియన్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇండస్ట్రీయల్ ఇంజినీరింగ్ హైదరాబాద్ చాప్టర్ కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐఐఈ హైదరాబాద్ చాప్టర్ కౌన్సిల్ సభ్యులు నూతన కౌన్సిల్‌ను నియమించారు. ఇందులో చాప్టర్ కౌన్సిల్ చైర్మన్‌గా ప్రభాకర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభాకర్‌రావును సభ్యులు శాలువాతో సత్కరించారు. ఎస్టీపీపీ అధికార బృందం ప్రభాకర్‌రావుకు శుభాకాంక్షలు తెలిపింది.

బాసర సరస్వతీదేవిని దర్శించుకున్న ఏపీ మంత్రి జయరామ్



మనువడి అక్షరాభ్యాసం చేయిస్తున్న మంత్రి

భైంసా: నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆదివారం బాసర చేరుకున్న మంత్రి తన మనువడు ఇషన్‌సాయితో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అమ్మవారి ఆలయంలో విశిష్ట పూజలు చేయించారు. ప్రధాన అర్చకులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

నేడు జోనల్‌స్థాయి జూడో ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: పట్టణంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి జూడో ఎంపిక పోటీలు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు వివిధ కేటగిరీల్లో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. అర్హులైన క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో నేడు ఉదయం 10 గంటలకు స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 99666 84201 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



సర్టిఫికెట్ అందుకుంటున్న హెల్త్ ఎడ్యుకేటర్ రేష్మా

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ సైకాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో సెమినార్ నిర్వహించారు. ఇందులో కరీంనగర్ వైద్య, ఆరోగ్య శాఖ హెల్త్ ఎడ్యుకేటర్ రేష్మా ఆత్మహత్యల నివారణ అనే అంశంపై ప్రసంగించి, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి చేతులమీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను తెలంగాణ సైకాలజీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోత్కూర్ రామచంద్రం, కరీంనగర్ వైద్య కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అగస్టీన్ అభినందించారు.

వాగ్గేయకార వైభవం


శాంతం-సంగీతం

వాగ్గేయకారులైన వారు రచించిన గీతాలు మహాకవులయిన ఇతరులు రచించిన పద్యాల సందర్భాల్లాగే ఉంటాయి. శివలింగం అంటే శివుడితో మాట్లాడుతున్నట్లే, ఇది విగ్రహం కాదు రాముడే, ఇది శిల కాదు.. అక్కడ ఉన్నది కామాక్షియే, అది మూర్తి కాదు సాక్షాత్ కృష్ణ పరమాత్ముడే.. అని పరవశాన్ని పొంది లోపలి భావాలను గీతాలుగా స్వరయుక్తంగా ప్రవహింపచేశారు. అవి అజరామరమై ఎన్ని శతాబ్దాలు గడిచినా రామాయణ, భారత, భాగవతాల్లాగే ఉండిపోతున్నాయి.

వారికి అనేక శాస్త్రాల్లో నిష్ఠ ఉండేది. త్యాగరాజ స్వామివారి ''మా జానకిచేతపట్టగ..' కీర్తననే చూడండి.రామాయణాన్ని భవిష్యపురాణంతో కలిపారు. రామావతారంలోంచి శ్రీవేంకటేశ్వర అవతారం లోకి వెళ్ళింది. అంటే వారికి సమస్త పురాణేతిహాసాలు, వేదవేదాంగాలు సప్తధాతువుల్లో జీర్ణమయిపోయాయి. అన్ని సంగీత పరికరాల్లోకి అత్యంత ప్రధానమైన నాదోపాసనకు సాధనమైన వీణ మీద వీరు అధికారం పొందారు. ''వీణావాదనతత్త్వజ్ఞః శృతిజాతి విశారదః తాళజ్ఞశ్చాప్రయాసేన మోక్షమార్గం సగచ్ఛతి'' ఎవరయితే ఆ వీణావాద తత్త్వాన్ని, నాదోపాసన చేయగలిగిన స్థితిని పొంది ఉన్నారో, సంగీతంలో ఉన్న అన్ని శబ్దాల


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

గురించి పరిపూర్ణ జ్ఞానాన్ని పొంది ఉన్నారో, తాళం వినగానే తాళ లక్షణాల గురించి చెప్పగలరో వారు మోక్షమార్గంలో పోతున్నారనడం నిస్సందేహం. అంటే భారతీయ సంగీతం మోక్షానికి కారణం. త్యాగయ్య, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి, రామదాసు, అన్నమాచార్యులూ ఆ స్థితినే పొందారు. కేవలం మనోరంజకత్వం కాదు, భగవంతునిలో ఐక్యమయిపోవడానికి దివ్యసాధనంగా మనకు ఆ సంగీతాన్ని పవిత్రమైన వస్తువుగా, గంగాజల భాండంగా, ఆవుపాల కుండగా అందించారు. వారి సంగీతం ఎంత గొప్పగా ఉంటుందో, సాహిత్యం కూడా అంత గంభీరంగా ఉంటుంది. వీరిలో మరో విశేషం కనపడుతుంది. అది సర్వకాల సర్వావస్థల్లో పరమ ప్రశాంతంగా ఉండగలిగిన స్థితి. మనం ఎంత సాధన చేసినా, ఏ యజ్ఞయాగాదులు, జపాలు, పూజలు చేసినా ఎక్కడో ఒకచోట శాంతం తప్పుతాం. అందుకే త్యాగరాజస్వామి అంటారు...'శాంతము



లేక సౌఖ్యము లేదు...' అని. శాంతం అంటే రాగద్వేషాలు లేకుండా ఉండడం. నాకిది కావాలని కానీ, నాకు వారంటే కోపం అని కానీ, వీరంటే చికాకని కానీ ఉండదు. ఎవరిమీదా ప్రేమా ఉండదు, ద్వేషం ఉండదు. రాగద్వేషా లు లేకుండా ఎలా ..? అమ్మ ఈ రెండే పట్టుకుని ఉంటుంది.''రాగ స్వరూప పాశాఢ్య క్రోధాంకారేంమేశోజ్వలా..'' నన్ను ఉపాసన చేయగా చేయగా నీకున్న రాగం అన్న పాశం తీసి భక్తి అన్న పాశం వేసి నా దగ్గరకు లాక్కుంటాను... అంటుంది. అంకుశం పెట్టి పొడిస్తే ఏనుగు ఎంత బాధ పడుతుందో తన కోపం తన శత్రువయి అంత బాధ పెడుతుంది. అందువల్ల రాగద్వేషాలు లేని ప్రశాంత స్థితిని పొందాలి. సాధన చేస్తున్నప్పుడు ఈ స్థితిని కొంతవరకే పొందగలం. కానీ ఎప్పుడూ అలా ఉండడం అంత సులభం కాదు. దానిని సాధ్యం చేసేది ఒక్క సంగీతం మాత్రమే. అలా సాధ్యం చేసి చూపారు మనకు వాగ్గేయకారులు.

బౌద్ధవాణి

ఉభయ శ్రేయస్సు

అది చంపానగర సమీపంలో ఉన్న గర్గరా పుష్కరిణీ తీరం. ఆ పుష్కరిణి దక్షిణపు ఒడ్డున సువిశాలమైన మర్రిచెట్టు. ఆ చెట్టుకింద బుద్ధుడు తన భిక్షు సంఘంతో కూర్చొని ఉన్నాడు. ఆ సమయంలో ఏనుగులకు శిక్షణ ఇచ్చే పేస్సుడు, కందరకుడు అనే పరివ్రాజకుడు ఇద్దరూ వచ్చారు. వారు వచ్చి మౌనంగా ఒకపక్క కూర్చున్నారు. కొంతసేపటికి బుద్ధుని ప్రబోధం ముగించాడు. అప్పుడు వారిద్దరూ బుద్ధుని దగ్గరకు వెళ్ళారు. కొన్ని అనుమానాలు అడిగి నివృత్తి చేసుకున్నారు.



అప్పటికి చాలా సమయం గడిచింది. భిక్షుసంఘం అంతసమయం నిశ్శబ్దంగానే ఉండటం చూసి వారిద్దరూ ఆశ్చర్యపడ్డారు.

వారు అనేక ఇతర పరివ్రాజక సంఘాల్ని చూశారు. గురువులు చెప్పే సందేశాలు ముగిశాక గానీ ఇంత ప్రశాంతత కానరాదు. ఎవరో ఒకరు మాట్లాడుకుంటూనో, గుసగుసలాడుకుంటూనో, గొణుక్కుంటూనో ఉంటారు. ఆ గురువులు 'నిశ్శబ్దం నిశ్శబ్దం' అని అరుస్తూనే ఉంటారు. కానీ ఇక్కడ అలాంటిదేమీలేదు. ఎవ్వరూ అసహనంగా లేరు. ఇతరుల్ని సహనాన్ని చెడగొట్టడం లేదు. తాము బాధపడటం లేదు, ఇతరుల్ని బాధపెట్టడం లేదు.

అప్పుడు కందరకుడు ''భగవాన్! విచిత్రం! మనుషుల ప్రవర్తన రకరకాలుగా ఉంటుంది. కానీ, ఇక్కడ అందరూ ఒకే శ్రద్ధతో ఉన్నారు'' అని ఆశ్చర్యంగా అడిగాడు. అప్పుడు బుద్ధుడు–

''కందరకా! మనుషుల్లో ముఖ్యంగా తాపసుల్లో నాలుగు రకాల వారు ఉంటారు. మొదటి రకం వారు, తమని తామే బాధించుకుంటారు. తాము బాధపడుతూ తమ శరీరాల్ని అతిగా బాధలకి గురిచేస్తారు. నిరాహారంతో శుష్కింపచేస్తారు. అతి చలికి, అతి వేడిమికి గురిచేస్తారు. తినకూడని పదార్థాల్ని తింటారు. అలా తమని తాము శిక్షించుకోవడమే సరైన శిక్షగా భావిస్తారు. ఇంకొందరు ఇతరుల్ని బాధించి తాము సుఖంగా బతకాలనుకుంటారు. దొంగలూ దోపిడీదారులు, ఇతర జీవుల్ని పట్టి చంపి వాటి మాంసాన్ని అమ్మేవారు. ఇలా పరుల్ని నష్టపరచి తాము లాభాలు పొందాలనుకునే వారంతా ఈ కోవలోకి వస్తారు. అలాగే తాము దుఃఖపడుతూ ఇతరుల్ని దుఃఖపరిచే వారు మూడోరకం. ఒక మహారాజు గొప్ప యజ్ఞం చేయాలనుకుంటాడు. దాని నిర్వహణ కోసం ఎంతో సొమ్ము... ఎన్నో జంతువులూ కావాలి. కాబట్టి ఆజ్ఞలు జారీ చేస్తాడు. ఆ ఆజ్ఞల్ని అమలు చేయడానికి ఉద్యోగుల్నీ, సైనికుల్నీ నియమిస్తాడు. వారు గ్రామాల మీద పడి పేద ప్రజల నుండి, సామాన్య రైతుల నుండి పశువుల్ని, డబ్బుల్నీ బలవంతాన లాక్కు వస్తారు. అలా వారు తమకి ఇష్టం లేకపోయినా బాధపడుతూనే... బలవంతంగా ఆ పనులు చేస్తారు. తాము బాధపడుతూ, ఇతరుల్నీ బాధపెడతారు.''

ఇక కొందరు తమ శరీరాన్ని, తమ మనస్సునీ తాము బాధించుకోరు. తమ సుఖం కోసం పరుల్నీ బాధించరూ– ఇలాంటి వారు స్వీయ క్రమశిక్షణతో నడుచుకుంటారు. అలా ఉంటే ఆ వినేది తామూ శ్రద్ధతో వింటారు. పక్కనున్న వారినీ విననిస్తారు. అది ఉభయులకీ శ్రేయస్సునిస్తుంది. నా భిక్షువులు అలాంటి వారు'' అన్నాడు బుద్ధుడు. శ్రద్ధ, స్వీయక్రమశిక్షణ ఎంత అవసరమో వారికర్థమయ్యింది. ఇద్దరూ బుద్ధునికి ప్రణమిల్లి ''మమ్మల్ని, మీ సంఘంలో చేర్చుకోండి'' అని ప్రార్థించారు. బుద్ధుడు అంగీకరించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

మంచిమాట

సత్సాంగత్యం

ఏమీ చదువుకోక పోయినా, విద్యాగంధం ఏ మాత్రం లేక పోయినా కొంత మంది మాటలు పండితులకే ఆశ్చర్యం కలిగిస్తాయి. వారు ఉంటున్న, లేదా పని చేస్తున్న ప్రదేశంలో ఉన్న వాతావరణం ప్రభావం అది. అందరు వైద్యులే ఉన్న కుటుంబంలో ఉన్న పిల్లలు అప్రయత్నంగా వైద్య పరిభాషని ఉపయోగించటం, సంగీత విద్వాంసుల కుటుంబంలో వారి పిల్లలు రాగాలని గుర్తు పట్టటం వంటివి మనం చూస్తూనే ఉంటాం కదా! అదంతా సాంగత్య ప్రభావం.



ఒక వ్యక్తి నిత్యం ఎవరితో ఎక్కువగా కలిసి ఉంటే వారి ప్రభావం వల్ల కొన్ని లక్షణాలు సంక్రమిస్తాయి. మంచివారితో కలిసి ఉంటే సహజంగా దురాలోచన ఉన్న వ్యక్తి అయినా కొంత వరకు చెడు ప్రవర్తనకు దూరంగా ఉండటం జరుగుతుంది. దుర్మార్గుల సాహచర్యంలో ఉంటే చెడ్డపనులు చేయక పోయినా ఆమోదించటం, అనుమోదించటం జరుగుతుంది. కనుకనే ఎవరితో ఎక్కువ సమయం గడుపుతున్నాము... అన్న దానిని గమనించుకుంటూ ఉండాలి. కొన్ని ప్రభావాలు తాత్కాలికం. మందారపువ్వు పక్కన ఉన్న గాజుపట్టకం లాగా. పువ్వుని అక్కడి నుండి తీసేయగానే అప్పటి వరకు ఎర్రగా కనపడిన గాజుపట్టకం తన సహజ వర్ణానికి వచ్చేస్తుంది. కొన్నిటిని తప్పించుకోవటం కష్టం. మరికొన్నిటి ప్రభావం శాశ్వతం. స్వభావంలో జీర్ణించుకుపోతాయి. శక్తివంతమైన చెడు ప్రభావాల నుండి తప్పించుకోవటానికి మార్గం దూరంగ ఉండటమే. ''దుష్టుడికి దూరంగా ఉండ''మని పెద్దలు చెప్పిన మాట ఇందుకోసమే. మరి కొన్నిటి ప్రభావం ఆ పట్టకం పైన రంగులని పూసినట్టు. గట్టిగా తుడిచినా, నీళ్ళతో కడిగినా సహజ స్థితికి వస్తుంది. అదే, పట్టకం తయారు అయే సమయంలో ద్రవ స్థితిలో ఉండగానే ఏదైనా రంగు కలిపితే అది శాశ్వతంగా ఉండిపోతుంది.

అందుకే మంచివారి సాంగత్యంలో ఎంత వీలైతే అంత ఎక్కువ సమయం గడిపే ప్రయత్నం చేయాలి. స్వభావ సిద్ధంగా దుర్బుద్ధి అయిన ధృతరాష్ట్రుడు ఉత్తమ గతులు పొందటానికి కారణం ఎంతో సమయం విదురుడి సమక్షంలో గడపటమే. మనసు బాగుండనప్పుడు విదురుడిని పిలిపించుకొని అతడి సమక్షంలో కాలం గడిపేవాడు. శాశ్వతంగా కాకపోయినా విదురుడు మాట్లాడినంత సమయం ధృతరాష్ట్రుడు సదాలోచనలతోనే ఉన్నాడు. కనీసం దురాలోచనలు చేయకుండా ఉన్నాడు కదా! పూలు మాల కట్టిన దారానికి ఆ పూల పరిమళం అంటుకు పోతుంది.

ఒకరి ప్రభావం మరొకరి మీద ఉండటం ఎట్లా కుదురుతుంది? అనే దానికి సాన్నిధ్యంలో ఉండటమే కారణం అన్నది సమాధానం. ఇనుము అయస్కాంత సన్నిధిలో కొంతకాలం ఉండగా ఉండగా దాని లక్షణాలు ఇనుముకి రావటం చూస్తున్నాముగా!

ఆయుధాన్ని దగ్గర ఉంచుకున్న మునిలో హింసాప్రవృత్తి క్రమంగా పెంపొందిన ఇతివృత్తాన్ని సీత రాముడికి చెప్పింది. అదే విధంగా బోయల మధ్య పెరిగిన ప్రచేతసుడనే ముని కుమారుడు బోయవాడుగా మారటం మనకి తెలుసు.

ఇది పైకి కనిపించే అర్థం. అసలు అర్థం మరొకటి ఉన్నదని పెద్దలు చెపుతూ ఉంటారు. 'సత్' అంటే ఉన్నది, సత్యము అని కూడా అర్థాలున్నాయి. 'సత్' అంటే భగవత్తత్త్వం. ఆ సత్ (వేదాంతులు సత్తు అని అంటూ ఉంటారు) తో సాహచర్యం చేస్తూ ఉండటం. అంటే నిరంతరం దైవచింతనలో ఉండటం. అట్లా కుదురుతుందా? అంటే అందరినీ దైవస్వరూపులుగా భావిస్తే అదెంతపని?

'సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం, నిర్మోహత్వే నిశ్చల తత్త్వం, నిశ్చల తత్త్వే జీవన్ముక్తిః' అన్నారు ఆది శంకరులు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చాలా మంది పాల్గొంటారు. వీరిలో ఒకరికైనా సద్బుద్ధి కలిగిందని చెప్పగలరా? అంటూ విమర్శిస్తూ ఉంటారు కొందరు. వారికి సద్బుద్ధి కలిగిందో లేదో మనకి అనవసరం. కాని, ఆ కార్యక్రమంలో ఉన్నంత కాలం దురాలోచనలు లేక ఉంటారు. అది గొప్ప ప్రయోజనమే కదా! తరువాత అది నెమ్మదిగా మిగిలిన సమయాలకి కూడా విస్తరించే అవకాశం ఉంది. పూలు మాల కట్టిన దారం పువ్వుగా మారక పోవచ్చు కాని పూలవాసనని మాత్రం సంతరించుకుంటుంది.

– డా. ఎన్.అనంతలక్ష్మి

సినిమా

అక్టోబరులో మళ్లీ ఆరంభం


● రామ్‌చరణ్

రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'గేమ్ చేంజర్'. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి, సునీల్, నవీన్ చంద్ర, ఎస్‌జే సూర్య, జయరాం కీలక పాత్రలు పోషిస్తున్నారు. కాగా 'గేమ్‌చేంజర్' తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల 20 నుంచి ప్లాన్ చేశారు. అయితే ఈ షెడ్యూల్ రద్దు అయ్యింది. ''గేమ్‌చేంజర్'లోని కొందరు ఆర్టిస్టులు షూటింగ్‌కు అందుబాటులో లేని కారణంగానే ఈ నెలలో జరగాల్సిన షూటింగ్ రద్దు అయింది. అక్టోబర్ రెండో వారంలో తిరిగి షూటింగ్‌ను స్టార్ట్ చేస్తాం'' అని చిత్రయూనిట్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ సినిమాకు సంగీతం: తమన్

లక్కీ భాస్కర్ షురూ


● దుల్కర్ సల్మాన్‌పై క్లాప్ ఇస్తున్న దృశ్యం

'మహానటి, సీతారామం' వంటి హిట్ చిత్రాల తర్వాత దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న స్ట్రయిట్ తెలుగు చిత్రం 'లక్కీ భాస్కర్' షురూ అయింది. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి హీరోయిన్. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ''ఒక సాధారణ మనిషి ఉన్నత శిఖరాలకు చేరిన అసాధారణమైన ప్రయాణంగా 'లక్కీ భాస్కర్' రూపొందుతోంది. 'సార్' (తమిళంలో 'వాతి') చిత్రం తర్వాత వెంకీ అట్లూరితో మేము నిర్మిస్తున్న రెండో పాన్ ఇండియా చిత్రం 'లక్కీ భాస్కర్'. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: నిమిష్ రవి, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్.

యాక్షన్.. ఎమోషన్

వరుణ్ ధావన్ హీరోగా తమిళ దర్శకుడు కాలిస్ ఓ సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కీర్తీ సురేష్, వామికా హీరోయిన్స్‌గా నటిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ముంబైలో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్ చిత్రీకరణ అక్టోబరు రెండో వారం వరకూ సాగుతుందట. వరుణ్, కీర్తీ కాంబోలో కొన్ని భావోద్వేగ సన్నివేశాలతో పాటు, వరుణ్‌తో ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట కాలిస్. కీర్తిసురేష్‌కు బాలీవుడ్‌లో ఇదే తొలి చిత్రం. ఈ సినిమాను దర్శకుడు అట్లీ నిర్మిస్తున్నారు. అయితే అట్లీ దర్శకత్వంలోని తమిళ హిట్ 'తేరీ' హిందీ రీమేక్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోందనే టాక్ కూడా బాలీవుడ్‌లో వినిపిస్తోంది.


● వరుణ్ ధావన్


● కీర్తి సురేష్

ఇటలీలో ఆటాపాటా


● గోపీచంద్

గోపీచంద్ ఇటలీకి మకాం మార్చారు. శ్రీనువైట్ల దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. చిత్రాలయం స్టూడియోస్ పతాకంపై వేణు దోనెపూడి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఆదివారం (సెప్టెంబరు 24) శ్రీనువైట్ల బర్త్ డే. ఈ సందర్భంగా ఇటలీలో శ్రీనువైట్ల అండ్ టీమ్ లొకేషన్స్‌ను ఫైనలైజ్ చేస్తున్న వీడియోను చిత్రయూనిట్ విడుదల చేసింది. నేటి నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ సౌత్ ఇటలీలోని మాంటెరా లొకేషన్స్‌లో ప్రారంభం కానుంది. మేజర్ షూటింగ్‌ను విదేశాల్లోనే కంప్లీట్ చేస్తారట చిత్రయూనిట్. గోపీచంద్‌పై ముందుగా ఓ యాక్షన్ సీన్‌ను ప్లాన్ చేశారట శ్రీనువైట్ల. ఆ తర్వాత ఓ పాటని కూడా చిత్రీకరించనున్నారని భోగట్టా. ఈ చిత్రంలో కావ్యాథాపర్ హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం సాగుతోంది. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుంది.

ఘనంగా పరిణీతి చోప్రా పెళ్లి

బాలీవుడ్ హీరోయిన్ పరిణీతి చోప్రా పెళ్లి పీటలెక్కారు. ఆప్ (ఆమ్ ఆద్మీ పార్టీ) ఎంపీ రాఘవ్ చద్దాతో ఆదివారం ఆమె ఏడడుగులు వేశారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ లీలా ప్యాలెస్‌లో వీరి పెళ్లి వేడుక ఆదివారం సాయంత్రం 6: 30 నిమిషాలకు ఘనంగా జరిగింది. మూడు రోజులుగా జరుగుతున్న వీరి పెళ్లి వేడుక అత్యంత వైభవంగా కొనసాగింది. ఇందులో భాగంగా శనివారం రాత్రి సంగీత్, ప్రీ-వెడ్డింగ్ నిర్వహించారు. ఆదివారం 6:30గంటలకు వివాహం జరిగింది. వీరిద్దరి వివాహానికి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, సానియా మీర్జా, హర్భజన్ సింగ్, మనీష్ మల్హోత్రా, ఆదిత్య ఠాక్రేతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. అయితే ఈ పెళ్లికి పరిణీతి చోప్రా సోదరి, హీరోయిన్ ప్రియాంక చోప్రా మాత్రం హాజరు కాలేదు. కానీ, ఆమె తల్లి డాక్టర్ మధు చోప్రా హాజరయ్యారు. ఈ నెల 30న చండీగఢ్‌లో పరిణీతి–రాఘవ్ చద్దాల వివాహ రిసెప్షన్ జరగనుందట. కాగా రాఘవ్, పరిణీతి ఒకే పాఠశాలలో చదువుకోవటం విశేషం.


● రాఘవ్ చద్దా, పరిణీతి చోప్రా

వినోదాల కుటుంబం


● మేఘా ఆకాశ్, రామ్‌కిరణ్

రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా 'సఃకుటుంబనాం' చిత్రం ప్రారంభమైంది. ఉదయ్ శర్మ దర్శకత్వంలో హెచ్ఎన్‌జీ మూవీస్ పతాకంపై హెచ్.మహాదేవ్ గౌడ, హెచ్.నాగరత్నం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరో, హీరోయిన్‌లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి కొరియోగ్రాఫర్ చిన్నిప్రకాష్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత ఏఎం రత్నం క్లాప్ ఇవ్వగా, ఉదయ్‌శర్మ దర్శకత్వం వహించారు. ''వినోదాలు పంచే చక్కని కుటుంబ కథా చిత్రమిది'' అన్నారు ఉదయ్ శర్మ. ''ఈ చిత్రంలో నా పాత్ర పేరు సిరి.. నాకు బాగా నచ్చిన పాత్ర ఇది'' అన్నారు మేఘా ఆకాష్. ''అన్ని భావోద్వేగాలు ఉన్న చాలా శక్తివంతమైన కథ ఇది'' అన్నారు రామ్‌కిరణ్. ''కొత్త కథాంశంతో రూపొందుతున్న మా చిత్రం అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అని హెచ్.మహాదేవ్ గౌడ, హెచ్.నాగరత్నం అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, కెమెరా: మధు దాసరి, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: రోహిత్ పద్మనాభం.

సూర్యపుత్రన్ కర్ణన్

భారతీయ ఇతిహాసం మహాభారతం ఆధారంగా దాదాపు ఐదు సంవత్సరాల క్రితం విక్రమ్ హీరోగా ఆర్ఎస్ విమల్ దర్శకత్వంలో 'సూర్యపుత్రన్ కర్ణన్' అనే సినిమా ప్రకటన వెల్లడైన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ సినిమాని దాదాపు మూడొందల కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తారనే ప్రచారం అప్పట్లో సాగింది. కానీ వివిధ కారణాల వల్ల ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఇంకా ప్రారంభం కాలేదు. అయితే 'సూర్యపుత్రన్ కర్ణన్' సినిమా 'రోలింగ్ సూన్'(త్వరలో చిత్రీకరణ ప్రారంభం అవుతుందన్నట్లుగా..) అంటూ కర్ణుడి పాత్రలో ఉన్న విక్రమ్ ఫోటోను షేర్ చేశారు విమల్. అలాగే ఈ సినిమా టీజర్ అంటూ మరో వీడియోను ఆదివారం షేర్ చేశారాయన. మరి... ఈ మూవీకి ఉన్న అడ్డంకులు తొలగినట్లేనా? త్వరలోనే షూటింగ్ ప్రారంభం అవుతుందా? వేచి చూడాలి.


● విక్రమ్

రీల్స్

సంక్రాంతికి అయలాన్


● శివ కార్తికేయన్


శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్ సింగ్ జంటగా ఆర్.రవికుమార్ దర్శకత్వంలో రూపొందిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'అయలాన్'. కోటపాడి జె.రాజేష్, ఆర్‌డీ రాజా నిర్మించిన ఈ సినిమాను సంక్రాతికి విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు వెల్లడించారు. ''అయలాన్ అంటే ఏలియన్ అని అర్థం. ఈ ప్రయాణంలో మాకు కొన్ని కష్టాలు ఎదురైనప్పటికీ ధైర్యం కోల్పోకుండా, పట్టుదలతో ఈ సినిమా చేశాం. నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడాలనుకోవడం లేదు. అందుకే సినిమా విడుదల కొంత ఆలస్యం అవుతోంది. మా మూవీలో 4500 సీజీ షాట్స్ ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో మా మూవీ రిలీజ్ కానుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.

వైవిధ్యమైన కథ


● సుమన్

నటుడు సుమన్ ప్రధాన పాత్రలో మునిప్రసాద్ దర్శకత్వం వహించిన చిత్రం 'సిర్నాపల్లి సంస్థాన్'. మనోహర్, శ్రీనివాస్, జ్యోతీసింగ్, శృతీ పాండే హీరోహీరోయిన్లుగా నటించారు. కృష్ణకాంతి క్రియేషన్స్‌లో మంచాల రమేశ్ యాదవ్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. మంచాల రమేశ్ యాదవ్ మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రం 'సిర్నాపల్లి సంస్థాన్'. మునిప్రసాద్ చక్కగా తీశారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలో సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వేల్ మురుగన్, సంగీతం: ఏలేందర్.

రాయలసీమ నేపథ్యంలో...


● రవి, విషిక

రవి మహాదాస్యం, విషిక లక్ష్మణ్ జంటగా రాజశేఖర్ సుద్మూన్ దర్శకత్వం వహించిన చిత్రం 'సగిలేటి కథ'. హీరో నవదీప్ సి–స్పేస్ సమర్పణలో దేవీ ప్రసాద్ బలివాడ, అశోక్ మిట్టపల్లి నిర్మించారు. ఈ సినిమాను అక్టోబరు 6న విడుదల చేస్తున్నట్లు యూనిట్ వెల్లడించింది. ''రాయలసీమ పల్లెటూరి నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం, కెమెరా, ఎడిటింగ్: రాజశేఖర్ సుద్మూన్, సంగీతం: జశ్వంత్ పసుపులేటి, నేపథ్య సంగీతం: సనల్ వాసుదేవ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నరేష్ మాదినేని, లైన్ ప్రొడ్యూసర్: చందు కొత్తగుండ్ల.

సుర సుర సుర అసుర!


● ప్రభాకర్

'బాహుబలి' ఫేమ్ ప్రభాకర్ ప్రధాన పాత్రలో పాలిక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రౌద్ర రూపాయ నమః'. రావుల రమేష్ నిర్మించారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ని, చిత్రంలోని మొదటి లిరికల్ (సుర సుర సుర అసురసురసుర...) వీడియోను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేసి, ఈ చిత్రం విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాని త్వరలో విడుదల చేస్తాం'' అన్నారు రావుల రమేష్. ''మా చిత్రానికి జాన్ భూషణ్ సంగీతం, సురేష్ గంగుల సాహిత్యం బాగా కుదిరాయి'' అని పాలిక్ అన్నారు.



హంపి, హారిక శుభారంభం

ఆసియా క్రీడల మహిళల చెస్ ఈవెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక శుభారంభం చేశారు. ఆదివారం జరిగిన రెండు గేముల్లోనూ హంపి, హారిక తమ ప్రత్యర్థులను ఓడించారు. తొలి రౌండ్ గేముల్లో హంపి 62 ఎత్తుల్లో మోబినా (ఇరాన్)పై, హారిక 65 ఎత్తుల్లో అలాలీ రూడా (యూఏఈ)పై... రెండో రౌండ్ గేముల్లో హంపి 35 ఎత్తుల్లో ఫామ్ లె థావో (వియత్నాం)పై, హారిక 57 ఎత్తుల్లో కియాన్‌యున్ గాంగ్ (సింగపూర్)పై గెలుపొందారు. రెండు రౌండ్ల తర్వాత హారిక, హంపి, హు ఇఫాన్ (చైనా), ఉమిదా (ఉజ్బెకిస్తాన్) రెండు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు. పురుషుల విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తొలి గేమ్‌లో పాలో బెర్సామినా (ఫిలిప్పీన్స్)పై గెలిచి, రెండో గేమ్‌ను లె తువాన్ మిన్ (వియత్నాం)తో 'డ్రా' చేసుకున్నాడు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ విదిత్ తొలి గేమ్‌లో ఫహాద్ (బంగ్లాదేశ్)పై గెలిచి, రెండో గేమ్‌లో నొజెర్‌బెక్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు.



స్వర్ణ పతకానికి గెలుపు దూరంలో

- ఫైనల్లో భారత మహిళల క్రికెట్ జట్టు
- సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై ఘనవిజయం
- పూజ వస్త్రకర్‌కు 4 వికెట్లు
- నేడు శ్రీలంకతో తుది పోరు


పూజ

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో భారత మహిళల క్రికెట్ జట్టు ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ మహిళలపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 17.5 ఓవర్లలో 51 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ నిగార్ సుల్తానా (12) టాప్ స్కోరర్ కాగా మిగతా వారిలో ఎవరూ రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. ఐదుగురు బ్యాటర్లు 'డకౌట్' కావడం విశేషం. పేస్ బౌలర్ పూజ వస్త్రకర్ (4/17) తన కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనను నమోదు చేసి బంగ్లాను దెబ్బ కొట్టింది. భారత్ 8.2 ఓవర్లలో 2 వికెట్లకు 52 పరుగులు చేసి విజయాన్నందుకుంది. స్మృతి మంధాన (7) తొందరగానే అవుటైనా... జెమీమా రోడ్రిగ్స్ (20 నాటౌట్), షఫాలీ వర్మ (17) కలిసి గెలిపించారు. స్వర్ణపతకం కోసం నేడు జరిగే ఫైనల్లో శ్రీలంకతో భారత్ తలపడుతుంది. రెండో సెమీస్‌లో శ్రీలంక 6 వికెట్లతో పాకిస్తాన్‌పై గెలిచింది.

భారత్ 16 ఉజ్బెకిస్తాన్ 0

లలిత్, వరుణ్ కుమార్, మన్‌దీప్ సింగ్ 'హ్యాట్రిక్' సాధించడంతో... ఆసియా క్రీడల్లో భారత పురుషుల హాకీ జట్టు భారీ విజయంతో శుభారంభం చేసింది. ఉజ్బెకిస్తాన్‌తో ఆదివారం జరిగిన పూల్ 'ఎ' తొలి మ్యాచ్‌లో భారత్ 16–0 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున లలిత్ (7వ, 24వ, 37వ, 53వ ని.లో), వరుణ్ కుమార్ (12వ, 36వ, 50వ, 52వ ని.లో) నాలుగేసి గోల్స్ చేశారు. మన్‌దీప్ (18వ, 27వ, 28వ ని.లో) మూడో గోల్స్ సాధించగా... అభిషేక్ (17వ ని.లో), అమిత్ రోహిదాస్ (38వ ని.లో), సుఖ్‌జీత్ సింగ్ (42వ ని.లో), షంషేర్ సింగ్ (43వ ని.లో), సంజయ్ (57వ ని.లో) ఒక్కో గోల్ నమోదు చేశారు. తమ రెండో లీగ్ మ్యాచ్‌లో మంగళవారం సింగపూర్‌తో టీమిండియా ఆడుతుంది.


లలిత్

'ఐదు'తో అదరగొట్టారు


రజత పతకాలతో రమిత, మెహులీ, ఆశి


రజత పతకాలతో భారత రోయింగ్ జట్టు

ఈసారి పతకాల వేటలో 'సెంచరీ' దాటాలని చైనాలో అడుగుపెట్టిన భారత క్రీడాకారులు తొలి రోజే పతకాల ఖాతా తెరిచారు. 19వ ఆసియా క్రీడల్లో మొదటి రోజు ఐదు పతకాలతో అదరగొట్టారు. స్వర్ణ పతకం అందకపోయినా మూడు రజతాలు, రెండు కాంస్యాలతో శుభారంభం చేశారు. అంచలను అందుకుంటూ షూటర్లు తమ గురిని పతకాలపై పెట్టగా... రోయింగ్‌లోనూ భారత క్రీడాకారులు తమ సత్తా చాటుకున్నారు. మహిళల బాక్సింగ్, పురుషుల హాకీ, టెన్నిస్ క్రీడాంశాల్లోనూ మనోళ్లు రాణించారు. టేబుల్ టెన్నిస్, వాలీబాల్, మహిళల ఫుట్‌బాల్‌లో భారత్ పతకాల రేసు నుంచి నిష్క్రమించారు.

- ఆసియా క్రీడల్లో తొలి రోజు భారత్‌కు ఐదు పతకాలు
- షూటింగ్‌లో రజతం, కాంస్యం
- రోయింగ్‌లో రెండు రజతాలు, కాంస్యం

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో తొలి రోజు భారత క్రీడాకారులు మెరిపించారు. షూటింగ్‌లో రెండు, రోయింగ్‌లో మూడు పతకాలతో రాణించారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగం టీమ్ ఈవెంట్‌లో రమితా జిందాల్, మెహులీ ఘోష్, ఆశి చౌక్సీలతో కూడిన భారత జట్టు రజత పతకం సాధించింది. క్వాలిఫయింగ్‌లో భారత బృందం 1886 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది. హాన్ జియావు, యుటింగ్ హువాంగ్, జిలిన్ వాంగ్‌లతో కూడిన చైనా జట్టు 1896.6 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. గాన్‌హుయగ్, యసుజెన్, నరన్‌తుయాలతో కూడిన మంగోలియా జట్టు 1880 పాయింట్లతో కాంస్య పతకాన్ని సాధించింది. క్వాలిఫయింగ్‌లో రమిత 631.9 పాయింట్లతో రెండో స్థానంలో, మెహులీ 630.8 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. క్వాలిఫయింగ్‌లో టాప్–8లో నిలిచిన వారి మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో ఫైనల్‌ను నిర్వహిస్తారు. ఫైనల్లో రమిత 230.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకోగా... మెహులీ 208.3 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. యుటింగ్ హువాంగ్ (252.7 పాయింట్లు) స్వర్ణం, హాన్ జియావు (251.3 పాయింట్లు) రజతం గెల్చుకున్నారు.


రజత పతకాలతో అర్జున్ లాల్, అరవింద్ సింగ్

రోయింగ్‌లో పురుషుల లైట్‌వెయిట్ డబుల్ స్కల్స్ ఈవెంట్‌లో అర్జున్ లాల్ జాట్–అరవింద్ సింగ్ ద్వయం రజత పతకంతో బోణీ కొట్టింది. భారత జోడీ 6ని:28.18 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచింది. జున్‌జీ ఫాన్–మన్ సున్ (చైనా; 6ని:23.42 సెకన్లు) జంట స్వర్ణ పతకం సాధించింది. పురుషుల పెయిర్ విభాగంలో బాబూలాల్ యాదవ్–లేఖ్ రామ్ జోడీ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించింది. ఫైనల్ రేసులో బాబూలాల్–లేఖ్ రామ్ జంట 6ని:50.41 సెకన్లలో గమ్యానికి చేరి మూడో స్థానాన్ని దక్కించుకుంది. అనంతరం పురుషుల కాక్స్‌డ్ ఎయిట్ ఈవెంట్‌లో భారత జట్టు రజతం గెల్చుకుంది. నీరజ్, నరేశ్ కల్వానియా, నితీశ్ కుమార్, చరణ్‌జీత్ సింగ్, జస్వీందర్ సింగ్, భీమ్ సింగ్, పునీత్ కుమార్, ఆశిష్‌లతో కూడిన భారత జట్టు 5ని:43.01 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానాన్ని పొందింది. వాలీబాల్‌లో భారత పురుషుల జట్టు పతకం రేసు నుంచి నిష్క్రమించింది. క్వార్టర్ ఫైనల్లో భారత్ 16–25, 18–25, 17–25తో జపాన్ చేతిలో ఓడిపోయింది. పురుషుల టెన్నిస్ డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని–రామ్‌కుమార్ (భారత్) 6–2, 6–3తో అభిషేక్–ప్రదీప్ (నేపాల్)లపై గెలిచారు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత నంబర్ వన్ సుమిత్ నగాల్ 6–0, 6–0తో మార్కో టిన్ (మకావు)పై ఘనవిజయం సాధించాడు.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	20	7	3	30
దక్షిణ కొరియా	5	4	5	14
జపాన్	2	7	5	14
హాంకాంగ్	2	0	5	7
ఉజ్బెకిస్తాన్	1	3	3	7
చైనీస్ తైపీ	1	1	2	4
భారత్	0	3	2	5
ఇండోనేసియా	0	1	3	4
మంగోలియా	0	1	2	3
ఇరాన్	0	1	1	1

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

ఏషియాడ్‌లో నేటి భారతీయం

మెడల్ ఈవెంట్స్





షూటింగ్: పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్, వ్యక్తిగత విభాగం : రుద్రాంక్ష్ పాటిల్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్, దివ్యాంశ్ (ఉదయం గం. 6:30 నుంచి 9 వరకు).
మహిళల క్రికెట్ ఫైనల్: భారత్ X శ్రీలంక (ఉదయం గం. 11:30 నుంచి).
రోయింగ్: పురుషుల సింగిల్ స్కల్స్ (బల్‌రాజ్ పన్వర్; ఉదయం గం. 7 నుంచి); పురుషుల క్వాడ్రాపుల్ స్కల్స్ (ఉదయం గం. 8:30 నుంచి); మహిళల ఎయిట్ (ఉదయం గం. 8:50 నుంచి).

నిఖత్ పంచ్ అదిరె...



తొలిసారి ఆసియా క్రీడల్లో ఆడుతున్న భారత మహిళా స్టార్ బాక్సర్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ శుభారంభం చేసింది. 50 కేజీల విభాగం తొలి రౌండ్‌లో నిఖత్ 5–0తో థి టామ్ ఎన్గుయెన్ (వియత్నాం)పై ఘనవిజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. భారత్‌కే చెందిన మరో బాక్సర్ ప్రీతి (54 కేజీలు) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సిలీనా (జోర్డాన్)తో జరిగిన బౌట్‌లో ప్రీతి సంధించిన పంచ్‌లకు ఆమె ప్రత్యర్థి తట్టుకోలేకపోయింది. మూడో రౌండ్ మొదలైన 23 సెకన్ల తర్వాత రిఫరీ బౌట్‌ను నిలిపివేసి ప్రీతిని విజేతగా ప్రకటించాడు.

టీటీలో ముగిసిన పోరు

గత ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలిచిన భారత పురుషుల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్టు ఈసారి క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. దక్షిణ కొరియాతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత్ 0–3తో ఓడిపోయింది. భారత మహిళల జట్టు ప్రిక్వార్టర్ ఫైనల్లో 2–3తో థాయ్‌లాండ్ చేతిలో ఓటమి పాలైంది.

ప్రిక్వార్టర్ ఫైనల్లో భారత్



సునీల్ ఛెత్రి నాయకత్వంలోని భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు 13 ఏళ్ల తర్వాత ఆసియా క్రీడల్లో మరోసారి ప్రిక్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించింది. మయన్మార్‌తో ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌ను భారత్ 1–1తో 'డ్రా' చేసుకుంది. భారత్ తరఫున 23వ నిమిషంలో సునీల్ ఛెత్రి... మయన్మార్ తరఫున కివా హెట్వి 74వ నిమిషంలో ఒక్కో గోల్ చేశారు. చైనా ఏడు పాయింట్లతో గ్రూప్ 'ఎ' టాపర్‌గా నిలువగా... భారత్, మయన్మార్ నాలుగు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచారు. అయితే లీగ్ దశలో మయన్మార్ కంటే భారత్ ఒక గోల్ ఎక్కువ చేయడంతో ప్రిక్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మరోవైపు భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు పోరాటం లీగ్ దశలోనే ముగిసింది. గ్రూప్ 'బి'లో థాయ్‌లాండ్ జట్టుతో జరిగిన రెండో మ్యాచ్‌లో భారత్ 0–1తో ఓడిపోయింది.

ఇండోర్‌లో ఇరగదీశారు

వరల్డ్ కప్‌కు ముందు భారత్ అదరగొట్టే ప్రదర్శన... పలువురు కీలక ఆటగాళ్లు లేకపోయినా అద్భుత ఆటతో టీమిండియా బృందం ఆస్ట్రేలియాకు చుక్కలు చూపించింది. భారీ విజయమే కాకుండా ఇప్పటి వరకు వరకు బెంగగా ఉన్న శ్రేయస్ ఫామ్ సమస్య కూడా తొలగిపోగా... సూర్యకుమార్ కూడా ఎట్టకేలకు తన అసలు ప్రతాపాన్ని చూపించాడు. ఫలితంగా మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో సిరీస్ భారత్ సొంతమైంది.

- రెండో వన్డేలో భారత్ ఘన విజయం
- 99 పరుగులతో ఆస్ట్రేలియా చిత్తు
- శ్రేయస్, గిల్ సెంచరీలు
- 2–0తో సిరీస్ టీమిండియా సొంతం
- బుధవారం రాజ్‌కోట్‌లో చివరి వన్డే


శ్రేయస్


గిల్

ఇండోర్: సమష్టి ప్రదర్శనతో అదరగొట్టిన భారత్ ఆదివారం హోల్కర్ స్టేడియంలో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో 99 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 399 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా జట్టుపై భారత్‌కు వన్డేల్లో ఇదే అత్యధిక స్కోరు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శ్రేయస్ అయ్యర్ (90 బంతుల్లో 105; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (97 బంతుల్లో 104; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీలతో సత్తా చాటారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 164 బంతుల్లోనే 200 పరుగులు జోడించడం విశేషం. ఈ ఇద్దరితో పాటు సూర్యకుమార్ యాదవ్ (37 బంతుల్లో 72 నాటౌట్; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (38 బంతుల్లో 52; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా దూకుడుగా ఆడటంతో భారత్ భారీ స్కోరు సాధించగలిగింది. భారత్ ఇన్నింగ్స్‌లో ఏకంగా 31 ఫోర్లు, 18 సిక్సర్లు ఉండటం విశేషం. అనంతరం వర్షం కారణంగా ఆస్ట్రేలియా లక్ష్యాన్ని 33 ఓవర్లలో 317 పరుగులుగా (డక్‌వర్త్ లూయిస్ ప్రకారం) నిర్దేశించారు. ఆసీస్ 28.2 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌటైంది. వార్నర్ (39 బంతుల్లో 53; 7 ఫోర్లు, 1 సిక్స్), అబాట్ (36 బంతుల్లో 54; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధసెంచరీలు చేశారు. చివరి వన్డే బుధవారం రాజ్‌కోట్‌లో జరుగుతుంది.

చివరి వరకు మెరుపులు...

అరంగేట్ర బౌలర్ స్పెన్సర్ వేసిన తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు కొట్టిన రుతురాజ్ (8) ఎక్కువసేపు నిలవలేదు. అయితే నాలుగో ఓవర్ ఐదో బంతి నుంచి మొదలైన గిల్, శ్రేయస్ భాగస్వామ్యం ఆస్ట్రేలియాను ఒక ఆటాడుకుంది. గత మ్యాచ్‌లో రనౌటై తీవ్ర నిరాశకు గురైన శ్రేయస్ ఈసారి తనను తాను నిరూపించుకునే ప్రయత్నంలో జోరు ప్రదర్శించాడు. తన తొలి 14 బంతుల్లోనే అతను 5 ఫోర్లు కొట్టాడు. అబాట్ ఓవర్లో గిల్ 6, 4 కొట్టడంతో భాగస్వామ్యం 29 బంతుల్లోనే 50 పరుగులకు చేరింది. వానతో 40 నిమిషాల విరామం తర్వాత ఆట మళ్లీ మొదలైంది. గిల్ 37 బంతుల్లో, శ్రేయస్ 41 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఈ భాగస్వామ్యాన్ని విడదీసేందుకు ఆసీస్ బౌలర్లు తీవ్రంగా శ్రమించినా లాభం లేకపోయింది. తన ధాటిని కొనసాగిస్తూ 86 బంతుల్లో కెరీర్‌లో మూడో సెంచరీ అందుకున్న శ్రేయస్ తర్వాతి ఓవర్లో వెనుదిరగ్గా... కొద్ది సేపటికే 92 బంతుల్లో గిల్ ఆరో వన్డే సెంచరీ పూర్తయింది. గిల్ కూడా అవుటయ్యాక ఇషాన్ (18 బంతుల్లో 31; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రాహుల్, సూర్య కలిసి మరింత దూకుడుగా ఆడారు. 43 ఓవర్లు ముగిసేసరికి భారత్ స్కోరు 311/4. ఈ దశలో సూర్య మెరుపు బ్యాటింగ్‌తో ఇండోర్ దద్దరిల్లింది. తర్వాతి 7 ఓవర్లలో భారత్ 88 పరుగులు చేయగా... అందులో సూర్య ఒక్కడే 68 పరుగులు సాధించడం విశేషం. 24 బంతుల్లోనే అతను హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు.

అశ్విన్‌కు 3 వికెట్లు...

ఛేదనలో ఆసీస్ ఆరంభంలోనే తడబడింది. ప్రసిధ్ తన తొలి ఓవర్లోనే వరుస బంతుల్లో షార్ట్ (9), స్మిత్ (0)లను అవుట్ చేసి దెబ్బ కొట్టాడు. ఆ తర్వాత వార్నర్, లబుషేన్ (27) కలిసి మూడో వికెట్‌కు 80 పరుగులు జోడించి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే వీరిద్దరితో పాటు ఇన్‌గ్లిస్ (6)ను 12 పరుగుల వ్యవధిలో అశ్విన్ అవుట్ చేయడంతో ఆసీస్ కోలుకోలేకపోయింది. ఆఖర్లో సీన్ అబాట్, హాజల్‌వుడ్ (23) కలిసి తొమ్మిదో వికెట్‌కు 44 బంతుల్లోనే 77 పరుగులు జోడించి పోరాడినా లక్ష్యానికి జట్టు చాలా దూరంలో ఆగిపోయింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) క్యారీ (బి) హాజల్‌వుడ్ 8; గిల్ (సి) క్యారీ (బి) గ్రీన్ 104; శ్రేయస్ (సి) షార్ట్ (బి) అబాట్ 105; రాహుల్ (బి) గ్రీన్ 52; ఇషాన్ కిషన్ (సి) క్యారీ (బి) జంపా 31; సూర్యకుమార్ (నాటౌట్) 72; జడేజా (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 399. వికెట్ల పతనం: 1–16, 2–216, 3–243, 4–302, 5–355. బౌలింగ్: స్పెన్సర్ 8–0–61–0, హాజల్‌వుడ్ 10–0–62–1, అబాట్ 10–0–91–1, గ్రీన్ 10–0–103–2, జంపా 10–0–67–1, షార్ట్ 2–0–15–0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: షార్ట్ (సి) అశ్విన్ (బి) ప్రసిధ్ 9; వార్నర్ (ఎల్బీ) (బి) అశ్విన్ 53; స్మిత్ (సి) గిల్ (బి) ప్రసిధ్ 0; లబుషేన్ (బి) అశ్విన్ 27; ఇన్‌గ్లిస్ (ఎల్బీ) (బి) అశ్విన్ 6; క్యారీ (బి) జడేజా 14; గ్రీన్ (రనౌట్) 19; అబాట్ (బి) జడేజా 54; జంపా (బి) జడేజా 5; హాజల్‌వుడ్ (బి) షమీ 23; స్పెన్సర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (28.2 ఓవర్లలో ఆలౌట్) 217.** వికెట్ల పతనం: 1–9, 2–9, 3–89, 4–100, 5–101, 6–128, 7–135, 8–140, 9–217, 10–217. బౌలింగ్: షమీ 6–0–39–1, ప్రసిధ్ 6–0–56–2, అశ్విన్ 7–0–41–3, శార్దుల్ 4–0–35–0, జడేజా 5.2–0–42–3.


సూర్యకుమార్

వరుసగా 4 సిక్సర్లు...


గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీతో రాణించిన సూర్యకుమార్ ఈసారి తన అసలైన 360 డిగ్రీ ఆటను ప్రదర్శించాడు. ముఖ్యంగా గ్రీన్ వేసిన ఇన్నింగ్స్ 44వ ఓవర్లో అతను అద్భుత షాట్లతో చెలరేగాడు. తొలి నాలుగు బంతులను అతను లాంగ్ లెగ్, ఫైన్ లెగ్, కవర్స్, డీప్ మిడ్‌వికెట్ మీదుగా సికర్లుగా మలచడం విశేషం. ఆట చూస్తే తర్వాతి రెండు బంతులూ సిక్సర్లుగా మారతాయేమో అనిపించింది. అయితే గ్రీన్ రెండు చక్కటి బంతులతో కట్టడి చేయడంలో సఫలమయ్యాడు.

వార్నర్ రైట్ హ్యాండర్‌గా...

ఆసీస్ ఇన్నింగ్స్ 13వ ఓవర్లో వార్నర్ అనూహ్యంగా గార్డ్ తీసుకొని మరీ పూర్తి స్థాయి 'రైట్ హ్యాండ్' బ్యాటర్‌గా ఆడాడు. అశ్విన్ వేసిన ఈ ఓవర్లో ఒక చక్కటి ఫోర్ సహా అతను 6 పరుగులు చేశాడు. అయితే అశ్విన్ తర్వాతి ఓవర్లోనూ ఇలాగే దిగి లెఫ్ట్ హ్యాండర్ తరహాలో రివర్స్ స్వీప్ ఆడబోయి తొలి బంతికే ఎల్బీగా అవుటయ్యాడు. వార్నర్ దీనిని రివ్యూ చేయకపోగా, రీప్లేలో బంతి అతని బ్యాట్‌ను తాకినట్లు తేలింది.



ఇండియన్ జీపీ విజేత బెజెకీ



న్యూఢిల్లీ: భారత్ వేదికగా తొలిసారి జరిగిన ఇండియన్ గ్రాండ్‌ప్రి మోటో జీపీ రేసులో ఇటలీకి చెందిన మార్కో బెజెకీ చాంపియన్‌గా నిలిచాడు. మూనీ వీఆర్46 రేసింగ్ జట్టు తరఫున బరిలోకి దిగిన బెజెకీ 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించాడు. 21 ల్యాప్‌లతో కూడిన 105.21 కిలోమీటర్ల దూరాన్ని బెజెకీ అందరికంటే వేగంగా 36 నిమిషాల 59.1570 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. బెజెకీకి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విన్నర్స్ ట్రోఫీని అందజేశారు. ఇక్కడి బుధ్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో ఆదివారం జరిగిన ఈ రేసులో మొత్తం 20 మంది రేసర్లు పాల్గొన్నారు. తొలి మలుపు ముగిశాక బెజెకీ మూడో స్థానంలో ఉన్నా... రేసు కొనసాగుతున్నకొద్దీ ప్రత్యర్థులను వెనక్కి నెట్టాడు. జార్జి మార్టిన్ (స్పెయిన్; ప్రైమా ప్రామిక్ రేసింగ్) రెండో స్థానంలో, ఫాబియో క్వార్టారారో (ఫ్రాన్స్; మాన్‌స్టర్ ఎనర్జీ యామహా మోటో జీపీ) మూడో స్థానంలో నిలిచారు.

వెర్‌స్టాపెన్‌దే విజయం

రెడ్‌బుల్ జట్టుకు ఎఫ్1 టీమ్ టైటిల్

సుజుకా (జపాన్): ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో వరుసగా 14 రేసుల్లో గెలిచి 15వ రేసులో ఓటమి రుచి చూసిన రెడ్‌బుల్ జట్టు మళ్లీ గెలుపు బాట పట్టింది. ఆదివారం జరిగిన సీజన్‌లోని 16వ రేసు జపాన్ గ్రాండ్‌ప్రిలో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 53 ల్యాప్‌లను ఒక గంట 30 నిమిషాల 58.421 సెకన్లలో ముగించి అగ్ర స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది 13వ విజయం. నోరిస్ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, ఆస్కార్ (మెక్‌లారెన్) మూడో స్థానంలో నిలిచారు. మొత్తం 20 మంది డ్రైవర్లు రేసును ఆరంభించి ఐదుగురు ముగించలేకపోయారు. తాజా గెలుపుతో రెడ్‌బుల్ జట్టు సీజన్‌లో మరో ఆరు రేసులు మిగిలి ఉండగానే 623 పాయింట్లతో టీమ్ టైటిల్‌ను ఖరారు చేసుకుంది. డ్రైవర్స్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో వెర్‌స్టాపెన్ 400 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... పెరెజ్ (రెడ్‌బుల్) 223 పాయింట్లతో రెండో స్థానంలో, హామిల్టన్ (మెర్సిడెస్) 223 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు. తదుపరి రేసు ఖతర్ గ్రాండ్‌ప్రి అక్టోబర్ 8న జరుగుతుంది.



స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	221	66,009
నిఫ్టీ ▽	68	19,674

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	13,212	▽ 12
డోజోన్స్	33,964	▽ 107
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,684	△ 5
డాక్స్	15,557	▽ 15
షాంఘై	3,132	△ 48
నికాయ్	32,397	▽ 222

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.10	83.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	100.19	103.52
€	యూరో	ఎస్‌బీఐ	86.81	89.91
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.12	56.85
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.17	54.51
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.72	61.66
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.16	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.68	23.48
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.23	12.31

వృద్ధాప్యంలో సంక్షోభానికి దూరంగా..

- భారంగా మారుతున్న ఆరోగ్య సంరక్షణ • వ్యయాలకు ముందు నుంచే తగిన ప్రణాళిక • హెల్త్ ఇన్సూరెన్స్, క్రిటికల్ కేర్ అవసరం
- ప్రత్యేక అత్యవసర నిధి ఉండాలి • భవిష్యత్ ఆర్థిక సవాళ్లకు ముందే సన్నద్ధత

ప్రతి కుటుంబానికి సమగ్ర ఆర్థిక ప్రణాళిక ఉండాలి. కుటుంబ లక్ష్యాలు అన్నింటికీ ఇందులో చోటు కల్పించుకోవడం ఎంతో అవసరం. స్కూల్, కాలేజీ ఫీజులు, విదేశీ విద్య, జీవిత, ఆరోగ్య బీమా పథకాలు, అత్యవసర నిధి, విహార, పర్యాటక యాత్రలు ఇలా అన్నింటికీ చోటు కల్పించుకోవాలి. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని, ఈ లక్ష్యాలు అన్నింటికీ కావాల్సిన మేర సమకూర్చుకునేందుకు వీలుగా తగిన పెట్టుబడుల ప్రణాళిక రూపొందించుకోవాలి. అందరూ కాకపోయినా కొందరు అయినా దీన్ని అనుసరిస్తుంటారు. కాకపోతే ఎక్కువ మంది ఇక్కడ విస్మరించే విషయం ఒకటి ఉంది. తమపై ఆధారపడిన వృద్ధాప్య తల్లిదండ్రుల సంరక్షణను ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోరు. దీన్ని ఒక లక్ష్యంగా చూడరు. గతంతో పోలిస్తే వృద్ధాప్యంలో సంరక్షణ వ్యయాలు గణనీయంగా పెరిగాయి. కనుక ప్రతి ఒక్కరి ఆర్థిక ప్రణాళికలో దీనికి తప్పకుండా చోటు ఉండాల్సిందే. లేదంటే ఆర్థిక సంక్షోభాన్ని ఆహ్వానించినట్టు అవుతుంది..



పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలు

అతిపెద్ద ఆర్థిక వ్యయంతో కూడుకున్న లక్ష్యాల్లో వృద్ధాప్య సంరక్షణ (జెరియాట్రిక్ కేర్) ఒకటి. అయినా, అధిక శాతం మంది ఆర్థిక ప్రణాళికల్లో దీనికి చోటు ఉండదు. వృద్ధుల సంక్షేమం కోసం ఎంత ఖర్చు అవుతుందన్న అవగాహన కూడా ఉండడం లేదు. ఇది ఎన్నో అంశాలపై ఆధారపడి ఉంటుంది. వృద్ధులైన తల్లిదండ్రులు తమతోనే ఉంటున్నారా? లేక మరో చోట నివసిస్తున్నారా? లేక వృద్ధాశ్రమంలో చేరారా? వారికి ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా? లేదంటే వారికి సంరక్షకులను ఏర్పాటు చేయాలా? వారికి పింఛను సదుపాయం ఉందా లేక ఇతరత్రా వేరే రూపంలో ప్రతి నెలా ఆదాయం వచ్చే ఏర్పాటు ఉందా? ఇలాంటి అంశాలన్నింటి ఆధారంగా వృద్ధుల సంక్షేమం కోసం ఏ విధంగా సన్నద్ధం కావాలనేది తెల్చుకోవచ్చు. వృద్ధాప్య సంరక్షణ ఇంత కాలం పాటు, నిర్దిష్ట సమయం అని నిర్ణయించుకోవడం కష్టం. వృద్ధులైన తల్లిదండ్రులకు ఇప్పుడు ప్రత్యేక సంరక్షణ అవసరం పడకపోవచ్చు. అలా అని ముందు ముందు వయసు మీద పడితే ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయో తెలియదు. అప్పుడు ప్రత్యేక సంరక్షకుల అవసరం ఏర్పడొచ్చు. దీనికి ఎంత వ్యయం అవుతుందన్నది ముందుగా అంచనా వేయలేం.

నేడు ఆరోగ్య సంరక్షణ వ్యయాలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. సామాజిక భద్రత ఉండడం లేదు. నేటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని చూస్తే వృద్ధుల సంక్షేమం అతిపెద్ద ఆర్థిక లక్ష్యాల్లో ఒకటిగా మారిపోయింది. ఉదాహరణకు హైదరాబాద్‌కు చెందిన దత్తాత్రేయ తల్లికి కిడ్నీల సమస్య ఉంది. కిడ్నీల డయాలసిస్, ఇతర చికిత్సా వ్యయాల కోసం రూ.80,000 వరకు ప్రతి నెలా ఖర్చు చేయాల్సి వస్తోంది. గతేడాది వరకు కేవలం ఔషధాల వరకే ఖర్చు అయ్యేది. కానీ, కిడ్నీల సమస్య మరింత తీవ్రతరం కావడంతో వారంలో మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సి వస్తోంది. ఒక్క సెషన్‌కు రూ.3,000 ఖర్చు అవుతోంది. ఇక దత్తాత్రేయ తల్లి మృణాళిని టెస్ట్‌లు, వైద్యుల కన్సల్టేషన్ కోసం ఏటా మరో రూ.లక్ష ఖర్చు చేస్తున్నారు. నిజానికి దత్తాత్రేయకు పనిచేసే సంస్థ అందిస్తున్న హెల్త్ ఇన్సూరెన్స్ ఉంది. ఇప్పటి వరకు బీమా కంపెనీ మృణాళిని వైద్య ఖర్చుల భారం మోస్తోంది. కాకపోతే ఇటీవల డయాలసిస్, ఇతర

ఎన్నో నిదర్శనాలు..

వ్యయాలు పెరిగిన నేపథ్యంలో కవరేజీ చాలడం లేదు. సొంతంగా తమ వంతు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక పట్టణాల్లో తల్లిదండ్రుల సంక్షేమ వ్యయాలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. అందులోనూ తల్లిదండ్రులు ఒకచోట, పిల్లలు మరో చోట నివసిస్తుంటే, వారికి అదనపు వ్యయాలతో పాటు ఇతరత్రా సవాళ్లు ఎదురవుతుంటాయి. ఇందుకు ముంబైకి చెందిన భట్టాచార్యే నిదర్శనం. ఆయన తల్లిదండ్రులు కోల్‌కతాలో నివసిస్తున్నారు. వారి సంరక్షణ బాధ్యతలు ఏకైక కుమారుడైన దత్తాత్రేయపైనే ఉన్నాయి. వాటిని ఆయన నెరవేరుస్తున్నారు కూడా. కాకపోతే తాను నివసిస్తున్న పట్టణానికి దూరంగా తల్లిదండ్రులు ఉంటుండడం, పైగా తల్లి కేన్సర్‌తో బాధపడుతూ పూర్తి స్థాయిలో సొంతంగా నడవలేకపోతుండడం సవాలుగా మారింది. దీంతో ఆమెకు తన కుమారుడి నుండి భౌతిక సాయం కూడా అవసరమవుతోంది. దీంతో భట్టాచార్య ముంబై నుంచి కోల్‌కతాకు తరచూ వెళ్లి రావాల్సి వస్తోంది. తనతో పాటు ఆస్పత్రికి వెళ్లి రావడానికి అమ్మ సౌకర్యంగా భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. తన తల్లిదండ్రులను ముంబైకి మార్చుదామంటే ఆర్థికంగా అది సులువైన నిర్ణయం కాదని అతడికి తెలుసు. కోల్‌కతాలో అయితే వారి సంరక్షణకు నెలకు రూ.60,000-65,000 ఖర్చు అవుతోంది. ముంబైకి మారిస్తే రూ.లక్ష ఖర్చు చేయాల్సి వస్తుంది. ముంబైలో జీవన వ్యయాలు ఎక్కువ. ఇప్పుడు కాకపోతే మరికొంత కాలం తర్వాత అయినా తన తల్లిదండ్రులను ముంబైకి తీసుకురావడం ఒక్కటే ఆయన ముందున్న ఆప్షన్. ఏడాది క్రితం వరకు తల్లిదండ్రుల ఔషధాలకు నెలకు రూ.30,000 ఖర్చు అయితే, ఇప్పుడు రూ.45,000కు పెరిగింది. తమపై ఆధారపడిన లేదంటే భవిష్యత్తులో తమ సంరక్షణ అవసరం పడే తల్లిదండ్రులు ఉంటే, వారి కోసం ముందు నుంచే ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరాన్ని ఈ నిదర్శనాలు తెలియజేస్తున్నాయి.

అస్పష్ట సవాళ్లు

ఆర్థికంగా పడే భారాన్ని అధిగమించడం ఒక్కటే కాదు, ఇతర సవాళ్లు కూడా ఎదురుకావచ్చు. ఢిల్లీకి చెందిన మంజీత్ తండ్రికి శస్త్రచికిత్స తర్వాత ఆస్పత్రిలోనే చాలా రోజులు ఉండాల్సి వచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రి కావడంతో రాత్రి సమయాల్లో సంరక్షణ చూసేందుకు ఒక వార్డ్ బోయ్ ఉంటే బాగుంటుందని అనిపించింది. ప్రభుత్వ హాస్పిటల్ కావడంతో ప్రతి రోగికి విడిగా ఒక్కో వార్డ్ బోయ్ లేదా కేర్‌టేకర్ ఏర్పాటు సదుపాయం ఉండదు. దీంతో ప్రైవేటుగా ఒక వ్యక్తిని ఏర్పాటు చేసుకోవడం మినహా వేరే మార్గం కనిపించలేదు. అందుకు అర్హత కలిగిన వ్యక్తిని గుర్తించడం, వారి చార్జీలు చెల్లించడం కష్టమైన టాస్క్‌గా మారింది. కొన్ని పేరొందిన ఆస్పత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ వ్యయాలు 40-50 శాతం అధికంగా ఉంటాయి. వృద్ధాప్య సంరక్షణ కేంద్రాల్లో ఈ సేవలు అన్నీ అందుబాటులో ఉంటాయి. కానీ, తమ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో, అనారోగ్యంతో ఉన్నప్పుడే వేరే కొత్త ప్రాంతానికి మారిస్తే.. వారు ఒంటరితనంతో వేదనకు గురవుతారు. పైగా తమ పిల్లలు అలక్ష్యం చేస్తున్నారనే బాధ కూడా ఉంటుంది. బంధు మిత్రుల నుంచి ఈ విషయంలో అవహేళనలు కూడా ఎదురుకావచ్చు. కొన్ని ప్రముఖ పట్టణాల్లో సర్జరీల తర్వాత వృద్ధుల కోసం తాత్కాలిక సంరక్షణ కేంద్రాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇక్కడ సర్జరీ అనంతరం కావాల్సిన సేవలను 3-8 వారాల పాటు అందిస్తారు. ప్రత్యేక రూమ్, నర్స్, అటెండెంట్ తదితర సేవలు పొందొచ్చు. వైద్యులు కూడా వచ్చి చూసి వెళుతుంటారు. కైట్స్ సీనియర్ కేర్‌తోపాటు కేర్ హాస్పిటల్ తదితర కొన్ని సంస్థలు ఈ తరహా సేవలను ఆఫర్ చేస్తున్నాయి. కాకపోతే రోజువారీ రూ.3,000-4,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. వృద్ధులకు ఉన్న సమస్యల ఆధారంగా ఈ వ్యయం మారుతుంది. భార్యా, భర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే వారిపై ఆధారపడిన పెద్దలకు తాత్కాలికంగా ఇలాంటి కేంద్రాల్లో సేవలు అందించొచ్చు. ఒకవైపు భవిష్యత్తులో పెద్దల సంక్షేమం కోసం అయ్యే వ్యయాలకు ప్రణాళిక రూపొందించుకోవడం ఎంత ముఖ్యమో.. భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా సన్నద్ధం కావడం కూడా అంతే అవసరం.



ప్రణాళిక ఎలా..?

తమపై తల్లిదండ్రులు ఆధారపడి ఉంటే, వారి కంటూ హెల్త్ ఇన్సూరెన్స్ ముందుగా తీసుకోవాలి. వీలైతే 45 ఏళ్లలోపు, అది వీలు పడకపోతే 60 ఏళ్లలోపు తప్పకుండా తీసుకోవాలి. దీంతో ఏదైనా ఆరోగ్య సమస్యతో వారు హాస్పిటల్‌లో చేరితే, అయ్యే వ్యయాన్ని హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీయే భరిస్తుంది. ముఖ్యంగా కుటుంబ ఆర్థిక చరిత్ర గురించి ఒక్కసారి విశ్లేషించుకోవాలి. తల్లిదండ్రులను అడిగి, వారి తల్లిదండ్రులు, సోదరుల్లో ఎవరికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయనేది తెలుసుకోవాలి. ముఖ్యంగా మధుమేహం, ఆర్థరైటిస్, డిమెన్షియా, గుండె జబ్బులు, కేన్సర్, స్ట్రోక్ తదితర సమస్యలు ఉన్నాయేమో విచారించాలి. క్రిటికల్ ఇల్‌నెస్ కవర్‌ను కూడా తీసుకోవడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా డయాలసిస్, ఓరల్ కీమో థెరపీ తదితర చికిత్సలకు డేకేర్ కింద కవరేజీ ఉండేలా చూసుకోవాలి. అలాగే, హోమ్‌కేర్ కవర్ కూడా ఉండాలి. దీనివల్ల ఇంట్లో ఉండి చికిత్స తీసుకుంటే బీమా కంపెనీ నుంచి క్లెయిమ్ పొందొచ్చు. అయినప్పటికీ ఇంట్లో అటెండెంట్, హోమ్ నర్స్, మెడికల్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయాల్సి వస్తే అందుకే అయ్యే చార్జీలను కంపెనీలు చెల్లించవు. నెలకు ఒక అటెండెంట్ సేవలు పొందేందుకు మెట్రోల్లో అయితే రూ.25,000-30,000, చిన్న పట్టణాల్లో అయితే రూ.15,000-20,000 వరకు ఖర్చు అవుతుంది. ఇంటి వద్దే నర్స్ సేవల కోసం నెలవారీ వ్యయాలు 25-40 శాతం అధికంగా అవుతాయి. అందుకే ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకోవడం వల్ల తర్వాత ఆర్థికంగా సతమతం కాకుండా ఉంటుంది. ఎందుకంటే వృద్ధులైన తల్లిదండ్రుల సంక్షేమం రూపంలో ఖర్చులు ఎదురైన సమయంలోనే పిల్లల ఉన్నత విద్య, ఇతర కీలక లక్ష్యాలు తారసపడతాయి. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రతి ఒక్కరూ తమ కుటుంబానికి అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవడం ఎంత అవసరమో.. తల్లిదండ్రుల కోసం ప్రత్యేక అత్యవసర నిధిని కూడా సమకూర్చుకోవడం అంతే అవసరమనేది ఆర్థిక నిపుణుల సూచన. నిజానికి తల్లిదండ్రుల కోసం కొంత ఫండ్‌ను సిద్ధంగా ఉంచుకునే వారు అరుదుగా కనిపిస్తారు. అవసరం అయితే జీవన వ్యయాలను కొంత తగ్గించుకుని అయినా, తమపై ఆధారపడి వారి కోసం అత్యవసర నిధిని సమకూర్చుకోవాలే కానీ, వాయిదా వేయరాదని నిపుణుల సూచన. కనుక తల్లిదండ్రులు లేదా తమపై ఆధారపడిన అత్త మామల వృద్ధాప్య సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ హెల్త్ ఇన్సూరెన్స్‌తో పాటు అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి.

భారత్‌లో ఉత్పత్తి 5 రెట్లు పెంపు

యాపిల్ ప్రణాళికలు



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం భారత్‌లో తమ ఉత్పత్తుల తయారీని 5 రెట్లు పైగా పెంచుకోవాలని యోచిస్తోంది. వచ్చే 4-5 ఏళ్లలో 40 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 3.32 లక్షల కోట్లు) విలువ చేసే ఉత్పత్తులను తయారు చేయాలని భావిస్తోందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. యాపిల్ గతేడాది 7 బిలియన్ డాలర్ల ఉత్పత్తి మార్కును అధిగమించినట్లు పేర్కొన్నాయి. ప్రస్తుతానికైతే ఐటీ హార్డ్‌వేర్ ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్‌ఐ)లో భాగమయ్యే యోచనేదీ యాపిల్‌కు లేవని వివరించాయి. ఇప్పటికైతే ఉత్పత్తిని పెంచుకోవడంపైనే కంపెనీ దృష్టి పెడుతోందని, రాబోయే రోజుల్లో పీఎల్‌ఐ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండొచ్చని పేర్కొన్నాయి. యాపిల్ ప్రస్తుతం భారత్‌లో ఐఫోన్లను తయారు చేస్తుండగా, వచ్చే ఏడాది నుంచి ఎయిర్‌పాడ్స్ ఉత్పత్తి కూడా ప్రారంభించే యోచనలో ఉంది. ఇప్పటికైతే ఇక్కడ ఐప్యాడ్స్ లేదా ఇతరత్రా ల్యాప్‌టాప్‌లను తయారు చేసే ఆలోచనేదీ కంపెనీకి లేనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గతేడాది సెప్టెంబర్‌తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో యాపిల్ అంతర్జాతీయంగా 191 బిలియన్ డాలర్ల విలువ చేసే ఐఫోన్లను విక్రయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో ఐఫోన్ విక్రయాలు సుమారు 4 శాతం తగ్గి 157 బిలియన్ డాలర్ల స్థాయిలో నమోదయ్యాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-9-2023	
విశాఖ	528-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	528-00
విజయవాడ	528-00
రిటైల్ ధర (డజను)	72.00
24-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	511-00
వరంగల్	513-00
రిటైల్ ధర	5.60

స్టాక్స్ వ్యూ

డేటా ప్యాటర్న్స్ | ఇన్‌క్రెడ్ ఈక్విటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 2,066
టార్గెట్: రూ. 3,000

ఎందుకంటే: అధిక వృద్ధి బాటలో ఉన్న కంపెనీ డేటా ప్యాటర్న్స్ (ఇండియా) నిలకడైన మార్జిన్లను సాధిస్తోంది. రిటర్నుల రేషియోలనూ మెరుగుపరచుకుంటోంది. మధ్యకాలంలో కంపెనీ ఇదే తరహా పనితీరును ప్రదర్శించే వీలున్నట్లు భావిస్తున్నాం. ఇప్పటికే పూర్తి చేయవలసిన భారీ ఆర్డర్లకుతోడు మరిన్ని కాంట్రాక్టులు పైప్‌లైన్‌లో ఉండటం కంపెనీకి బలాన్నిస్తోంది. సొంత ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఎగుమతులు వంటి అంశాలు వృద్ధికి, మార్జిన్ల పటిష్టతకు సహకరించనున్నాయి. 2023 మార్చికల్లా ఆర్డర్ బుక్ విలువ దాదాపు రెట్టింపునకు చేరింది. గత 12 నెలల టర్నోవర్‌తో పోలిస్తే రెట్టింపుకాగా.. డైవర్సిఫైడ్ ఆర్డర్‌బుక్‌ను కలిగి ఉంది. దీనిలో ప్రొడక్షన్ 31 శాతం, డెవలప్‌మెంట్ 64 శాతం, సర్వీసులు 5 శాతం చొప్పున ఆక్రమిస్తున్నాయి. మార్కెట్లో మరింత విస్తరించే బలమైన కాంక్షను ప్రదర్శిస్తున్న కంపెనీ రానున్న మూడేళ్లలో రూ. 3,000 కోట్ల విలువైన కాంట్రాక్టులపై కన్నేసింది. మ్యాన్యుఫాక్చరింగ్ ఫెసిలిటీలో విస్తరణ, సగటున 20ఏళ్లకుపైగా అనుభవంగల యాజమాన్య టీమ్ కంపెనీ భవిష్యత్ పురోగతికి దోహదపడనున్నాయి. వెరసి మూడేళ్ల కాలం(2023-26)లో కంపెనీ వార్షిక ప్రాతిపదికన అమ్మకాలు 38 శాతం, షేరువారీ ఆర్జన(ఈపీఎస్) 45 శాతం చొప్పున వృద్ధి చెందగలవని అంచనా. ఫలితంగా 2025-26 ఏడాదికల్లా 22 శాతం ఆర్‌వోఈ, ఆర్‌వోసీఈలను సాధించవచ్చని భావిస్తున్నాం. అయితే కొత్త ఆర్డర్లను పొందడంలో వెనుకబాటు, అంచనాలు అందుకోని మార్జిన్లు, ప్రభుత్వ బడ్జెట్‌లో కోతలు లేదా ప్రభుత్వ వ్యయాల ఆలస్యం వంటి అంశాలు కంపెనీగల రిస్కులుగా పేర్కొనవచ్చు.



ఎన్‌ఎండీసీ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 143
టార్గెట్: రూ. 180

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో మైనింగ్ రంగ దిగ్గజం ఎన్‌ఎండీసీ అమ్మకాల పరిమాణం 32-40 మిలియన్ టన్నులను అధిగమించవచ్చని అంచనా. 2030కల్లా 100 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్య ప్రణాళికల నేపథ్యంలో దీర్ఘకాలిక అమ్మకాల్లో వృద్ధి నమోదయ్యే అవకాశముంది. ఒడిషాలోని వాణిజ్య మైనింగ్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకోనందున భవిష్యత్‌లో మరిన్ని అవకాశాలకు దారి చూపనుంది. దీంతో ప్రస్తుతం 22 శాతంగా నమోదవుతున్న ఆర్‌వోఈ మరింత మెరుగుపడేందుకు ఆస్కారముంది. స్టీల్ ప్లాంటును విడదీయడం ద్వారా మైనింగ్‌కు ప్రాధాన్యం పెరగడం ఇందుకు దోహదం చేయనుంది. గతేడాది వరకూ సాధించిన అమ్మకాలు, పెరగనున్న ఉత్పత్తుల ధరలు వంటి అంశాల నేపథ్యంలో వార్షిక ప్రాతిపదికన నిర్వహణ లాభం ఈ ఆర్థిక సంవత్సరంలో 22 శాతం, వచ్చే ఏడాది(2024-25) 38 శాతం చొప్పున పుంజుకోవచ్చని అంచనా వేస్తున్నాం. ఈ ఏడాది తొలి త్రైమాసిక(ఏప్రిల్-జూన్) ఫలితాల సందర్భంగా కంపెనీ యాజమాన్యం పూర్తి ఏడాదికి 47-50 మిలియన్ టన్నుల అమ్మకాలను అంచనా వేసింది. ఈ ఏడాది అక్టోబర్ నుంచి కర్ణాటకలోని దోనిమలై మైన్‌కు పెరిగిన ఈసీ లిమిట్ అమలులోకి రానుండటం ఇందుకు మద్దతివ్వనుంది. అయితే అంచనాలకంటే తక్కువగా అమ్మకాల పరిమాణం నమోదుకావడం, ముడిఇనుము ధరలు పడిపోవడం వంటి అంశాలు కంపెనీగల ప్రధాన రిస్కులుగా భావించవచ్చు. ఇటీవల ప్రభుత్వం విధించిన ఎగుమతి సుంకం కంపెనీకి ప్రతికూలమని చెప్పవచ్చు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

నామినీలను తెలిపేందుకు ఈ నెల 30 వరకు డెడ్‌లైన్

- డీమ్యాట్, ఎంఎఫ్ ఖాతాదారులకు సెబీ నిబంధన



న్యూఢిల్లీ: వ్యక్తిగత డీమ్యాట్‌హోల్డర్లు, మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లు తమ ఖాతాలకు సంబంధించి లబ్ధిదారులను నామినేట్ చేసేందుకు గడువు సెప్టెంబర్ 30తో ముగియనుంది. ఆలోగా నామినేట్ చేసేందుకు లేదా నామినీల పేర్లను ఉపసంహరించుకునేందుకు ఉద్దేశించిన డిక్లరేషన్ ఫారంను సమర్పించకపోతే ఆయా డీమ్యాట్ ఖాతాలు, ఫోలియోలను ఫ్రీజ్ చేయనున్నారు. దీంతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను రిడీమ్ చేసుకోలేని పరిస్థితి తలెత్తుతుంది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రకారం ఈ నిబంధన కొత్త, పాత ఇన్వెస్టర్లు అందరికీ వర్తిస్తుంది. ఏదైనా దురదృష్టకరమైన సంఘటన జరిగితే ఇన్వెస్టర్లు తమ సెక్యూరిటీస్‌ను చట్టబద్ధమైన వారసులకు ఎలాంటి సమస్యలు లేకుండా సజావుగా బదిలీ అయ్యేలా చూసేందుకు ఇది ఉపయోగపడగలదని ఫైయర్స్ సహ-వ్యవస్థాపకుడు తేజస్ ఖోడే తెలిపారు.


రెండవసారి పొడిగింపు

ఇన్వెస్టర్లు తమ నామినీల పేర్లను ఇచ్చేందుకు 2022 మార్చి 31 వరకు గడువునిస్తూ 2021 జూలైలో సెబీ తొలిసారిగా నిబంధనను రూపొందించింది. ఆ తర్వాత దాన్ని 2022 మార్చి వరకు, అటు పైన 2023 మార్చి 31 వరకు పొడిగించింది. పరిశ్రమ వర్గాల విజ్ఞప్తి మేరకు మరోసారి సెప్టెంబర్ 30 నాటికి పెంచింది. నామినీలను సూచించకుండా పలువురు ఇన్వెస్టర్లు గతంలో ఖాతాలు తెరిచిన నేపథ్యంలో వారికి ఏదైనా జరిగితే సదరు సెక్యూరిటీలను పొందడంలో వారసులకు సమస్యలు ఎదురవుతున్నాయని మార్కెట్ నిపుణులు తెలిపారు. సెబీ తాజా డెడ్‌లైన్‌తో ఇలాంటి పరిస్థితి ఉండదని పేర్కొన్నారు.

రియల్ ఎస్టేట్ మెరుగైన పెట్టుబడి సాధనమేనా?

ఫ్లెక్సీక్యాప్, లార్జ్ అండ్ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్.. ఒకేసారి, ఒకటికి మించిన ఫండ్ విభాగాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా? - వెంకటరమణ

మీరు సంక్లిష్టతను ఇష్టపడే వారు అయితే ఒకటికి మించిన విభాగాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కాకపోతే నిర్ణీత కాలానికి ఒకసారి పోర్ట్‌ఫోలియోని రీబ్యాలన్స్ (సమీక్ష/మార్పులు, చేర్పులు) చేసుకోవడం మర్చిపోవద్దు. ఇలా ఎన్నో విభాగాల మధ్య పెట్టుబడులను వర్గీకరించినప్పుడు అది గజిబిజీగా, పన్ను పరంగా అనుకూలం కాకపోవచ్చు. దీనికి ప్రత్యామ్నాయంగా ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం మెరుగైన నిర్ణయం అవుతుంది. ఎందుకంటే ఈ పథకాలు వివిధ మార్కెట్ విలువ కలిగిన కంపెనీల్లో (స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్) ఇన్వెస్ట్ చేస్తుంటాయి. కాకపోతే ఆయా విభాగాలకు కేటాయించే మొత్తం పథకాలను బట్టి వేర్వేరుగా ఉండొచ్చు. సాధారణంగా ఫ్లెక్సీక్యాప్ పథకాలు తమ నిర్వహణలోని పెట్టుబడుల్లో 70-75 శాతాన్ని లార్జ్‌క్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. మిగిలిన పెట్టుడులను మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ పథకాలకు కేటాయిస్తుంటాయి. కనుక మీరు రెండు నుంచి మూడు ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఫ్లెక్సీక్యాప్ పథకాలు ఎక్కువ మొత్తాన్ని లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. కనుక మీరు విడిగా లార్జ్‌క్యాప్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవాల్సిన అవసరం లేదు. పెట్టుబడుల విషయంలో మరింత దూకుడుగా, రిస్క్ తీసుకునే వారు, ఫ్లెక్సీక్యాప్‌నకు అదనంగా 10-15 శాతం పెట్టుబడులను మిడ్, స్మాల్‌క్యాప్‌నకు కేటాయించుకోవడం ద్వారా దీర్ఘకాలంలో అధిక రాబడులు సొంతం చేసుకోవచ్చు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

పెట్టుబడికి రియల్ ఎస్టేట్ మెరుగైన సాధనమేనా? ఇతర ఉత్పత్తులతో దీన్ని ఎలా పోల్చి చూడాలి? - శివమ్

రియల్ ఎస్టేట్‌ను పెట్టుబడి సాధనంగా నేను భావించడం లేదు. ఇల్లును ఒక కుటుంబం నివసించేందుకే గానీ, పెట్టుబడిగా చూడకూడదు. ఒక్కసారి ఇల్లు కొనుగోలు చేసి, దానిలో నివసిస్తుంటే విలువ పెరుగుతుందా? లేక తగ్గుతుందా అన్నది పట్టించుకునే విషయం కాదు. పెట్టుబడిగా రియల్ ఎస్టేట్‌కు కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి. పెట్టుబడి పరిమాణం అధికంగా కావాల్సి ఉంటుంది. ఇతర సాధనాలతో పోలిస్తే లిక్విడిటీ (నగదుగా మార్చుకునే సౌలభ్యం) తక్కువగా ఉంటుంది. దీంతో కోరుకున్నప్పుడు విక్రయించుకునే వీలు ఉండకపోవచ్చు. కొన్ని సందర్భాల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడిలో సవాళ్లు ఉంటాయి. మరో కోణం నుంచి చూస్తే.. ప్రాపర్టీని అద్దెకు ఇస్తే క్రమం తప్పకుండా అద్దె రూపంలో ఆదాయం వస్తుంది. కిరాయిదారు రూపంలో ఇంటి నిర్వహణ సక్రమంగా ఉండొచ్చు. అలా చూస్తే ఇల్లు మంచి పెట్టుబడే అవుతుంది. ఎందుకంటే ద్రవ్యోల్బణంతోపాటే అద్దె కూడా పెరుగుతూ వెళుతుంది. అదే సమయంలో ప్రతికూలతలూ కనిపిస్తాయి. ఇల్లు ఎంత గొప్పది అయినా 20 ఏళ్ల తర్వాత డిమాండ్ తగ్గుతుంది. అద్దెకు ఉండేవారు అధునికమైన, కొత్త ఇంటి కోసం ప్రాధాన్యం ఇస్తుంటారు. కనుక రియల్ ఎస్టేట్ విలువ పెరిగినా కానీ, దానికి అనుగుణంగా అద్దె రాబడి మెరుగ్గా ఉండదు. అందుకే ప్రాపర్టీని కొనుగోలు చేసే ముందు ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకోవాలి. నా సలహా ఏమిటంటే రియల్ ఎస్టేట్‌ను పెట్టుబడిగా కాకుండా నివాసంగానే చూడండి.

క్లుప్తంగా...

నేడు వర్సిటీలతో గవర్నర్ సమావేశం

విద్యార్థుల సమస్యలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: 'చాన్స్‌లర్ కనెక్ట్స్ అల్యూమినీ' కార్యక్రమంలో భాగంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సోమవారం రాష్ట్ర విశ్వవిద్యాలయాల అధికారులు, ప్రముఖ విద్యావేత్తలతో సమావేశమవుతారు. రాజ్‌భవన్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 9.30 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమంలో విద్యార్థుల సమస్యలపై గవర్నర్ వర్సిటీ అధికారులతో చర్చించనున్నారు. సుదీర్ఘ కాలంగా పెద్ద సంఖ్యలో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండడంతో చాలా వర్సిటీల్లో పలు రకాల కోర్సులు మూతబడడం, ఫీజులను అడ్డగోలుగా పెంచడం, తరగతుల నిర్వహణ జరగకపోవడం, కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై 5 నెలలు గడుస్తున్నా ఇంకా కొన్ని వర్సిటీల్లో గత విద్యా సంవత్సరం చివరి సెమిస్టర్ పరీక్షలు జరగకపోవడం, రాజకీయాలతో వర్సిటీల పాలన వ్యవహారాలు పూర్తిగా గాడి తప్పడం వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.

కోవిడ్ తర్వాత ఏపీలో పెట్టుబడులు కళకళ


- గత 27 నెలల్లో కొత్తగా రూ.32,697 కోట్ల ఒప్పందాలు

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తల్లో నమ్మకం అంతకంతకు పెరుగుతోంది. కోవిడ్ తర్వాత ఏటా పెరుగుతున్న ఒప్పందాలు, వాస్తవ రూపంలోకి వచ్చిన పెట్టుబడులే దీనికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. 2021లో రూ.9,373 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి 47 ఒప్పందాలు కుదరగా 2022లో 54 యూనిట్ల ద్వారా రూ.16,137 కోట్ల విలువైన ఒప్పందాలు జరగడం గమనార్హం. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 18 యూనిట్ల ద్వారా రూ.7,187 కోట్ల విలువైన ఒప్పందాలు కుదిరాయి. అంటే గత 27 నెలల్లో కొత్తగా 119 యూనిట్లను ఆకర్షించడం ద్వారా రూ.32,697 కోట్ల పెట్టుబడులు ఏపీకి వచ్చాయి. మార్చిలో విశాఖ కేంద్రంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో 387 ఒప్పందాల ద్వారా రూ.13.11 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకోగా గరిష్టంగా ఆరు నెలల్లోనే పనులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

పగటి దోమ కాటు ప్రాణాంతకమే!

- పగటివేళ కుట్టే ఏడిస్ ఈజిప్టి దోమలు
- నిల్వ నీటివల్లే దోమల ఉత్పత్తి
- రాష్ట్రవ్యాప్తంగా 3వేలకు పైగా డెంగీ కేసులు
- అందులో సగానికి పైగా హైదరాబాద్‌లోనే..

పగటిపూట కుట్టే దోమ ప్రాణాంతకంగా పరిణమించింది. డెంగీ వ్యాప్తికి కారణమైన ఏడిస్ ఈజిప్టి దోమలతో జ్వర బాధితులు పెరుగుతున్నారు. డెంగీ కారక దోమల బెడద నుంచి రక్షించుకోవడమే శ్రేయస్కరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దోమల ఉత్పత్తికి కారణమయ్యే నిల్వ నీరు లేకుండా జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు. – సాక్షి, హైదరాబాద్



వానలు కురిసి తగ్గిన తర్వాత సీజన్‌లో సాధారణంగా డెంగీ వ్యాపిస్తుంది.. కానీ ఈ వ్యాధి ప్రస్తుతం నగరవ్యాప్తంగా ప్రబలుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 3వేలకుపైగా డెంగీ కేసులు నమోదైతే.. అందులో సగానికి పైగా నగరంలో నమోదవడం వ్యాధి తీవ్రతకు నిదర్శనం. గత ఆగస్టు నుంచి నెలకు 10 రెట్ల చొప్పున కేసులు పెరుగుతున్నాయని ఆసుపత్రుల గణాంకాలు చెబుతున్నాయి. డెంగీ జ్వరం వస్తే శరీరంలోని తెల్ల రక్తకణాల సంఖ్య తగ్గి ప్రాణాంతకంగా మారుతుంది. ఈ నేపథ్యంలో దోమల నివారణకు నగర ప్రజలు ప్రాధాన్యమివ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఏడిస్ ఈజిప్టి దోమ కాటేసే వేళలివే..

డెంగీకి దోహదం చేసే ఏడిస్ ఈజిప్టి అనే దోమనే ఎల్లో ఫీవర్ మస్కిటో అనే పేరుతోనూ పిలుస్తారు. ఈ దోమలు ప్రధానంగా ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య, సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య ఎక్కువగా కుడతాయి. కాబట్టి ఈ సమయంలో దోమలు కుట్టకుండా అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఈ దోమలు చీలమండలు, మోచేతుల దగ్గర ఎక్కువగా కుడతాయని గ్రహించాలి. వీలుంటే ఆయా శరీర భాగాల్లో మనకు మార్కెట్లో లభించే దోమల నివారణ లేపనం పూయాలి.

దోమను ఎలా గుర్తించాలంటే..

ఏడిస్ ఈజిప్టి దోమను గుర్తించడానికి సులభమైన మార్గం వాటి నలుపు రంగు. కాళ్లపై తెల్లటి మచ్చలుంటాయి. దోమలను బయటకు తరిమికొట్టేందుకు ఇప్పుడు మార్కెట్లో మస్కిటో కాయిల్స్, లిక్విడ్స్ సహా అనేక రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. కానీ వీటిలో చాలా వరకూ పరోక్షంగా ఆరోగ్యానికి హాని కలిగించేవే. వాటి నుంచి విడుదలయ్యే కాలుష్యం ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉంది కాబట్టి జాగ్రత్తగా ఎంచుకోవాలి.

- **తులసి నూనె:** దోమలను తరిమికొట్టడానికి తులసి నూనె చాలా ప్రభావవంతమైనది. ఇది కీటక-వికర్షక సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. దీని వాసన దోమలను దూరంగా ఉంచుతుంది.
- **లెమన్‌గ్రాస్ ఆయిల్:** దోమల నుంచి రక్షణ కోసం లెమన్ గ్రాస్ ఆయిల్‌ను చాలాకాలంగా ఉపయోగిస్తున్నారు. ఈ నూనెను రాసుకుంటే కొన్ని గంటలపాటు దోమల నుంచి రక్షణ లభిస్తుంది.
- **లావెండర్ ఆయిల్:** చర్మంపై లావెండర్ ఆయిల్‌ను రాసుకుని ఆరుబయట సంచరించినా, నిద్రపోయినా దోమలు కుట్టవు.
- **పిప్పరమింట్ స్ప్రే:** కొబ్బరి నూనెలో పిప్పరమెంటు బిళ్లను కలిపి స్ప్రే బాటిల్‌లో నింపాలి. పిప్పరమింట్ ఆయిల్ దోమలను తరిమికొట్టడంలో చాలా ప్రభావవంతంగా పని చేస్తుంది.
- **యూకలిప్టస్ ఆయిల్:** నిమ్మకాయ, యూకలిప్టస్ నూనెను సమాన పరిమాణంలో కలపాలి. అదే నూనెలో ఆలివ్, కొబ్బరి, అవకాడో నూనె వేసి స్ప్రే బాటిల్‌లో నింపాలి. ఈ మిశ్రమాన్ని శరీరంపై స్ప్రే చేసుకోవడం ద్వారా దోమల బెడద నుంచి రక్షించుకోవచ్చు.

నిల్వ నీరే స్థావరాలు

నీరు నిల్వ ఉన్న చోట, తడి ప్రదేశాలలో ఈ దోమలు విపరీతంగా గుడ్లను పొదుగుతాయి. అవి మూడేళ్ల వరకు జీవించగలవు. కాబట్టి ఇంట్లో లేదా మరెక్కడైనా సరే మూలల్లో తడిగా, నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి. కొందరు మొక్కల కుండీల్లో నీటిని వదిలేస్తారు. అది కూడా ఈ దోమలకు స్థావరంగా మారుతుందని గుర్తుంచుకోవాలి.

ఉదాసీనత వద్దు

"డెంగీ నుంచి రక్షణకు దోమ కాటుకు గురవకుండా జాగ్రత్తలు తప్పనిసరి. ఈ వ్యాధికి చికిత్స.. దాని లక్షణాలపై ఆధారపడి ఉంటుంది. డెంగీ లక్షణాలుంటే ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి. రోగులు ఓఆర్ఎస్, మంచినీరు, కొబ్బరి నీళ్లు బాగా తీసుకోవాలి." – డాక్టర్ కె.శంకర్, సూపరింటెండెంట్, ఫీవర్ ఆస్పత్రి

డోలీ కట్టి.. మూడు కిలోమీటర్లు

- గర్భిణిని మోసుకొచ్చిన గిరిజనులు
- 108 ద్వారా ఆస్పత్రికి తరలింపు
- ములుగు జిల్లాలో ఘటన

ఏటూరు నాగారం: డోలీ కట్టి మూడు కిలోమీటర్ల మేర ఓ గర్భిణిని కుటుంబసభ్యులు మోసుకొచ్చి, అనంతరం 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించిన ఘటన ములుగు జిల్లాలో చోటు చేసుకుంది. ఏటూరునాగారం మండలం రాయబంధం గొత్తికోయగూడేనికి చెందిన గర్భిణి సోది పోసికి ఆదివారంరాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు ఆశ కార్యకర్తకు తెలియజేయగా ఆమె 108 సిబ్బందికి సమాచారం ఇచ్చింది. గ్రామానికి సరైన రోడ్డుమార్గం లేకపోవడంతో అక్కడికి అంబులెన్సు రాదని సిబ్బంది చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మంచానికి తాళ్లుకట్టి డోలీగా మార్చి మూడు కిలోమీటర్ల దూరం మోసుకొచ్చారు. ఆ తర్వాత అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.



మంచంలో మోసుకొచ్చి అంబులెన్సు ఎక్కిస్తున్న దృశ్యం



గచ్చిబౌలిలో అరీట్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్. చిత్రంలో ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ప్రభాకర రాజు, చైర్మన్ డాక్టర్ విజేందర్ రెడ్డి తీగెల, ఎండీ వాసు గుత్తా

గ్లోబల్ మెడికల్ హబ్‌గా హైదరాబాద్

మంత్రి హరీశ్‌రావు

హఫీజ్‌పేట్(హైదరాబాద్): హైదరాబాద్ మహానగరం 'గ్లోబల్ మెడికల్ హబ్'గా రూపొందిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నగరం ఇప్పటికే ఫార్మాహబ్‌గా, వ్యాక్సిన్ హబ్, ఐటీ హబ్‌గా గుర్తింపు సాధించిందని ఆయన గుర్తు చేశారు. గచ్చిబౌలిలోని బయోడైవర్సిటీ పార్కు ఎదురుగా అరీట్ ఆస్పత్రిని మంత్రి హరీశ్‌రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో హైదరాబాద్‌లో మెడికల్ టూరిజం బాగా అభివృద్ధి చెందుతోందన్నారు. దీంతో ట్యాక్సీ డ్రైవర్లకే కాకుండా డాక్టర్లు, టెక్నీషియన్లు, వైద్య సిబ్బందికి పనులు పెరగడంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా వైద్య చికిత్స కోసం నగరానికి వస్తున్నారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు పేద, మధ్యతరగతి వారికి తక్కువ ధరకే వైద్యం అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా వారు చర్యలు చేపట్టాలని కోరారు. హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయస్థాయి అరీట్ ఆస్పత్రి అందుబాటులోకి రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. అరీట్ ఆస్పత్రుల చైర్మన్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రి సేవలు పొందడంలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించడం, విశ్వసనీయ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. మేనేజింగ్ డైరెక్టర్ వాసుగుత్తా మాట్లాడుతూ అరీట్ ఆస్పత్రిలో ఆరోగ్య సంరక్షణకు మించిన సంరక్షణ ఉంటుందన్నారు. అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులో తీసుకొచ్చామని చెప్పారు ఈ కార్యక్రమం అరీట్ ఆస్పత్రుల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభాకర్‌రాజు, డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ వేముల తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాల అమల్లో రెవెన్యూ, పోలీసు విభాగాల నిర్లక్ష్యం

- నిందితులకు పోలీసులే స్టేషన్ బెయిల్ ఇస్తున్నారు
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు దళిత బహుజన్ ఫ్రంట్ వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాల అమల్లో రెవెన్యూ, పోలీసు విభాగాలు అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఆగ్రహం వ్యక్తం చేసింది. అట్రాసిటీ చట్టాల అమల్లో ఈ రెండు విభాగాలు వివక్ష పాటిస్తున్నాయని పేర్కొంది. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. దళిత బహుజనుల ఫ్రంట్ రాష్ట్ర జాతీయ కార్యదర్శి పి.శంకర్, కార్యదర్శులు ఎగొండ స్వామి, పులి కల్పన, చుంచు రాజేందర్ తదితరులు ఆదివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయిలో ప్రజాసంఘాలతో కూడిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. మూడు నెలలకోసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను తప్పకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దళితులపై దాడులు చేస్తున్న నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపకుండా పలు రకాల సాకులు చూపి నిందితులకు పోలీసులే స్టేషన్ బెయిల్ ఇస్తున్నారని, దీంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం స్ఫూర్తిని నీరుగార్చినట్లవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు చట్టం ప్రకారం అందించాల్సిన తక్షణ సహాయం, నష్టపరిహారం, పునరావాసం కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.